శుక్రవారం
11•1•2019
కరీంనగర్
• వెల. రూ.6.50
• సంపుటి 8 • సంచిక 197
• పేజీలు: 16 + 16

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

ఈబీసీ బిల్లు రాజ్యాంగ వ్యతిరేకం

కొట్టివేయాలంటూ సుప్రీంకోర్టులో ఓ స్వచ్ఛంద సంస్థ పిటిషన్

రిజర్వేషన్లపై 50% పరిమితిని బిల్లు ఉల్లంఘిస్తున్నదని వాదన

5



అలోక్‌వర్మకు ఉద్వాసన

సీబీఐ చీఫ్ పదవి నుంచి తొలగింపు

- ప్రధాని నేతృత్వంలోని అత్యున్నత కమిటీ సంచలన నిర్ణయం
- అగ్నిమాపక సేవల విభాగానికి డీజీగా బదిలీ
- సీబీఐ పగ్గాలు మళ్లీ ఎం నాగేశ్వరరావుకు

5

సీబీఐ డైరెక్టర్ అలోక్‌వర్మకు ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని అత్యున్నత కమిటీ ఉద్వాసన పలికింది. ఆయనను తిరిగి విధులలో కొనసాగించాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన రెండు రోజులకే గెంటివేసింది. అవినీతి ఆరోపణలు, విధి నిర్వహణలో అలక్ష్యం కారణంగా తొలగిస్తున్నట్టు ప్రకటించిన ప్రభుత్వం.. ఆయనను అగ్నిమాపక సేవల విభాగానికి డీజీగా బదిలీచేసింది. సీబీఐ డైరెక్టర్ బాధ్యతలను అదనపు డైరెక్టర్‌గా ఉన్న మన్నెం నాగేశ్వరరావుకు మరోసారి అప్పగించింది. అలోక్‌వర్మను తొలగించాలన్న నిర్ణయాన్ని అత్యున్నత కమిటీలో సభ్యుడిగా ఉన్న కాంగ్రెస్ నాయకుడు మల్లికార్జున్ ఖర్గే తీవ్రంగా వ్యతిరేకించారు. దర్యాప్తు అంటేనే ప్రధాని మోదీ భయపడుతున్నారని, అందుకే అలోక్ వర్మపై వేటువేశారని కాంగ్రెస్ ఆరోపించింది.

బరిగీసిన పల్లెలు

తొలివిడుత పంచాయతీ పోరుకు ముగిసిన నామినేషన్ల పరిశీలన • ఇక ప్రచారపర్వం



జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రంలో గురువారం సర్పంచ్ అభ్యర్థులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

తొలి విడుత పంచయతీ

	మొత్తం స్థానాలు	దాఖలైన నామినేషన్లు
సర్పంచ్	4,479	27,940
వార్డులు	39,822	97,690

360కి పైగా గ్రామాలు ఏకగ్రీవమయ్యే అవకాశం

- నేటి నుంచి రెండో విడుత నామినేషన్ల స్వీకరణ
- గత ఎన్నికల్లో ఈసీ అనర్హత వేటుకు గురైనవారికి మరో అవకాశం కల్పించిన హైకోర్టు
- కో-ఆపరేటివ్ డైరెక్టర్లూ పోటీ చేయొచ్చన్న ఎన్నికల సంఘం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

పంచాయతీ పోరు ఊపందుకుంది. పల్లెల్లో ఎన్నికల కోలాహలం పెరిగింది. తొలివిడుత ఎన్నికలు జరుగనున్న పంచాయతీల్లో గురువారం నామినేషన్ల పరిశీలన పూర్తికాగా.. శుక్రవారం నుంచి రెండో విడుత గ్రామాల్లో నామినేషన్ల ఘట్టానికి తెరలేవనున్నది. దీంతో బుజ్జగింపులు, అభ్యర్థుల ముందస్తు ప్రచారాలు, ఆశావహుల హడావుడితో పల్లెల్లో ఎన్నికల వేడి మరింత పెరిగింది. తొలివిడుతలో 4,479 గ్రామాలకు ఎన్నికలు జరుగుతుండగా సర్పంచ్, వార్డు స్థానాలకు కలిపి మొత్తం 1,25,630 నామినేషన్లు దాఖలయ్యాయి. అదేసమయంలో అనేక గ్రామాలు 'ఏకగ్రీవం'తో తమ ఐక్యతను చాటుకున్నాయి. 360కి పైగా గ్రామాల్లో సింగిల్ నామినేషన్లు దాఖలైనట్టు సమాచారం. శుక్రవారం నుంచి రెండో విడుత పంచాయతీల్లో నామినేషన్ల ప్రక్రియ మొదలుకానుంది. 4,137 గ్రామాలకు సంబంధించిన ఉదయం 10:30 గంటలకు జిల్లా కలెక్టర్లు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. ఈ నెల 13వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరిస్తారు.

నామినేషన్ల పరిశీలన పూర్తి

తొలి విడుతలో నామినేషన్ల పరిశీలన గురువారంతో ముగిసింది. బుధవారం వరకు దాఖలు చేసిన నామినేషన్లను రిటర్నింగ్ అధికారులు పరిశీలించారు. చాలా ఎక్కువ నామినేషన్లు ఉండటంతో గురువారం అర్ధరాత్రి వరకు

మిగతా 4వ పేజీలో



రెండ్రోజుల్లో

నిజామాబాద్ నగర శివారులోని కంఠేశ్వర్ బైపాస్‌రోడ్డును కప్పేసిన మంచు దుప్పటి

మరింత చలి

- ఉత్తరాది నుంచి శీతలగాలులు
- మంచుదుప్పట్లో రాష్ట్రం
- ఆదిలాబాద్ జిల్లా అర్లి(టీ)లో 5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత
- హైదరాబాద్‌లో 10.9గా నమోదు

హైదరాబాద్/సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:

ఉత్తరాది నుంచి వీస్తున్న శీతలగాలుల తీవ్రతతో రాష్ట్రంలో రానున్న రెండు రోజుల్లో చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉన్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదవుతుండటంతో పొడిగాలులు వీస్తున్నట్టు వెల్లడించారు. శుక్ర, శనివారాల్లో ప్రధానంగా ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కామారెడ్డి, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో చాలా ప్రాంతాల్లో శీతలగాలుల తీవ్రత ఎక్కువగా ఉంటుందని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా

మిగతా 4వ పేజీలో



త్వరలో ఎమ్మెల్సీ పోరు!

- ఫిబ్రవరి చివరిలో 13 స్థానాలకు నోటిఫికేషన్?
- మార్చి 29నాటికి ఎనిమిది మంది ఎమ్మెల్సీలు.. మే 1న ఒక ఎమ్మెల్సీ పదవీకాలం పూర్తి
- ఇప్పటికే ఖాళీగా నాలుగు స్థానాలు
- ఫిరాయించిన ముగ్గురిపై టీఆర్‌ఎస్ ఫిర్యాదు
- ఈ మూడుస్థానాలకూ ఎన్నికలు జరిగే అవకాశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వచ్చేనెల మూడోవారంలో ఎమ్మెల్సీ ఎన్నికల నగరా మోగనున్నది. ఇందుకు నోటిఫికేషన్ విడుదల చేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు చేస్తున్నది. ఇప్పటికే ఖాళీ అయిన, త్వరలో ఖాళీ కాబోతున్న స్థానాలకు ఏకకాలంలో ఎన్నిక నిర్వహించాలని ఈసీ భావిస్తున్నట్టు సమాచారం. శాసనమండలిలో మొత్తం 40 స్థానాలు ఉండగా, ప్రతి రెండేండ్లకోసారి మూడోవంతు స్థానాలు ఖాళీ అవుతాయి. కేంద్ర ఎన్నికల సంఘం వాటికి ఎన్నికలు

మిగతా 4వ పేజీలో


ఫిషరీస్ హబ్‌గా హైదరాబాద్



2

- మత్స్యపరిశ్రమకు రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహం
- వెయ్యి కోట్లతో అత్యాధునిక పరికరాల అందజేత
- మత్స్యశాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా వెల్లడి
- రూ.7,500 కోట్లతో కేంద్రం ప్రత్యేక నిధి
- జనవరి 31 నుంచి ఫిబ్రవరి రెండు వరకు హైటెక్స్‌లో ఆక్వా ఎక్స్‌పో-2019

అయోధ్య కేసులో మరో మలుపు



- న్యాయవాది వ్యాఖ్యలతో బెంచ్ నుంచి తప్పుకొన్న జస్టిస్ యూయూ లలిత్
- కొత్తగా మరోసారి రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు
- 29న జరుగనున్న విచారణ

5

చిన్న వ్యాపారులకు పెద్ద ఊరట



- జీఎస్టీ మినహాయింపు పరిమితి రెట్టింపు
- వార్షిక టర్నోవర్ రూ.20 లక్షల నుంచి 40 లక్షలకు పెంపు
- 32వ జీఎస్టీ మండలి సమావేశంలో నిర్ణయం

11

జలవిద్యుత్‌కే శ్రీశైలం

- సాగర్‌కు నీటి విడుదలతో రెండు రాష్ట్రాలకు సాగునీరు
- కృష్ణాబోర్డుకు మరోసారి స్పష్టంచేసిన తెలంగాణ
- తొమ్మిదో బోర్డు సమావేశ మినిట్స్‌పై తీవ్ర అసంతృప్తి
- బోర్డుకు ఘాటుగా లేఖరాసిన ఈఎన్సీ మురళీధర్‌రావు

2






గురువారం తెలంగాణభవన్‌లో టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావును కలిసి నారాయణపేటను ప్రత్యేక జిల్లా చేసినందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్న స్థానిక ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు, నామినేటెడ్ ఎమ్మెల్యేగా నియమితులైన స్టీఫెన్‌సన్, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ తాడూరి శ్రీనివాస్



ఎంబీసీల సమస్యలపై కేటీఆర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జాతీయ ఎంబీసీ సంఘం అధ్యక్షుడు కేసీ కాలప్ప, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్



గురువారం హైదరాబాద్‌లో టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావును కలిసి తమ సమస్యలను వివరిస్తున్న మైనార్టీలు

14, 15 తేదీల్లో జూనియర్ కాలేజీలకు సంక్రాంతి సెలవులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కాలేజీలకు ఈ నెల 14, 15 తేదీల్లో సంక్రాంతి సెలవులను ప్రకటించినట్టు ఇంటర్మీడియట్ బోర్డు సెక్రటరీ ఏ అశోక్ తెలిపారు. ఈ నెల 16 నుంచి యథావిధిగా తరగతులు నిర్వహిస్తామని, ఈ మేరకు ప్రిన్సిపాళ్లు చర్యలు తీసుకోవాలని బోర్డు సెక్రటరీ సూచించారు.

నేటి నుంచి స్కూళ్లకు సంక్రాంతి సెలవులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సంక్రాంతి పండుగ సందర్భంగా శుక్రవారం నుంచి పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. ఈ నెల 17 వరకు సెలవులు కొనసాగుతాయి. 18వ తేదీన తరగతులు పునఃప్రారంభం అవుతాయని పాఠశాల విద్యాశాఖ అధికారులు తెలిపారు.

14 వరకు వెబ్ ఆప్షన్ల నమోదు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మండల ప్లానింగ్ ఆఫీసర్, స్టాటిస్టికల్ ఆఫీసర్, అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీలో భాగంగా వెబ్ ఆప్షన్లు నమోదుచేసుకోవాలని టీఎస్‌పీఎస్సీ సూచించింది. ఈ నెల 14వ తేదీతో ఆప్షన్ల నమోదు ముగుస్తుందని స్పష్టంచేసింది.

టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్లో ఎస్జీటీ జాబితా

తమ వెబ్‌సైట్లో ఎస్జీటీ (ఇంగ్లిష్ మీడియం) జాబితాను పొందుపరిచినట్టు టీఎస్‌పీఎస్సీ ప్రకటించింది. 909 ఖాళీలకు చెందిన వివరాలు వెబ్‌సైట్లో అందుబాటులో ఉన్నాయని పేర్కొంది.

ముహూర్తం



సూర్యోదయం: 6.53 గంటలకు



సూర్యాస్తమయం: 5.55 గంటలకు

విళంబినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, పుష్యమాసం, శుక్లపక్షం పంచమి రాత్రి 7.57 వరకు, తదుపరి షష్ఠి, నక్షత్రం: పూర్వాభాద్ర, అమృతఘడియలు: రాత్రి 11.47 నుంచి 1.23 వరకు, రాహుకాలం ఉదయం 11.01 నుంచి మధ్యాహ్నం 12.24 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 9.05 నుంచి 9.49 వరకు, తిరిగి మధ్యాహ్నం 12.46 నుంచి 1.30 వరకు, వర్జ్యం: మధ్యాహ్నం 1.04 నుంచి 2.40 వరకు.

లోకం పోకడ



మీరు అర్జెంటుగా ఆ టాబ్లెట్లు వదేసి ఈ టాబ్లెట్లు వాడండి!

జల విద్యుత్‌కే శ్రీశైలం

- సాగర్‌కు నీటి విడుదలతో రెండు రాష్ట్రాలకు సాగునీరు
- కృష్ణాబోర్డుకు మరోసారి స్పష్టంచేసిన తెలంగాణ
- తొమ్మిదో బోర్డు సమావేశ మినిట్స్‌పై తీవ్ర అసంతృప్తి
- బోర్డుకు ఘాటుగా లేఖరాసిన ఈఎన్సీ మురళీధర్‌రావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: శ్రీశైలం జలాశయంనుంచి కరంటు ఉత్పత్తి ద్వారా నాగార్జునసాగర్‌కు నీటి విడుదలపై ప్రతిసారీ తెలంగాణను నియంత్రించేందుకు ప్రయత్నిస్తున్న కృష్ణా బోర్డుకు నీటిపారుదలశాఖ మరోసారి సరైన కౌంటర్ ఇచ్చింది. 'అసలు శ్రీశైలం ప్రాజెక్టు నిర్మించిందే జల విద్యుత్ కోసం. అక్కడ కరంటు ఉత్పత్తి ద్వారా నాగార్జునసాగర్‌కు నీటిని వదిలి.. సాగర్ నుంచి రెండు తెలుగు రాష్ట్రాలు తాగు, సాగునీటి అవసరాలు తీర్చుకుంటాయి' అని నీటిపారుదలశాఖ ఈఎన్సీ మురళీధర్‌రావు కృష్ణా నదీ యాజమాన్య బోర్డుకు తాజాగా స్పష్టంచేశారు. గతంలో జరిగిన తొమ్మిదో బోర్డు సమావేశంలోనూ ఇదే విషయాన్ని సాక్షాత్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి వెల్లడించారని, కానీ ఆ సమావేశ మినిట్స్‌లో మాత్రం ఈ అంశాన్ని పొందుపరచలేదని రెండు రోజుల కిందట బోర్డుకు రాసిన లేఖలో ఈఎన్సీ పేర్కొన్నారు.

సీఎస్ చెప్పిన అంశాలను పట్టించుకోని బోర్డు

శ్రీశైలం ఎడమగట్టు విద్యుత్ కేంద్రం ద్వారా కరంటు ఉత్పత్తితో సాగర్‌కు తెలంగాణ నీటిని విడుదల చేస్తారు. ఈ నీటి విడుదలపై ఏపీ కొంతకాలంగా తరచూ కృష్ణా బోర్డుకు ఫిర్యాదు చేస్తున్నది. శ్రీశైలంలో నీటిమట్టం తగ్గుతుందని, వెంటనే కరంటు ఉత్పత్తి ద్వారా నీటి విడుదల నిలిపివేయాలంటూ బోర్డుకు ఏపీ లేఖ రాయడం.. అందుకు బోర్డు తలూపుతూ తరచూ తెలంగాణను నీటి విడుదల నిలిపివేయాలంటూ ఉత్తర్వులు ఇవ్వడం పరిపాటిగా మారింది. ఈ నేపథ్యంలోనే గతంలో జరిగిన తొమ్మిదో బోర్డు సమావేశంలో సీఎస్ ఎస్కే జోషి ఈ అంశంపై స్పష్టత ఇచ్చారు. కానీ బోర్డు ఉన్నతాధికారులు సమావేశ మినిట్స్‌లో సీఎస్ వెల్లడించిన అంశాలను పొందుపరచలేదు. దీనిపై తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తంచేస్తూ ఈఎన్సీ మురళీధర్‌రావు బోర్డుకు లేఖ రాశారు. ఈ సందర్భంగా శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణం వెనుక ఉద్దేశాన్ని మరోసారి బోర్డుకు స్పష్టంచేశారు. తిత్లీ తుఫాన్ వల్ల గ్రిడ్ ఫెయిల్ కావడంతో తెలంగాణ శ్రీశైలంలో కరంటు ఉత్పత్తిని ఎక్కువగా చేయడం అనివార్యంగా మారిందని సీఎస్ జోషి చెప్పిన విషయాన్ని కూడా సమావేశ మినిట్స్‌లో ఎందుకు పొందుపరచలేదని ఈఎన్సీ ప్రశ్నించారు. పెన్నా బేసిన్‌లోని జిల్లాల తాగునీటి అవసరాలు (రాయలసీమ) అంటూ పదేపదే ఏపీ బోర్డుకు నీటి కోసం లేఖ రాసి పెద్ద ఎత్తున కృష్ణాజలాలను తరలించుకుపోవడం కూడా పరిపాటిగా మారింది. దీనిపైనా సీఎస్ ఎస్కే జోషి బోర్డుకు సూచన చేశారు. అసలు కృష్ణా బేసిన్ అవతల ఉన్న బేసిన్ జనాభా ఎంత? తాగునీటి అవసరాలు ఎంత? అనే వివరాలను బోర్డు సేకరించాలని, తద్వారా తాగునీటి అవసరాలకు నీరు విడుదలచేయాలని కూడా చెప్పారు. ఈ కీలక అంశాలను కూడా బోర్డు ఉన్నతాధికారులు సమావేశ మినిట్స్‌లో పొందుపరచకపోవడాన్ని ఈఎన్సీ ఎత్తి చూపారు.



డీపీఆర్‌లు ఇస్తామని ఒప్పుకోలేదు

బోర్డు తొమ్మిదో సమావేశ మినిట్స్‌లో తెలంగాణలోని కొన్ని సాగునీటి ప్రాజెక్టుల సమగ్ర ప్రాజెక్టు నివేదికలు (డీపీఆర్) ఇచ్చేందుకు తెలంగాణ అంగీకరించినట్టు పేర్కొన్నారని, కానీ తామేమీ ఒప్పుకోలేదని ఈఎన్సీ స్పష్టంచేశారు. మినిట్స్‌లో ఆ అంశాన్ని సవరించాలని సూచించారు. బచావత్ ట్రిబ్యునల్‌లోని ఏడో క్లాజు ప్రకారం హైదరాబాద్, మిషన్ భగీరథ కింద తాగునీటి కోసం తెలంగాణ వినియోగిస్తున్న నీటిలో 20 శాతాన్ని మాత్రమే లెక్కలోకి తీసుకోవాలని, ఈ అంశాన్ని మినిట్స్‌లో చేర్చాలని కోరారు. కొన్నిరోజుల కిందట జరిగిన త్రిసభ్య కమిటీ సమావేశ మినిట్స్‌ను ఇప్పటివరకు విడుదల చేయలేదని, వెంటనే వాటిని రెండు రాష్ట్రాలకు పంపాల్సిందిగా ఈఎన్సీ తెలిపారు.



గురువారం తెలంగాణభవన్‌లో టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసిన ఆశ్రమ యజమానులు మేరెడ్డి సత్యనారాయణరెడ్డి, జానకమ్మ, ఎమ్మెల్యే సునీత

వృద్ధాశ్రమం ప్రభుత్వానికి అప్పగింత

- వృద్ధ దంపతుల సేవాదృక్పథాన్ని కొనియాడిన టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సొంత డబ్బుతో నిర్మించిన వృద్ధాశ్రమాన్ని వృద్ధ దంపతులు ప్రభుత్వానికి అప్పగించారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పెద్దకొండూరులో నిర్మించిన వృద్ధాశ్రమాన్ని ప్రభుత్వానికి విరాళంగా ఇచ్చేందుకు ఆశ్రమ యజమానులు మేరెడ్డి సత్యనారాయణరెడ్డి, జానకమ్మ దంపతులు ముందుకొచ్చారు. గురువారం తెలంగాణభవన్‌లో టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావును కలిసి వృద్ధాశ్రమ వివరాలు అందించారు. ఎకరంన్నరలో ఆరువేల చదరపు అడుగుల భవనాన్ని సొంతఖర్చుతో నిర్మించామని, దీని విలువ రూ.కోటివరకు ఉంటుందని, అనారోగ్యం రీత్యా భవనంతోపాటు పూర్తి ఆశ్రమాన్ని ప్రభుత్వానికి విరాళంగా ఇవ్వడం ద్వారా వృద్ధులకు సేవలు కొనసాగేలా చూడాలని వారు కేటీఆర్‌ను కోరారు. కేటీఆర్ స్పందిస్తూ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్‌రెడ్డి, యాదాద్రి జిల్లా కలెక్టర్ అనితారామచంద్రన్ మీతో మాట్లాడుతారని తెలిపారు. సేవా కార్యక్రమాన్ని కొనసాగించేలా ప్రభుత్వంనుంచి అవసరమైన సహాయం అందేలా చూస్తామని హామీఇచ్చారు. కలెక్టర్‌తోనూ కేటీఆర్ మాట్లాడారు. దంపతుల సేవా దృక్పథాన్ని, దాతృత్వాన్ని కేటీఆర్ కొనియాడారు.

తెలంగాణ గురుకులాలు భేష్

- పుదుచ్చేరి మంత్రుల బృందం కితాబు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ : తెలంగాణలో గురుకుల విద్యాలయాల నిర్వహణ అద్భుతంగా ఉన్నదని పుదుచ్చేరి మంత్రుల బృందం ప్రశంసించింది. గౌలిదొడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాన్ని గురువారం పుదుచ్చేరి విద్యాశాఖ మంత్రి కమలాకన్నన్, సంక్షేమశాఖ మంత్రి కందస్వామి, ఆ రాష్ట్ర అధికారులతో కూడిన బృందం సందర్శించింది. తెలంగాణ ప్రభుత్వం ఉన్నతాశయంతో ప్రారంభించిన గురుకులాల నిర్వహణపై అవగాహన పెంచుకొనేందుకు వచ్చినట్టు తెలిపారు. గురుకుల విద్యాలయాలను విస్తరించడమే కాకుండా సాంఘిక సంక్షేమ సైనిక్ స్కూల్, ఫైన్‌ఆర్ట్స్ స్కూల్, ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ప్రిపరేటరీ డిగ్రీ కాలేజీ నిర్వహణను ఆ బృందం ప్రశంసించింది. గురుకులాల ప్రత్యేకతలను సాంఘిక సంక్షేమ గురకుల సొసైటీ కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ వారికి వివరించారు.



గౌలిదొడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాన్ని సందర్శిస్తున్న పుదుచ్చేరి మంత్రుల బృందం

పంటకాలనీల ఆలోచన అద్భుతం

- వ్యవసాయరంగ అభివృద్ధి, రైతాంగ సంక్షేమంలో కీలక ముందడుగు
- నేషనల్ బ్యూరో ఆఫ్ సాయిల్ సర్వే అండ్ ల్యాండ్ యూజ్ ప్లానింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్కే సింగ్
- వచ్చేనెలలో పంటకాలనీల ఏర్పాటుపై వర్క్‌షాపు: వ్యవసాయవర్సిటీ వీసీ డాక్టర్ ప్రవీణ్‌రావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పంటకాలనీలు ఏర్పాటుచేయాలన్న సీఎం కేసీఆర్ ఆలోచన అద్భుతమని భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి అనుబంధ విభాగమైన నేషనల్ బ్యూరో ఆఫ్ సాయిల్ సర్వే అండ్ ల్యాండ్ యూజ్ ప్లానింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్కే సింగ్ ప్రశంసించారు. సీఎం ఆలోచన వ్యవసాయరంగ అభివృద్ధిలో, రైతాంగ సంక్షేమంలో కీలక ముందడుగన్నారు. పంటకాలనీల ఏర్పాటుపై వ్యవసాయ వర్సిటీ ప్రవీణ్‌రావు గురువా రం తన చాంబర్‌లో డాక్టర్ ఎస్కే సింగ్, వ్యవసాయశాఖ అడిషనల్ డైరెక్టర్ విజయకుమార్, వర్సిటీ పరిశోధనా సంచాలకుడు డాక్టర్ జగదీశ్వర్, విస్తరణ సంచాలకుడు డాక్టర్ రాజిరెడ్డితో సమావేశం నిర్వహించారు. పంటకాలనీల ఏర్పాటుపై సీఎం కేసీఆర్ చాలా పట్టుదలతో ఉన్నారని వీసీ వివరించారు. వాతావరణ పరిస్థితులు, నేలలు, నీరు, ఇతర వనరులను పరిగణనలోనికి తీసుకొని మండలాలవారీగా పంటలు, పంటల సరళి, ఉత్పత్తి, ఉత్పాదకత మ్యాప్‌లను రూపొందించాలన్నారు. ఎక్కడ ఏయే ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటుకు అవకాశం ఉన్నదో రోడ్ మ్యాప్ రూపొందించాలని తీర్మానించారు. ఇందుకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ అండ్ మేనేజ్‌మెంట్ వీసీ డాక్టర్ చిండి వాసుదేవప్ప, ఇతర శాస్త్రవేత్తల సహకారం తీసుకోవాలని నిర్ణయించారు. వ్యవసాయశాఖ, వర్సిటీ, నేషనల్ బ్యూరో ఆఫ్ సాయిల్ సర్వే అండ్ ల్యాండ్ యూజ్ ప్లానింగ్ రూపొందించిన నివేదికను మరింత లోతుగా చర్చించడానికి ఫిబ్రవరి ఐదారు తేదీల్లో విస్తృత వర్క్‌షాప్ నిర్వహించి, నెలాఖరులో ప్రభుత్వానికి తుది నివేదిక సమర్పిస్తామని వీసీ తెలిపారు.



ఉన్నతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయవర్సిటీ వీసీ ప్రవీణ్‌రావు

కంటి వెలుగు@ కోటి 26 లక్షలు

- 7,436 గ్రామాల్లో శిబిరాల పూర్తి
- 19,84,878 మందికి కండ్లద్దాల పంపిణీ
- నిరాటంకంగా వైద్యశిబిరాల నిర్వహణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అంధత్వరహిత తెలంగాణ సాధన దిశగా.. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు సూచనమేరకు రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజల కోసం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న తెలంగాణ కంటివెలుగు కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా కోటి 26 లక్షల మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమం ప్రారంభమైన నాటినుంచి గురువారం వరకు రాష్ట్రవ్యాప్తంగా 7,436 గ్రామాల్లో, మున్సిపాలిటీల పరిధిలోని 614 వార్డుల్లో వైద్యశిబిరాల నిర్వహణ పూర్తయింది. కార్యక్రమం ప్రారంభమైన నాటి నుంచి గురువారం వరకు నిర్వహించిన కంటి వైద్యశిబిరాల్లో 1,26,88,203 మందికి కంటిపరీక్షలు చేయగా.. 19,84,878 మందికి కండ్లద్దాలు అందజేశారు. కాగా, గురువారం రాష్ట్రవ్యాప్తంగా 1,04,029 మందికి కంటిపరీక్షలు చేశారు.

కంటి వైద్య శిబిరాల్లో సేవలు పొందినవారి సంఖ్య

క్యాటగిరీ	గురువారం	మొత్తం శిబిరాల్లో
పరీక్షలు చేయించుకున్నవారు	1,04,029	1,26,88,203
రీడింగ్ అద్దాలు పొందినవారు	7,423	19,84,878
ప్రత్యేక అద్దాలకు ప్రతిపాదన	5,874	15,29,616
కంటి సమస్యలపై రెఫరల్	4,907	8,00,411
కంటి సమస్యలు లేనివారు	85,825	83,73,298



కంటి మసకలు పోయాయి

కొన్నిరోజులుగా కంటి మసకలు ఇబ్బంది పెడుతున్నాయి. కంటి వైద్యశిబిరాల గురించి తెలుసుకుని ఇక్కడకు వచ్చా. వైద్యసిబ్బంది అరగంటలోనే వైద్యపరీక్షలు నిర్వహించి, కండ్లజోడు ఇచ్చారు. కంటి సమస్యకు పరిష్కారం లభించింది. నాలాంటి నిరుపేదలకు కంటి వెలుగు శిబిరాలు ఎంతో ఉపయోగపడుతున్నాయి.

- ఏ అల్లమ్మ, మేదరబస్తీ, కొత్తగూడెం

మహిళా బిల్లునూ ఆమోదించాలి

- ట్విట్టర్‌లో ఎంపీ కవిత

హైదరాబాద్, నమస్తే తెలంగాణ : ఈబీసీ రిజర్వేషన్ల బిల్లును ఆమోదించినంత వేగంగా మహిళా రిజర్వేషన్ బిల్లు కూడా ఆమోదించాలని టీఆర్‌ఎస్ ఎంపీ కల్వకుంట్ల కవిత కోరారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదిస్తే.. దేశం నిజంగానే ప్రగతి సాధిస్తుందని ఆమె ట్విట్టర్‌లో కోరారు. ఈ బిల్లుకు పార్లమెంట్‌లో ఆమోదం లభించాలంటే బలమైన రాజకీయ సంకల్పం ఉండాలన్నారు.

ఈఎన్టీ పరీక్షల్లో సహకరిస్తాం

- నోవా ఈఎన్టీ సంస్థ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ ప్రభుత్వం చేపట్టబోయే ఈఎన్టీ శస్త్ర చికిత్సల్లో తమ వంతు సహకారం అందజేస్తామని నోవా ఈఎన్టీ దవాఖాన అధినేత, ప్రముఖ ఈఎన్టీ స్పెషలిస్ట్ డాక్టర్ ఎం మోహన్‌రెడ్డి తెలిపారు. గురువారం 'అడ్వాన్స్‌డ్ ఎండోస్కోపిక్ ఇయర్ సర్జరీ వర్క్‌షాప్' ముగింపు సభలో ఆయన మాట్లాడుతూ వైద్యాన్ని పల్లెల దాకా తీసుకువెళ్లేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్న కృషికి మద్దతునిస్తామని వెల్లడించారు.

ఫిషరీస్ హబ్‌గా హైదరాబాద్

- మత్స్యపరిశ్రమకు రాష్ట్రం ప్రోత్సాహం
- రూ.1000 కోట్లతో పరికరాల పంపిణీ
- హైటెక్స్‌లో 31 నుంచి ఆక్వా ఎక్స్‌పో
- సన్నాహక సమావేశంలో రాష్ట్ర మత్స్యశాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా వెల్లడి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్‌ను ఫిషరీస్ హబ్‌గా తీర్చిదిద్దాలనే సంకల్పంతో నాలుగేండ్లుగా సీఎం కేసీఆర్ ప్రయత్నిస్తున్నారని పలువురు వక్తలు చెప్పారు. ప్రభుత్వం మత్స్యపరిశ్రమకు అందిస్తున్న ప్రోత్సాహంతో రాష్ట్రంలో చేపల దిగుబడులు పెరిగాయన్నారు. సమీకృత మత్స్య అభివృద్ధిపథకం కింద రూ.1000 కోట్లతో అత్యాధునిక పరికరాలను మత్స్యకార సొసైటీలకు, మత్స్యకారులకు సర్కార్ అందజేసినట్టు వెల్లడించారు. జనవరి 31 నుంచి ఫిబ్రవరి 2వరకు హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో నిర్వహించే 'ఆక్వా ఎక్స్‌పో-2019' సన్నాహక సమావేశాన్ని గురువారం బేగంపేటలోని టూరిజం ప్లాజాలో నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు (ఎన్‌ఎఫ్‌డీబీ) సీఈవో రాణి కుముదిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశవ్యాప్తంగా చేపల పరిశ్రమలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్రం రూ.7,500 కోట్ల ప్రత్యేక నిధి ఏర్పాటు చేసిందన్నారు. తెలంగాణ మత్స్యశాఖ సహకారంతో నెక్లెస్‌రోడ్‌లో జనవరి 31 నుంచి ఫిబ్రవరి రెండువరకు 'ఫిష్ ఫెస్ట్' నిర్వహిస్తున్నట్టు ప్రకటించారు. శుసంవర్థక, మత్స్యశాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని మత్స్యకారుల అభివృద్ధికి ఉచిత చేపపిల్లలను పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. రాష్ట్రంలోని ప్రాజెక్టులు పూర్తయితే మంచినీటి వనరుల్లో చేపల పెంపకం చేపట్టనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మత్స్యశాఖ కమిషనర్ డాక్టర్ సువర్ణ, సీఫా అధ్యక్షుడు రామచంద్రరావు, చైర్మన్ విజయ్‌గుప్తా, ఆక్వా ఇండియా ఎక్స్ ప్రమోటర్ వేణు దంతలూరి, మత్సశాఖ అధికారులు పాల్గొన్నారు.



సన్నాహక సమావేశంలో సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న ఎన్‌ఎఫ్‌డీబీ సీఈవో రాణి కుముదిని, రాష్ట్ర మత్స్యశాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా తదితరులు

చైనా మాంజాపై నిషేధం

- ఆదేశాలు ఉల్లంఘిస్తే ఐదేండ్ల జైలు, లక్ష జరిమానా
- వెంటనే అమలుచేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించిన ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌మిశ్రా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు పర్యావరణానికి, పక్షులకు హానికలిగించే ప్లాస్టిక్, నైలాన్ చైనా మాంజాలను రాష్ట్ర ప్రభుత్వం నిషేధించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌మిశ్రా గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ప్లాస్టిక్, నైలాన్ చైనా మాంజాల తయారీ, అమ్మకాలు, నిల్వ, సరఫరాచేయరాదని సూచించారు. వీటితోపాటు సంక్రాంతి సందర్భంగా పతంగులను ఎగుర వేసేందుకు పదునైన దారాలను వాడరాదని, గాజు, ఇనుము వంటి వస్తువులను దారాలకు కట్టి ఎగురవేయరాదని సూచించారు. పర్యావరణానికి, పక్షులకు తీవ్రమైన హాని కలుగుతున్నదని పేర్కొన్నారు. నూలుపోగులతో తయారైన దారాలను మాత్రమే పతంగులు ఎగురవేసేందుకు ఉపయోగించాలని సూచించారు. ప్లాస్టిక్, నైలాన్ చైనా మాంజా వాడకం చట్టవిరుద్ధమని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి పర్యావరణ పరిరక్షణ చట్టం సెక్షన్ 15 కింద ఐదేండ్ల జైలుశిక్షకానీ, లక్ష వరకు జరిమానాకానీ, లేదా రెండూ విధిస్తామని హెచ్చరించారు. అన్ని జిల్లాల కలెక్టర్లు, తెలంగాణ పర్యాటక, సాంస్కృతికశాఖ జాతీయ ట్రిబ్యునల్ నిబంధనలకు అనుగుణంగా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.



గురువారం ఢిల్లీలో కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో భేటీ అయిన రాష్ట్ర గవర్నర్ నరసింహన్

ఢిల్లీలో గవర్నర్ బిజీ బిజీ

ప్రధాని, హోంమంత్రితో విడివిడిగా భేటీ

హైదరాబాద్,నమస్తే తెలంగాణ: ఉమ్మడి రాష్ట్రాల గవర్నర్ నరసింహన్ గురువారం ఢిల్లీలో బిజీబిజీగా గడిపారు. తన పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ, హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను కలిశారు. ఉదయం 11.30 గంటలకు ప్రధాని మోదీని కలిశారు. దాదాపు 45 నిమిషాలపాటు తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లోని తాజా రాజకీయ పరిస్థితులను చర్చించినట్టు సమాచారం. విశ్వసనీయంగా తెలిసిన సమాచారం ప్రకారం.. డిసెంబర్ 31న హైకోర్టు విభజన అనంతరం పరిస్థితులను వివరించారు. హైకోర్టు విభజనపై ముందుగా రాజకీయ విమర్శలు చేసినప్పటికీ అంతా సర్దుకున్నదని.. రెండు రాష్ట్రాల్లో కోర్టులు ప్రశాంతంగా పనిచేస్తున్నాయని తెలిపారు. హైకోర్టు న్యాయాధికారులు, ఉద్యోగుల విభజన కూడా ప్రశాంతంగా జరిగిందని పేర్కొన్నారు. తెలంగాణలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, పంచాయతీ ఎన్నికల నిర్వహిస్తున్న తీరును కూడా వివరించారు. ముఖ్యంగా రైతుబంధు పథకాన్ని ప్రధాని మోదీ దేశవ్యాప్తంగా అమలుచేయాలని యోచిస్తున్న నేపథ్యంలో ఈ పథకం అమలు తీరు, రైతులపై ఏవిధమైన ప్రభావం ఉందనే అంశాలను కూడా ఈ సందర్భంగా చర్చించినట్టు సమాచారం. గవర్నర్ నరసింహన్ సాయంత్రం కేంద్ర హోంశాఖమంత్రి రాజనాథ్‌సింగ్‌తోనూ భేటీ అయ్యారు.



గురువారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసి నారాయణపేట జిల్లా ఏర్పాటుచేసినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్న మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, నారాయణపేట ఎమ్మెల్యే ఎస్ రాజేందర్‌రెడ్డి

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

సూపర్‌న్యూమరరీ పోస్టులు సృష్టించడంపై ఇరిగేషన్ ఇంజినీర్ల హర్షం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పోలీస్‌శాఖ తరహాలో నీటిపారుదలశాఖలో కూడా దశాబ్దాలుగా పదోన్నతుల్లో ఉన్న అసమానతలను తొలిగించేందుకు సీఎం కేసీఆర్ చొరవచూపడంపై హైదరాబాద్ ఇంజినీర్స్ అసోసియేషన్ హర్షం ప్రకటించింది. సూపర్‌న్యూమరరీ పోస్టుల ద్వారా పదోన్నతుల సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించడంపై ఆనందం వ్యక్తంచేస్తూ ఇంజినీర్లు గురువారం జలసౌధలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అసోసియేషన్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించి ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ విశ్రాంత ఇంజినీర్ల సంఘం ప్రధాన కార్యదర్శి ఎం శ్యాంప్రసాద్‌రెడ్డి, తెలంగాణ ఇంజినీర్స్ జేఏసీ చైర్మన్ వెంకటేశం, హైదరాబాద్ ఇంజినీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మహేందర్, ప్రధాన కార్యదర్శి చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.



గురువారం జలసౌధలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న హైదరాబాద్ ఇంజినీర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

జాగృతి యూత్ లీడర్‌షిప్ కాన్ఫరెన్స్

- 18 నుంచి 20 వరకు హైదరాబాద్‌లో నిర్వహణ
- 103 దేశాల నుంచి 550 మంది ప్రతినిధులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ జాగృతి సంస్థ హైదరాబాద్ వేదికగా ప్రతిష్ఠాత్మక సదస్సుకు శ్రీకారం చుట్టింది. సుస్థిర అభివృద్ధి, నూతన ఆవిష్కరణల్లో యువతను భాగస్వాములను చేస్తూ తెలంగాణ జాగృతి ఇంటర్నేషనల్ యూత్ లీడర్‌షిప్ కాన్ఫరెన్స్ (టీజేఐవైఎల్‌సీ) ఈ నెల 18 నుంచి 20 వరకు జరుగనున్నది. హైటెక్స్ నోవాటెల్‌లో జరిగే ఈ సదస్సుకు ప్రపంచవ్యాప్తంగా 103 దేశాల నుంచి వివిధ రంగాలకు చెందిన 550 మంది ప్రతినిధులు హాజరుకానున్నారు. ప్రతినిధుల రిజిస్ట్రేషన్ ఇప్పటికే పూర్తయింది. గాంధేయమార్గంలో సుస్థిర అభివృద్ధి, నూతన ఆవిష్కరణలు ఇతివృత్తంగా సదస్సు కొనసాగనున్నది. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత ప్రారంభోపన్యాసం చేస్తారు. 16 దేశాల నుంచి 70 మంది వక్తలు సదస్సులో ప్రసంగిస్తారు. 40 మంది ఇన్నోవేటర్స్ కూడా పాల్గొంటారు. ఐక్యరాజ్యసమితి ప్రపంచదేశాలకు నిర్దేశించిన కాలుష్యం, పర్యావరణం, సముద్రంలో ఉన్న జీవరాశిని కాపాడటం, పేదరికం, మానవహక్కులను కాపాడటం, లింగవివక్షను రూపుమాపడం, భౌతిక వనరులు కాపాడటం తదితర 20 సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై సదస్సులో చర్చించనున్నారు. వనరులను సమర్థంగా వినియోగించుకోవడం, వాటిని భవిష్యత్‌తరాలకు అందించడం, నూతన ఆవిష్కరణలపై చర్చిస్తారు. ముగింపు కార్యక్రమంలో అవార్డులు అందజేయనున్నారు. 2008 నవంబర్ 3న ఏర్పాటైన తెలంగాణ జాగృతి సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రంతోపాటు దేశవ్యాప్తంగా పెద్దఎత్తున సంస్కృతి, సంప్రదాయాలు, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నిరుద్యోగ యువత, మహిళలు, రైతుల కోసం జాగృతి అనేక కార్యక్రమాలను చేపడుతున్నది.

సమాజంలో యువతదే కీలక పాత్ర



సమాజ అభివృద్ధిలో యువతది కీలకపాత్ర. యువత కోసం అనేక కార్యక్రమాలు చేసిన తెలంగాణ జాగృతి సంస్థ ఐక్యరాజ్యసమితి సూచించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాల అంశాలపై చర్చించేందుకు సదస్సును నిర్వహిస్తున్నది. పలు అంశాలపై వివిధ దేశాలకు చెందిన యువత చర్చించడం ద్వారా వాటికి పరిష్కార మార్గాలు, సలహాలు, సూచనలు అందనున్నాయి. రాష్ట్రంతోపాటు వివిధ దేశాల్లో అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్న జాగృతి సంస్థ ప్రపంచ స్థాయి సదస్సును నిర్వహిస్తున్నది.

– నవీన్ ఆచారి,
తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి

'పోలీస్' విభజనలో ఏపీ తొండాట

ముందస్తు ఒప్పందాలను పట్టించుకోకుండా సీనియార్టీ జాబితా తయారీ!

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఇరురాష్ట్రాల మధ్య ఉద్యోగుల విభజనలో ఆంధ్రప్రదేశ్ నిబంధనలు అతిక్రమిస్తున్నదని తెలంగాణ ప్రభుత్వం ఆరోపించినట్టు తెలుస్తున్నది. హోంశాఖలో ఇన్‌స్పెక్టర్ (సివిల్), డీఎస్పీ (సివిల్), అడిషనల్ ఎస్పీ (నాన్ క్యాడర్), ఎస్పీ (నాన్‌క్యాడర్) ర్యాంకు అధికారుల విభజనలో నిబంధనలు పాటించడంలేదని కేంద్ర ప్రభుత్వ సిబ్బంది శిక్షణ వ్యవహారాలశాఖ (డీవోపీటీ) సంయుక్త కార్యదర్శికి తెలంగాణ ప్రభుత్వం ఫిర్యాదుచేసినట్టు తెలిసింది. రెండు రాష్ట్రాల మధ్య రాష్ట్ర క్యాడర్ ఉద్యోగుల విభజనకు ఏపీ విభజన చట్టం ప్రకారం నియమించిన స్టేట్ అడ్వైజరీ కమిటీ(ఎస్‌ఏసీ) హోంశాఖ మినహా ఇతర అన్నివిభాగాల్లోని ఉద్యోగుల విభజన పూర్తిచేసిందని, హోంశాఖలోని డీఎస్పీలు, అడిషనల్ ఎస్పీ, ఎస్పీ(నాన్‌క్యాడర్)లలో విభజించాల్సి ఉన్నదని ప్రభుత్వవర్గాలు చెప్తున్నాయి. దీనిపై ఇటీవల నియమించిన ఎస్‌ఏసీ సబ్ కమిటీ నూతన ప్రతిపాదనలు చేసిందని, దీనిప్రకారం ఇటీవల ఏపీ ప్రభుత్వం రేంజ్, రాష్ట్రస్థాయి క్యాడర్ ఉద్యోగుల జాబితాపై వేర్వేరుగా జారీచేసిన నాలుగు జీవోల్లో సీనియార్టీ జాబితా, ఒకే క్యాటగిరీ ఉద్యోగుల సంఖ్యకు మొత్తం ఉద్యోగుల సంఖ్యకు తేడాలు ఉన్నాయని, ఏపీ ప్రభుత్వం జారీచేసిన జాబితాలన్నీ ఏపీ స్టేట్ సబార్డినేట్ సర్వీస్‌రూల్స్ 1996, రూల్ 34కు పూర్తివిరుద్ధంగా ఉన్నాయని అధికారులు అంటున్నారు. 2017 అక్టోబర్ నాలుగున మంగళగిరిలోని ఏపీ డీజీపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలోనూ రూల్ 34 ప్రకారం రెండురాష్ట్రాలకు ఉపయోగకరంగా ఉండేలా సీనియార్టీ జాబితాలు రూపొందించాలని నిర్ణయించినప్పటికీ, దానిని కూడా ఏపీ ప్రభుత్వం అతిక్రమించినట్టు ఆరోపిస్తున్నారు.

కాజీపేట-కాగజ్‌నగర్ మధ్య

'టాయిలెట్' రైళ్లు నడుపాలి

- సికింద్రాబాద్ డీఆర్‌ఎంకు ఎంపీ వినోద్ వినతి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కాజీపేట–కాగజ్‌నగర్ మధ్య టాయిలెట్ల సౌకర్యం ఉన్న రైళ్లను నడిపించాలని కరీంనగర్ ఎంపీ వినోద్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం రైల్వే యూజర్స్ అసోసియేషన్ సభ్యులతో కలిసి సికింద్రాబాద్ డీఆర్‌ఎం అమిత్‌వరదన్‌కు వినతిపత్రం సమర్పించారు. రూట్లలో నడిచే డెమోరైళ్లలో టాయిలెట్లు లేకపోవడంతో ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. కాజీపేట నుంచి కాగజ్‌నగర్ మార్గంలోని పలు ముఖ్యస్టేషన్లలో ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలని కోరారు.



బీఈఈ, సీపీడబ్ల్యూడీ మధ్య

కుదిరిన ఒప్పందం

- ఎనర్జీ కన్జర్వేషన్ బిల్డింగ్‌కోడ్ నిర్మాణాలకు ప్రోత్సాహం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫీషియన్సీ (బీఈఈ), సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ (సీపీడబ్ల్యూడీ) గురువారం న్యూఢిల్లీలో ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఎనర్జీ కన్జర్వేషన్ బిల్డింగ్‌కోడ్ (ఈసీబీసీ) నిబంధనల ప్రకారం నిర్మాణాలు చేపట్టేందుకు ఈ ఒప్పందం తోడ్పడుతుంది. తొలిదశలో 150 నిర్మాణాలకు స్టార్ ఇస్తామని, ఈసీబీసీ నిబంధనల వల్ల 260 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఆదా అవుతుందని కేంద్ర విద్యుత్‌శాఖ కార్యదర్శి అజయ్‌కుమార్ భల్లా తెలిపారు.

నాయకత్వ నైపుణ్యాలపై

పత్రాలు సమర్పించండి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

విద్యార్థుల నాయకత్వ నైపుణ్యాలపై పాఠశాలల నుంచి పరిశీలనపత్రాలను ఆహ్వానిస్తున్నట్లు ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ శేషుకుమారి తెలిపారు. ఈ పత్రాలను ఈ నెల 31లోగా స్కూల్ లీడర్‌షిప్ అకాడమీకి సమర్పించాలని సూచించారు. న్యూఢిల్లీలోని నేషనల్ సెంటర్ ఫర్ స్కూల్ లీడర్‌షిప్– నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ప్లానింగ్ అండ్ అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యంలో స్కూల్ లీడర్‌షిప్ అండ్ మేనేజ్‌మెంట్‌పై ఆరువారాల సర్టిఫికెట్ కోర్సును ఆన్‌లైన్ ద్వారా ఉచితంగా అందిస్తున్నారని తెలిపారు. వివరాల కోసం తెలంగాణ ఎస్సీఈఆర్టీ అధికారిక వెబ్‌సైట్‌తోపాటు సర్టిఫికెట్ కోర్సులకు pslm.nuepa.org అనే వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ నెల 13 నుంచి ఆన్‌లైన్ కోర్సులు అందుబాటులోకి వస్తాయన్నారు.



మొసలి మరణిస్తే.. ఊరు కన్నీరు



- 130 ఏండ్ల మకరాన్ని దైవంగా భావిస్తున్న ఛత్తీస్‌గఢ్‌లోని ఓ గ్రామం
- మొసలి అకాల మరణంతో గ్రామంలో విషాదం.. సంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు
- గ్రామంలో స్మారకం, దేవాలయ నిర్మాణానికి యోచన

రాయ్‌పూర్: మనిషికి, జంతువులకు మధ్య ఉండే అవినాభావ సంబంధాన్ని మాటల్లో వర్ణించలేం. ఛత్తీస్‌గఢ్‌లోని ఓ ఊరు మొసలిని ఏకంగా తమ దైవంగా, సంరక్షకురాలిగా భావిస్తూ ఆరాధనాభావంతో పూజలు చేస్తున్నది. 130 ఏండ్ల పాటు జీవించిన ఈ మకరం అకస్మాత్తుగా మరణించడంతో గ్రామమంతా శోకసంద్రమైంది. ఒక్క ఇంట్లో కూడా పొయ్యి వెలుగలేదు. ఊరుఊరంతా పస్తులున్నారు. ఈ ఆసక్తికరమైన సంఘటన రాష్ట్ర రాజధాని రాయ్‌పూర్‌కు 80 కి.మీ. దూరంలోని బెమితార జిల్లా బావ మహోతార గ్రామంలో చోటుచేసుకున్నది. ఊరి చెరువులో ఉంటున్న 130 ఏండ్ల మొసలిని గ్రామస్థులంతా దైవంగా భావిస్తారు. తమ సంరక్షుడైన మకరానికి ఏకంగా 'గంగారామ్' అని నామకరణం చేశారు. అయితే, వయోభారంతో మకరం కన్నుమూయడంతో ఊరిలో విషాదం నెలకొంది. ప్రజలంతా సంప్రదాయ పద్ధతిలో, భక్తి ప్రపత్తులతో మొసలి అంత్యక్రియలు నిర్వహించి ఘనంగా నివాళులు అర్పించారు. ప్రతి ఒక్కరు మకరాన్ని తాకి కడసారి ఆశీర్వాదాలు పొందారు. మొసలి శతాబ్దానికిపైగా నివసించిన చెరువు ఒడ్డునే దానికి స్మారకం, గ్రామంలో దేవాలయం నిర్మించనున్నట్లు గ్రామ సర్పంచ్ మోహన్ సాహు చెప్పారు. 'మా తాత తన చిన్నతనంలో ఈ మొసలిని చూశాడు. ఇది మా ఊరి దేవత. గ్రామస్థులు, చిన్నారులు చెరువులో ఈదుకుంటూ మకరం సమీపంలోకి వెళ్లినా ఎన్నడూ హాని తలపెట్టలేదు' అని పేర్కొన్నారు. 3.4 మీటర్ల పొడవు, 250 కిలోల బరువు ఉన్న గంగారామ్ వయస్సు 130 ఏండ్లు ఉంటుందని అటవీశాఖ అధికారి ఆర్కే సిన్హా చెప్పారు.

గ్రహాంతర జీవుల నుంచి సంకేతాలు!

రెండోసారి 'రిపీటింగ్ ఎఫ్ఆర్‌బీ'ని గుర్తించిన శాస్త్రవేత్తలు



కెనడియన్ సీహెచ్ఐఎమ్ఈ టెలిస్కోప్

టొరంటో: గ్రహాంతర జీవులు (ఏలియన్లు) ఉన్నారనే భావనకు మరింత బలం చేకూరింది. మన నక్షత్ర మండలానికి ఆవలి నుంచి ఒకే కేంద్రం (సోర్స్) ద్వారా వెలువడుతున్న రిపీటింగ్ ఫాస్ట్ రేడియో బరస్ట్(ఎఫ్ఆర్‌బీ– రేడియో సంకేతాలు) సంకేతాలను కెనడాకు చెందిన ఖగోళ శాస్త్రవేత్తలు రెండోసారి గుర్తించారు. బ్రిటిష్ కొలంబియాలో ఏర్పాటు చేసిన కెనడియన్ హైడ్రోజన్ ఇంటెన్సిటీ మ్యాపింగ్ ఎక్స్‌పరిమెంట్ (సీహెచ్ఐఎమ్ఈ) టెలిస్కోప్ ద్వారా ఈ సంకేతాలను గుర్తించారు. కొన్ని బిలియన్ కాంతి సంవత్సరాల దూరం నుంచి వెలువడే శక్తిమంతమైన పేలుళ్లకు సంబంధించిన రేడియో తరంగాలనే ఎఫ్ఆర్‌బీలుగా వ్యవహరిస్తారు. ఈ ఎఫ్ఆర్‌బీలు గ్రహమంత పరిమాణంలో ఉన్న ఏలియన్ ట్రాన్స్‌మిటర్స్ నుంచి వెలువడుతుండవచ్చని 'హార్వర్డ్ స్మిత్‌సోనియన్ సెంటర్ ఫర్ ఆస్ట్రోఫిజిక్స్' శాస్త్రవేత్తలు ప్రొఫెసర్ ఎవీ లియోబ్, మనస్వి లింగం 2017లో అభిప్రాయపడ్డారు. ఇప్పటివరకు 60 ఎఫ్ఆర్‌బీ సంకేతాలను గుర్తించగా, 2015లో తొలిసారిగా ఒకే సోర్స్ ద్వారా వెలువడుతున్న రిపీటింగ్ ఎఫ్ఆర్‌బీని కనుగొన్నారు. '2018 వేసవిలో గుర్తించిన 13 ఎఫ్ఆర్‌బీలలో ఈ రిపీటింగ్ ఎఫ్ఆర్‌బీ ఒకటి. 1.5 బిలియన్ కాంతి సంవత్సరాల దూరంలోని ఒకే ప్రాంతం నుంచి ఆరు సార్లు ఈ సంకేతాలు వెలువడ్డాయి' అని శాస్త్రవేత్తలు వెల్లడించారు. ఈ రేడియో తరంగాలు ఎక్కడి నుంచి వచ్చినా... వాటి పౌనఃపున్య శ్రేణి ఆసక్తికరంగా ఉందని వివరించారు. 'ఇప్పటివరకు ఒకే రిపీటింగ్ ఎఫ్ఆర్‌బీని కనుగొన్నారు. రెండోది గుర్తించడం ద్వారా ఇలాంటివి మరిన్ని ఉండే అవకాశం ఉన్నదని తెలుస్తున్నది' అని శాస్త్రవేత్త ఇన్‌గ్రిండ్ స్టైయిర్స్ అన్నారు. తాజాగా గుర్తించిన 13 ఎఫ్ఆర్‌బీల్లో 'వికిరణ' సంకేతాలు కనిపిస్తున్నాయని, రేడియో తరంగాలు వెలువడుతున్న ప్రాంత పరిసరాల గురించి తెలుసుకునేందుకు వీటి ద్వారా వీలవుతుందని శాస్త్రవేత్తలు తెలిపారు. సూపర్‌నోవా అవశేషం లేదా ఏదైనా గెలాక్సీలోని సెంట్రల్ బ్లాక్ హోల్ సమీపంలో ఈ రేడియో సంకేతాల కేంద్రం ఉండొచ్చని అభిప్రాయపడ్డారు.

పొత్తులకు ఆహ్వానం

- బీజేపీ తలుపులు తెరిచే ఉంటాయ్
- అటల్‌జీ నడిపిన సంకీర్ణ రాజకీయాలే ఆదర్శం
- తమిళనాడు బీజేపీ బూత్‌స్థాయి కార్యకర్తలతో వీడియో కాన్ఫరెన్స్‌లో మోదీ వ్యాఖ్య



చెన్నై, జనవరి 10: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో తమిళనాడులో ఎన్డీఏని బలోపేతం చేసే దిశగా ప్రధాని నరేంద్రమోదీ పొత్తులకు ఆహ్వానం పలికారు. పొత్తులకు బీజేపీ తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని వ్యాఖ్యానించారు. తమిళనాడులోని ఐదు జిల్లాలకు చెందిన బీజేపీ బూత్‌స్థాయి కార్యకర్తలతో ఆయన గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. 1990వ దశకంలో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి సంకీర్ణ రాజకీయాలను విజయవంతంగా నడిపారని మోదీ గుర్తు చేశారు. '20 ఏండ్ల క్రితం దార్శనిక నేత అటల్‌జీ దేశ రాజకీయాల్లో కొత్త సంస్కృతిని తెచ్చారు. అవే విజయవంతమైన సంకీర్ణ రాజకీయాలు. ప్రాంతీయ ఆకాంక్షలకు ఆయన ఎంతో ప్రాధాన్యమిచ్చారు. ఆయన చూపిన బాటలోనే బీజేపీ పయనిస్తుంది' అని మోదీ అన్నారు. అన్నాడీఎంకే, డీఎంకే, లేదా రజనీకాంత్ ఏర్పాటు చేయబోయే పార్టీతో బీజేపీ పొత్తుకు సిద్ధమా అని పార్టీ కార్యకర్త అడిగిన ప్రశ్నకు ఆయన పైవిధంగా సమాధానమిచ్చారు. 2014 లోకసభ ఎన్నికల్లో తమిళనాడులో డీఎండీఏ, పీఎంకే, ఎండీఎంకే తదితర ఆరు చిన్నపార్టీలతో కలిసి బరిలోకి దిగిన బీజేపీ కూటమి 39 స్థానాల్లో పోటీ చేసి కేవలం రెండే స్థానాల్లో గెలుపొందింది. అందులో ఓ స్థానంలో బీజేపీ గెలుపొందగా, మరోచోట పీఎంకే విజయం సాధించింది. ఎన్నికల అనంతరం ఆ పార్టీలన్నీ ఎన్డీఏకి గుడ్‌బై చెప్పడం గమనార్హం. ఈ నేపథ్యంలో పాత మిత్రులకు ఆయన ఆహ్వానం పలికారు. భారీ మెజార్టీ సాధించిన సందర్భాల్లో కూడా భాగస్వామ్య పక్షాలతో కలిసి ప్రభుత్వం నడిపేందుకే బీజేపీ ప్రాధాన్యమిచ్చిందని చెప్పారు. ప్రాంతీయ పార్టీలు, ఆకాంక్షల పట్ల కాంగ్రెస్ పార్టీ నిర్లక్ష్యంగా వ్యవహరించిందని విమర్శించారు. ప్రజలతో భాగస్వామ్యమే విజయవంతమైన భాగస్వామ్యమని, ప్రజలతో సంబంధాలు బలోపేతం చేసుకోవడంపై దృష్టిసారించాలని కార్యకర్తలకు సూచించారు.

రాఫెల్ ఒప్పందం జాప్యంలో మిషెల్ పాత్రేమిటి?

సాయుధ బలగాలకు కాంగ్రెస్ తీరని నష్టం కలిగించిందని ప్రధాని మోదీ ఆరోపించారు. ఒప్పందంలో తమకు 'డీల్' కుదరకపోతే రక్షణ ఉత్పత్తుల కొనుగోలును యూపీఏ ప్రభుత్వం నిలిపివేసేదని విమర్శించారు. మధ్యవర్తి మిషెల్‌కు సోనియా కుటుంబంతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని ఆరోపించారు. యూపీఏ హయాంలో రాఫెల్ ఒప్పందం పదేండ్లు జాప్యం చేసుకోవడం వెనుక మిషెల్ పాత్ర ఏమిటో ప్రజలకు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

బీజేపీ ఉపాధ్యక్షులుగా ముగ్గురు మాజీ సీఎంలు

న్యూఢిల్లీ: మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌ల మాజీ సీఎంలు శివరాజ్ సింగ్ చౌహాన్, వసుంధర రాజె, రమణ్‌సింగ్‌లను పార్టీ జాతీయ ఉపాధ్యక్షులుగా బీజేపీ నియమించింది. ఇటీవల జరిగిన ఈ మూడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల వరకు ఈ ముగ్గురు సీఎంలుగా ఉన్నారు. ఈ మూడు రాష్ట్రాల్లో బీజేపీ ఓడిపోయిన విషయం తెలిసిందే.

లోక్‌సభ ఎన్నికలే అజెండాగా..
నేటి నుంచి బీజేపీ జాతీయ సమావేశాలు
కార్యకర్తలకు దిశానిర్దేశం చేయనున్న మోదీ, అమిత్ షా

బీజేపీ జాతీయ కౌన్సిల్ సమావేశాలు శుక్రవారం నుంచి రెండు రోజులపాటు ఢిల్లీలో జరుగనున్నాయి. నాలుగున్నరేండ్ల పాలనలో సాధించిన ప్రగతి, సమాజంలో అన్ని వర్గాల ప్రజలకు చేరువకావడం ప్రధాన అజెండాగా ఈ సమావేశాలు జరుగనున్నాయి. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఈ సమావేశాలకు ప్రాధాన్యం సంతరించుకున్నది. శుక్రవారం సమావేశాలను బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా ప్రారంభిస్తారు. సమావేశాల ముగింపు సందర్భంగా శనివారం ప్రధాని మోదీ ప్రసంగిస్తారు. లోక్‌సభ ఎన్నికలకు అనుసరించాల్సిన వ్యూహంపై పార్టీ కార్యకర్తలకు వీరిద్దరు దిశానిర్దేశం చేసే అవకాశం ఉంది.

బరిగీసిన పల్లెలు

మొదటిపేజీ తరువాయి...

పరిశీలన ప్రక్రియ కొనసాగింది. చివరి రోజు కావడంతో బుధవారం ఒక్కరోజే సర్పంచ్ స్థానాలకు 19,416 నామినేషన్లు దాఖలు చేశారు. 4,479 గ్రామాలకు సంబంధించి సర్పంచ్, వార్డు స్థానాలకు మొత్తం 1,25,630 నామినేషన్లు దాఖలయ్యాయి. 4,479 సర్పంచ్ స్థానాలకు 27,940 నామినేషన్లు, 39,822 వార్డు స్థానాలకు 97,690 నామినేషన్లు దాఖలయ్యాయి. సగటున సర్పంచ్ స్థానానికి 6.23 మంది, వార్డుస్థానానికి 2.45 మంది పోటీపడుతున్నారు. అత్యధికంగా నల్లగొండ జిల్లాలో 304 సర్పంచ్ స్థానాలకు 2,231 మంది పోటీపడుతున్నారు. అత్యల్పంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 174 సర్పంచ్ స్థానాలకు 276 నామినేషన్లు దాఖలయ్యాయి. అర్హత సాధించిన నామినేషన్ల జాబితాను గురువారం అర్ధరాత్రి విడుదల చేశారు. అర్హత సాధించిన, తిరస్కరణకు గురైన నామినేషన్లపై శుక్రవారం అభ్యంతరాలను స్వీకరించనున్నారు. ఈ నెల 13న నామినేషన్ల తుది జాబితాను ప్రకటించి, గుర్తులను కేటాయించనున్నారు. 21న పోలింగ్ జరుగుతుంది.

నేటి నుంచి రెండో విడుత ఎన్నికల ప్రక్రియ

పంచాయతీ ఎన్నికల్లో భాగంగా శుక్రవారం నుంచి రెండో విడుత ఎన్నికల ఘట్టం ప్రారంభంకానున్నది. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు జిల్లాల్లో కలెక్టర్లు నోటిఫికేషన్ జారీ చేస్తారు. అనంతరం నిర్దేశించిన గ్రామాల్లో ఈ నెల 13వ తేదీ వరకు రిటర్నింగ్ అధికారులు నామినేషన్లను స్వీకరిస్తారు. 14న పరిశీలించి అర్హత సాధించిన నామినేషన్ల జాబితాను ప్రకటిస్తారు. 15న అభ్యంతరాలను స్వీకరించి, 16న పరిష్కరిస్తారు. 17న ఉపసంహరణలకు అవకాశం కల్పించి, అదేరోజు సాయంత్రం అభ్యర్థుల తుది జాబితాను విడుదలచేస్తారు. 25న పోలింగ్ జరుగుతుంది. ఎన్నికల సిబ్బంది కేటాయింపుపై రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి అశోక్‌కుమార్ జిల్లా కలెక్టర్లకు అత్యవసర ఆదేశాలు ఇచ్చారు. పోలింగ్ కేంద్రాల కేటాయింపు ఉత్తర్వులను సిబ్బందికి సంక్రాంతి లోపు అందించాలన్నారు. 15న రెండో విడుతలో నామినేషన్లపై అభ్యంతరాలను స్వీకరించనున్నారు.

అభివృద్ధి నినాదంతో ఏకగ్రీవం

తొలివిడుతలో 360కిపైగా గ్రామాల్లో సింగిల్ నామినేషన్ దాఖలైనట్టు సమాచారం. అవన్నీ ఏకగ్రీవం కానున్నాయి. ఇందులో కొత్త గ్రామాలు, గిరిజన తండాలే అధికంగా ఉన్నాయి.

కో ఆపరేటివ్ డైరెక్టర్లు కూడా అర్హులే

పంచాయతీ ఎన్నికల్లో కో–ఆపరేటివ్ సొసైటీలు, సహకార సంఘాల్లోని సభ్యులు, డైరెక్టర్లు పోటీ చేసేందుకు అర్హులేనని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి అశోక్‌కుమార్ తెలిపారు. ఈ విషయంలో పలు జిల్లాల నుంచి సందేహాలు వ్యక్తం కావడంతో గురువారం అత్యవసర ఆదేశాలు జారీచేశారు.

ఈసీ అనర్హతకు గురైనవారికి హైకోర్టు ఊరట

2013 పంచాయతీ ఎన్నికల్లో పోటీచేసి ఎన్నికల వ్యయంపై లెక్కలు చూపించకుండా కాలయాపన చేస్తున్న అభ్యర్థులు ప్రస్తుత ఎన్నికల్లో పోటీ చేయకుండా రాష్ట్ర ఎన్నికల సంఘం అనర్హత వేటువేసింది. మూడేండ్లపాటు మరే ఎన్నికల్లోనూ పోటీచేయకుండా ఆదేశాలు జారీచేసింది. వీరిలో సర్పంచ్, వార్డుస్థానాల అభ్యర్థులతో పాటు జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు కూడా ఉన్నారు. అయితే దాదాపు 200 మంది అభ్యర్థులు ఎన్నికల సంఘం అందజేసిన నోటీసులు తమకు అందలేదంటూ హైకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన న్యాయస్థానం.. ఎటువంటి నోటీసులు అందకుండానే ఎన్నికల సంఘం అనర్హతకు గురైన అభ్యర్థులు ఎన్నికల్లో పోటీ చేయవచ్చని ఆదేశాలు జారీచేసింది. దీంతో ప్రస్తుత పంచాయతీ ఎన్నికల్లో పోటీచేయాలని భావిస్తున్న అభ్యర్థులకు ఉపశమనం లభించింది.

రిజర్వేషన్లపై జోక్యం చేసుకోలేం

పంచాయతీ ఎన్నికలకు ఇప్పటికే నోటిఫికేషన్ విడుదలై, ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్నందున పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్ల అంశం లో జోక్యం చేసుకోలేమని హైకోర్టు స్పష్టంచేసింది. కొన్ని గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీల జనాభా వంద శాతం లేకపోయినా వాటిని రిజర్వ్ చేయడంపై పలువురు హైకోర్టును ఆశ్రయించారు. అయితే ఈ విషయంలో జోక్యం చేసుకోవడానికి హైకోర్టు నిరాకరించింది.

టెక్నాలజీ రంగంలో మహిళలకు ప్రోత్సాహం

- తెలంగాణ ప్రభుత్వానిది క్రియాశీలపాత్ర
- ఊబర్‌తో కలిసి వీహబ్ చర్చాగోష్ఠి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మహిళలను నూతన ఆవిష్కరణల వైపు ప్రోత్సహించడంలో తెలంగాణ ప్రభుత్వం క్రియాశీలపాత్ర పోషిస్తున్నదని ఊబర్ బిజినెస్ ఇంటెలిజెన్స్ హెడ్ కోమల్ మంగ్టానీ ప్రశంసించారు. వీహబ్ ఏర్పాటే ఇందుకు నిదర్శనమని తెలిపారు. టెక్నాలజీ, దాని ఆధారిత రంగాల్లో మహిళల పాత్ర పెంచేందుకు ఊబర్‌తో కలిసి వీహబ్ చర్చాగోష్ఠి నిర్వహించింది. కోమల్ మంగ్టానీతో కలిసి వీహబ్ సీఈవో దీప్తీరావు సంయుక్తంగా టీహబ్‌లో గురువారం ఈ చర్చాగోష్ఠిని నిర్వహించారు. ఈ సందర్భంగా టెక్నాలజీ ఆధారిత రంగం ఎదుగుదలను వివరించారు. హాజరైన వారినుంచి ప్రశ్నలు ఆహ్వానించి మహిళలకు ఈ రంగంలో ఎదురవుతున్న సవాళ్లపై సూచనలు ఇచ్చారు.

రెవెన్యూ కేసులు త్వరగా పరిష్కరించాలి

- సీసీఎల్ఏ అధికారులను ఆదేశించిన స్పెషల్ సీఎస్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ : రెవెన్యూలో భూపరిపాలనకు సంబంధించి 2,900 విజిలెన్స్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే పరిష్కరించాలని రెవెన్యూ స్పెషల్ సీఎస్ రాజేశ్వర్ తివారీ సీసీఎల్ఏ అధికారులను ఆదేశించారు. ఇటీవల సీసీఎల్ఏకు వెళ్లిన తివారీ విజిలెన్స్ కేసులు పెండింగ్‌లో ఉండటాన్ని గుర్తించారు. ఈ కేసులు ఎందుకు పరిష్కరించలేకపోయారంటూ ఆయన అధికారులపై సీరియస్ అయ్యారు. పెండింగ్‌లో ఉండటానికి గల కారణాలపై ఆరా తీశారు. అధికారులు, సిబ్బంది అంతా ఎన్నికల విధులు నిర్వర్తించిన కారణంగా విజిలెన్స్ కేసులపై దృష్టి సారించలేకపోయినట్టు అధికారులు వివరించారు. దీనిపై స్పందించిన రాజేశ్వర్ తివారీ అతి త్వరలో విజిలెన్స్ కేసులు పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కేసుల పరిష్కారాన్ని మొదటి ప్రాధాన్యంగా తీసుకొని పనిచేయాలని స్పష్టంచేశారు.

ఫిబ్రవరి 4 నుంచి రోడ్డుభద్రతా వారోత్సవాలు

- వాహనదారుల్లో అవగాహన పెంచేందుకే.. రోడ్‌సేఫ్టీ అథారిటీ చైర్మన్ కృష్ణప్రసాద్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రోడ్డు ప్రమాదాలను అరికట్టడంలో భాగంగా వాహనదారుల్లో అవగాహనపెంచే లక్ష్యంతో నిర్వహిస్తున్న రోడ్డుభద్రతా వారోత్సవాలు ఫిబ్రవరి 4 నుంచి 10 వరకు నిర్వహిస్తున్నట్టు రోడ్‌సేఫ్టీ అథారిటీ చైర్మన్ కృష్ణప్రసాద్ తెలిపారు. ఈ మేరకు అన్ని జిల్లాల యూనిట్ అధికారులకు గురువారం ఆదేశాలు పంపారు. గతేడాది అన్ని యూనిట్ అధికారులు ఎంతోబాగా వారోత్సవాల్లో పాల్గొన్నారని, అందులో గమనించి అంశాలపై సూచనలు ఇస్తే.. రాష్ట్రవ్యాప్తంగా అమలుచేస్తామని పేర్కొన్నారు. గతేడాది డ్రంక్ అండ్ డ్రైవ్, అతివేగం, హెల్మెట్ లేకుండా బండి నడపడం, సీట్‌బెల్ట్ పెట్టుకోకుండా కారు నడపడం, మొబైల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ తదితర అంశాలపై ఒక్కోరోజు ఒక్కోదానిపై దృష్టి పెడుతున్నట్టు తెలిపారు.

పారిశ్రామికవాడల్లో పర్యావరణ సమతుల్యతకు ప్రత్యేక కమిటీ

- ఉత్తర్వులు జారీచేసిన అటవీశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పారిశ్రామిక ప్రాంతాల్లో పర్యావరణ సమతుల్యత, కాలుష్యనివారణ కార్యక్రమాలపై కార్యాచరణ ప్రణాళికను రూపొందించడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. అటవీశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చైర్మన్‌గా ఉండే ఈ కమిటీలో సభ్యులుగా పరిశ్రమలశాఖ కమిషనర్, వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ప్రతినిధి, టీఎస్ఐఐడీసీ వైఎస్ చైర్మన్ అండ్ ఎండీ, జలమండలి ఎండీ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖల కమిషనర్లు ఉంటారు. సభ్య కన్వీనర్‌గా కాలుష్యనియంత్రణ మండలి సభ్యకార్యదర్శి వ్యవహరిస్తారని అటవీశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌మిశ్రా గురువారం ఉత్తర్వులు జారీచేశారు.

తెలంగాణ జైళ్ల శాఖ దేశానికే ఆదర్శం

- రాష్ట్ర ఆవిర్భావం తర్వాత జైళ్లలో తగ్గిన ఖైదీల మరణాలు
- 2018లో రూ.17 కోట్ల ఆదాయం
- వార్షిక నివేదికను విడుదలచేసిన జైళ్లశాఖ డీజీ వీకే సింగ్



గురువారం చంచల్‌గూడలోని కాన్ఫరెన్సు హాలులో మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న జైళ్ల శాఖ డీజీ వీకే సింగ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సంస్కరణల అమలులో తెలంగాణ రాష్ట్ర జైళ్లశాఖ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నదని జైళ్లశాఖ డీజీ వీకే సింగ్ అన్నారు. జైళ్లలో అవినీతిని అరికట్టేందుకు తీసుకున్న చర్యలు సత్ఫలితాలిచ్చాయన్నారు. జైళ్లశాఖ 2018లో సాధించిన విజయాలపై వార్షిక నివేదికను గురువారం ఆయన చంచల్‌గూడ జైలు ఆవరణలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కరెక్షనల్ అడ్మినిస్ట్రేషన్ కాన్ఫరెన్స్‌హాలులో విడుదలచేశారు. 2013లో జైళ్లశాఖ ఆదాయం రూ.1.5 కోట్లు మాత్రమే ఉండగా.. 2018లో రూ.17కోట్లకు పెరిగిందని వెల్లడించారు. పెట్రోల్‌బంకుల ఏర్పాటువల్ల ఈ ఆదాయం సమకూరిందన్నారు. జైళ్లశాఖలో 2014లో 56 మంది ఖైదీలు మరణిస్తే.. 2018లో ఈ సంఖ్యను ఎనిమిదికి తగ్గించామని పేర్కొన్నారు. జైళ్ల నుంచి విడుదలైనవారు మళ్లీ నేరాలకు పాల్పడకుండా 32 ప్రత్యేక బృందాలతో వారిపై కొంతకాలం నిఘా పెడుతున్నామన్నారు. జైలుకు వస్తున్నవారిలో డ్రంకెన్ డ్రైవ్ కేసులు పెరిగాయని, గతేడాది డ్రంకెన్ డ్రైవ్‌లో 12వేల మంది కిపైగా జైలుకు వచ్చారని వివరించారు.

అధ్యయనానికి ఇతర దేశాల ప్రతినిధులు

ఇతర రాష్ట్రాలతోపాటు అమెరికా, శ్రీలంక ప్రతినిధులు మన రాష్ట్రంలో జైళ్లను సందర్శించి, సంస్కరణలను అధ్యయనంచేశారని వీకే సింగ్ వివరించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలోని జైళ్లలో ఉదయాన్నే బ్రేక్‌ఫాస్ట్ ఇస్తున్నట్టు తెలిపారు. జైళ్లశాఖలో అవినీతిని నిరూపిస్తే రూ.పదివేలు రివార్డు ప్రకటించామని, ఇప్పటికీ కేవలం ఒకే ఫిర్యాదు నిరూపితమైందని తెలిపారు. థర్డ్‌పార్టీ కాల్‌సెంటర్ ద్వారా సిబ్బంది పనితీరుపై ఐదువేలమంది అభిప్రాయం తీసుకుంటే 77 మంది మాత్రమే సేవలు బాగాలేవని చెప్పారని పేర్కొన్నారు. తెలంగాణ జైళ్లశాఖ పనితీరు బాగుందని సుప్రీంకోర్టు కూడా ప్రశంసించిందన్నారు. జైళ్లశాఖలో మార్పులపై టాటాకంపెనీ ఆధ్వర్యంలో సర్వే చేయిస్తున్నామని తెలిపారు. ఐదేండ్లలో లక్షా 32వేల మంది ఖైదీలను అక్షరాస్యులుగా మార్చామన్నారు. 2019లో జైళ్లశాఖలో పనిచేసే ఉద్యోగులందరికీ హెల్త్‌అండ్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్‌ను ప్రారంభిస్తామన్నారు. సత్ప్రవర్తన కలిగిన ఖైదీలకు క్షమాభిక్ష ఇవ్వడంపై నివేదికను గవర్నర్‌కు పంపామని, సమాధానం రాలేదని వీకే సింగ్ వెల్లడించారు.

త్వరలో ఎమ్మెల్సీ పోరు!

మొదటిపేజీ తరువాయి...

నిర్వహించి ఆయా స్థానాలను భర్తీ చేస్తుంది. మార్చి 29నాటికి ఎనిమిది, మే 1నాటికి ఒక ఎమ్మెల్సీ పదవీకాలం ముగియనున్నది. ఇక అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన మైనంపల్లి హన్మంతరావు, పట్నం నరేందర్‌రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఎమ్మెల్సీ పదవులకు రాజీనామాచేశారు. వరంగల్ స్థానిక సంస్థల ద్వారా ఎమ్మెల్సీగా గెలిచిన కొండా మురళి టీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరి పదవికి రాజీనామాచేశారు. మొత్తం 13 ఎమ్మెల్సీ స్థానాలు మండలిలో ఖాళీగా ఉండబోతున్నందున భర్తీ ప్రక్రియను ఈసీ వేగవంతం చేసింది. ఇందులో భాగంగానే ఫిబ్రవరి మూడోవారంలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసి మార్చి రెండోవారంనాటికి ప్రక్రియను ముగించాలని భావిస్తున్నది. ఎమ్మెల్సీల పదవీకాలం పూర్తయ్యే పదిరోజుల ముందుగానే కొత్త ఎమ్మెల్సీల ఎంపిక కూడా ముగుస్తుంది.

16 స్థానాలకు ఎన్నికలు జరిగే అవకాశం

13 స్థానాల ఎన్నిక విషయంలో ఇప్పటికే స్పష్టత వచ్చినప్పటికీ మరో మూడుస్థానాల్లో మాత్రం స్పష్టతరాలేదు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు టీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన రాములునాయక్, ఆర్ భూపతిరెడ్డి, కే యాదవరెడ్డి సభ్యత్వాలను రద్దు చేయాలని టీఆర్ఎస్ ఇటీవల శాసన మండలి చైర్మన్‌కు ఫిర్యాదు చేసింది. ఫిరాయింపుల చట్టం ప్రకారం ఈ ముగ్గురిపై చర్యలు తీసుకుంటే మరో మూడుస్థానాలు ఖాళీ అవుతాయి. దీంతో ఇప్పటికే ఉన్న 13 స్థానాలకు ఈ మూడుస్థానాలు కలిపి 16 స్థానాలకు ఈసీ నోటిఫికేషన్ జారీ చేస్తుంది.

పదవీకాలం ముగిసే ఎమ్మెల్సీలు

ఎమ్మెల్యే కోటా: షబ్బీర్ అలీ, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, టీ సంతోష్‌కుమార్, మహమూద్ అలీ, మహ్మద్ సలీం, **ఉపాధ్యాయుల కోటా:** పాతూరి సుధాకర్‌రెడ్డి, పూల రవీందర్, **పట్టభద్రుల కోటా:** స్వామిగౌడ్, **హైదరాబాద్ స్థానిక సంస్థలు:** ఎంఎస్ ప్రభాకర్

ఉప ఎన్నిక జరిగే స్థానాలు

నల్లగొండ స్థానిక సంస్థల నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, రంగారెడ్డి స్థానిక సంస్థల నుంచి పట్నం నరేందర్‌రెడ్డి, వరంగల్ స్థానిక సంస్థల నుంచి కొండా మురళీధర్‌రావు, ఎమ్మెల్యే కోటాలో మైనంపల్లి హన్మంతరావు.

పార్టీ ఫిరాయింపు ఫిర్యాదు ఎదుర్కొంటున్నవారు

గవర్నర్ కోటా రాములునాయక్, నిజామాబాద్ స్థానిక సంస్థల నుంచి ఆర్ భూపతిరెడ్డి, ఎమ్మెల్యే కోటాలో కే యాదవరెడ్డి

రెండ్రోజుల్లో మరింత చలి

మొదటిపేజీ తరువాయి...

కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణంకన్నా 6 డిగ్రీల మేర తక్కువగా నమోదవుతున్నాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మంచు దుప్పటి కప్పేస్తున్నది. ఉదయం 8 గంటలవరకు కూడా పొగమంచు కారణంగా రోడ్లు కనిపించకపోవడంతో వాహనదారులు లైట్లు వేసుకొని వెళ్తున్నారు. ముఖ్యంగా ఏజెన్సీలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలు సాయంత్రం 5 గంటలనుంచే చలి మంటలు కాగుతున్నారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలంలోని అర్లి(టీ)లో 5, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా గిన్నెధరిలో 5.2, కామారెడ్డి జిల్లా భిక్కనూర్‌లో 5.7, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్‌లో 6, బేలలో 6.1, రంగారెడ్డి జిల్లా తాళ్లపల్లిలో 6.2, సిద్దిపేట జిల్లా పోతరెడ్డిపేట్‌లో 6.6, వరంగల్ రూరల్ జిల్లా ఆత్మకూర్, మంచిర్యాల జిల్లా కవ్వాల్ టైగర్ రిజర్వాయర్– జన్నారంలో 6.7, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరిలో 6.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. మరికొన్ని రోజులు చలి తీవ్రత ఇలాగే కొనసాగుతుందని వాతావరణ కేంద్ర అధికారులు పేర్కొంటున్నారు. అస్తమా, గుండె జబ్బులు, ఇతర వ్యాధిగ్రస్తులు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.

చలికాలం

జిల్లా	కనిష్ఠం	గరిష్ఠం
సిద్దిపేట	6.6	34.5
ఆదిలాబాద్	6.7	28.3
మంచిర్యాల	6.7	28.3
కుమ్రంభీం	6.7	28.3
వికారాబాద్	7.6	26.7
సంగారెడ్డి	7.6	35.4
మెదక్	7.8	35.5
మహబూబ్‌నగర్	7.9	35.1
నాగర్‌కర్నూల్	8.5	34.9
కరీంనగర్	8.9	35.2
పెద్దపల్లి	9.2	29.0
మహబూబాబాద్	9.6	34.6
యాదాద్రి భువనగిరి	9.7	32.9
జనగామ	9.9	33.6
వరంగల్ రూరల్	10.0	28.0
వరంగల్ అర్బన్	10.5	30.0
జోగులాంబ గద్వాల	10.8	36.5
హైదరాబాద్	10.9	29.9
మేడ్చల్ మల్కాజిగిరి	10.9	29.9
నిర్మల్	11.0	31.0
సూర్యాపేట	11.0	32.0
జగిత్యాల	12.0	33.0
నిజామాబాద్	12.5	29.2
వనపర్తి	12.5	35.3
కామారెడ్డి	13.0	31.0
రాజన్న సిరిసిల్ల	14.0	29.0
రంగారెడ్డి	15.0	30.0
నల్లగొండ	15.4	28.4
జయశంకర్ భూపాలపల్లి	16.0	29.0
భద్రాద్రి కొత్తగూడెం	17.0	31.0
ఖమ్మం	18.0	31.0

వచ్చే నెలాఖరుకు ఈవోడీబీ సంస్కరణలు పూర్తి

సంస్కరణలన్నింటిపైనా అభిప్రాయాల సేకరణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సులభ వాణిజ్య విధానంలో సంస్కరణలను ఫిబ్రవరి నెలాఖరులోగా అమలుచేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన నేపథ్యంలో దీనిపై రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు మొదలుపెట్టింది. ఈవోడీబీపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి ఇటీవల సంబంధిత ఉన్నతాధికారులతో సమీక్షించారు. ప్రతిపాదిత సంస్కరణలను వేగంగా అమలుచేయాలని, ఇందుకు సంబంధించి అవసరమైన ఆదేశాలు ఇవ్వాలని సూచించారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్(ఈవోడీబీ)లో తెలంగాణ 2016లో మొదటిర్యాంకు, 2017లో రెండోర్యాంకు సాధించింది. గత రెండేండ్లుగా అగ్రస్థానంలో నిలిచింది. ఈ ఏడాది కూడా అగ్రస్థానంలో నిలిచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. గతంలో సంస్కరణలన్నింటినీ పూర్తిస్థాయిలో అమలుచేసిన రాష్ట్రంగా తెలంగాణ నిలవడంతో ఈసారి రాష్ట్రానికి సంబంధించి సంస్కరణలు అతిత్వరగా పూర్తవుతాయని అధికారులు అంచనావేస్తున్నారు.

పారిశ్రామికవర్గాల నుంచి అభిప్రాయ సేకరణ

గతానికి భిన్నంగా ఈసారి అమలుచేసిన సంస్కరణలన్నింటిపై పారిశ్రామికవేత్తల, వ్యాపారుల అభిప్రాయాలను సేకరిస్తారు. అయితే, ఈసారి ప్రశ్నల సంఖ్యను 80కి కుదించారు. గతంలో తీసుకొచ్చిన సంస్కరణలకు సంబంధించిన ప్రశ్నలన్నీ ఇందులోనూ ఉండేవిధంగా రూపొందించారు. వీటన్నింటిపైనా పారిశ్రామికవర్గాలు, న్యాయవాదులు, ఆడిటర్లు.. ఇలా పారిశ్రామికవేత్తలకు అనుబంధంగా ఉన్నవారి అభిప్రాయాలను సేకరిస్తారు. దీనిపై పారిశ్రామికవేత్తల్లో అవగాహన పెంచనున్నారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌తో పాటు ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తారు. పారిశ్రామికవేత్తలు, ఇతరులకు ఉన్న సమస్యలను పరిష్కరిస్తారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇండస్ట్రియల్ పాలసీ అండ్ ప్రమోషన్(డీఐపీపీ) అధికారులు పారిశ్రామికవేత్తల అభిప్రాయాలను సేకరిస్తారు. ఇటీవలే అభిప్రాయాల సేకరణ ఏవిధంగా ఉండాలి, రాష్ట్రాల సూచనలు, సలహాలను డీఐపీపీ రాష్ట్ర ప్రభుత్వాల నుంచి స్వీకరించింది. రాష్ట్ర ప్రభుత్వాలు సూచించిన సలహాలు, సూచనలను పాటిస్తామని హామీ ఇచ్చారు. దీనికి సంబంధించిన ఆదేశాలు త్వరలో విడుదలవుతాయి.

రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు ప్రశంసలు

రాష్ట్ర ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు నాయకత్వంలో టీఎస్ఐపాస్ పేరిట నూతన పారిశ్రామిక విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అనువైన వాతావరణాన్ని సృష్టించారు. అనుమతుల విధానంలో ప్రపంచంలో అతి సరళమైన విధానాన్ని అమలుచేస్తున్నారు. పదిహేను రోజుల్లోనే అనుమతిలిచ్చేవిధంగా చట్టాన్ని తీసుకొచ్చారు. ఈ విధానాన్ని ప్రపంచంలోని పారిశ్రామికవేత్తలు ప్రశంసించారు. ఇంత సులువైన అనుమతుల విధానం ఎక్కడాలేదని అభినందించారు. దీనిద్వారా రాష్ట్రంలో ఏడువేలకుపైగా అనుమతులిచ్చారు. ఈవోడీబీపైనే కాకుండా క్వాలిటీ ఆఫ్ డూయింగ్ బిజినెస్, కాస్ట్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై దృష్టిపెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ప్రధానితో బాలీవుడ్ 'సెల్ఫీ'

■ దర్శకులు, నటీనటులతో నరేంద్రమోదీ భేటీ



న్యూఢిల్లీ/ముంబై: ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు కరణ్ జోహార్ నేతృత్వంలో 14 మంది నటీనటులు, దర్శకులు, నిర్మాతల బృందం గురువారం ప్రధాని మోదీతో భేటీ అయ్యింది. వీరిలో నటులు రణ్‌వీర్ సింగ్, రణ్‌బీర్ కపూర్, వరుణ్ ధావన్, విక్కీ కౌశల్, ఆయుష్మాన్ ఖురానా, రాజ్‌కుమార్ రావ్, సిద్ధార్థ్ మల్హోత్రా, నటీమణులు ఆలియాభట్, భూమి పెడ్నేకర్, డైరక్టర్లు అశ్వినీ అయ్యర్, రోహిత్ శెట్టి, నిర్మాతలు ఏక్తా కపూర్, మహవీర్ జైన్ ఉన్నారు. ఈ సందర్భంగా జాతి నిర్మాణంలో బాలీవుడ్ పాత్రపై వారు చర్చించారు. అలాగే వినోదాన్ని విద్యలో ఎలా భాగస్వామ్యం చేయాలన్న విషయం కూడా చర్చకు వచ్చింది. అనంతరం కరణ్ జోహార్ ప్రధాని మోదీతో దిగిన ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. ప్రధాని మోదీతో సమావేశం కావడం అద్భుతమైన అవకాశమని ఫొటో కింద క్యాప్షన్ రాశారు. సినిమా టికెట్ల ధరలపై జీఎస్టీని తగ్గించినందుకు మోదీకి కృతజ్ఞతలు చెప్పారు. బాలీవుడ్ ఎదుర్కొంటున్న సమస్యలపై ఇటీవల పలువురు నిర్మాతలు కూడా ప్రధాని మోదీతో సమావేశమయ్యారు.



150 మంది పర్యాటకులను కాపాడిన సైన్యం

సిక్కింలో మంచు వల్ల చిక్కుకుపోయిన టూరిస్టులు

కోల్‌కతా: భారీ మంచు వల్ల ఉత్తర సిక్కింలో చిక్కుకుపోయిన 150 మంది పర్యాటకులను సైన్యం కాపాడింది. బుధవారం లాచంగ్ లోయలో విపరీతంగా మంచుకురువడంతో 34 మహిళలు, 11 మంది చిన్నారులు సహా 150 మంది చిక్కుకుపోయారు. విషయం తెలిసిన వెంటనే సైన్యం, ఆరోగ్య సిబ్బంది సహాయక చర్యలను ప్రారంభించారు. వారందరికీ మొదట వైద్య సేవలను అందించిన అనంతరం సమీపంలోని ఆర్మీ క్యాంప్‌లకు తరలించారు.

స్వలింగ సంపర్కాన్ని సైన్యంలో అనుమతించం

ఆర్మీ చీఫ్ జనరల్ బిపిన్ రావత్ స్పష్టీకరణ



న్యూఢిల్లీ: స్వలింగ సంపర్కం నేరం కాదంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సైన్యంలో అనుమతించబోమని ఆర్మీ చీఫ్ జనరల్ బిపిన్ రావత్ చెప్పారు. గురువారం ఆయన వార్షిక విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అలాంటి విషయంపై (స్వలింగ సంపర్కంపై) సైన్యంలో నిషేధం ఉన్నదని తెలిపారు. అయినప్పటికీ చట్టానికంటే సైన్యం గొప్పది కాదని చెప్పారు. వివాహేతర శృంగారంపై సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను కూడా తాము సైన్యంలో అనుమతించమని, సైన్యానికి ఓ సంప్రదాయముంటూ ఉన్నదని, మొత్తం సైన్యం అంతా ఒక కుటుంబం లాంటిదని పేర్కొన్నారు. తాము ఆర్మీ చట్టం ప్రకారం ముందుకు సాగుతున్నామని తెలిపారు. స్వలింగ సంపర్కం నేరం కాదంటూ, ఒకవేళ నేరంగా పరిగణిస్తే సమానత్వపు హక్కును ఉల్లంఘించడమే అవుతుందని గతేడాది సెప్టెంబర్‌లో సుప్రీంకోర్టు తీర్పు నిచ్చిన విషయం తెలిసిందే.



ప్రకాశ్‌రాజ్‌కు కేజ్రీవాల్ మద్దతు

న్యూఢిల్లీ: నటుడు ప్రకాశ్‌రాజ్ రాజకీయ ప్రవేశానికి తమ మద్దతు ఉంటుందని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ చెప్పారు. గురువారం ఢిల్లీలో కేజ్రీవాల్‌తో ప్రకాశ్‌రాజ్ భేటీ అయ్యారు. లోక్‌సభ ఎన్నికల్లో బెంగళూరు సెంట్రల్ నియోజకవర్గం నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీచేస్తానని ఇటీవల ప్రకాశ్‌రాజ్ ప్రకటించిన విషయం తెలిసిందే. భేటీ అనంతరం కేజ్రీవాల్ ట్వీట్ చేస్తూ 'ప్రకాశ్‌రాజ్ వంటి వ్యక్తులు పార్లమెంట్‌లో అడుగుపెట్టడం అవసరం' అని పేర్కొన్నారు. ప్రకాశ్‌రాజ్ ట్వీట్ చేస్తూ 'కేజ్రీవాల్‌తో పలు అంశాలు చర్చించాను. నా రాజకీయ ప్రయాణానికి ఆయన మద్దతు తెలిపినందుకు ధన్యవాదాలు' అని తెలిపారు.

అలోక్‌వర్మకు ఉద్వాసన



మోదీ



జస్టిస్ సిక్రీ



ఖర్గే

సీబీఐ డైరెక్టర్‌ను పదవి నుంచి తొలిగించిన ప్రధాని నేతృత్వంలోని అత్యున్నత కమిటీ

- తీవ్రంగా వ్యతిరేకించిన కమిటీ సభ్యుడు మల్లికార్జున ఖర్గే
- సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ నివేదిక ఆధారంగానే వేటు
- పదవీ కాలం ముగియకుండా డైరెక్టర్‌ను తొలిగించడం సీబీఐ చరిత్రలో ఇదే మొదటిసారి
- అగ్నిమాపక సేవల విభాగానికి డీజీగా అలోక్‌వర్మ బదిలీ
- సీబీఐ డైరెక్టర్ బాధ్యతలు తిరిగి ఎం నాగేశ్వరరావుకు అప్పగింత

న్యూఢిల్లీ, జనవరి 10: సీబీఐ డైరెక్టర్ అలోక్‌వర్మకు ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని అత్యున్నత కమిటీ అవమానకర రీతిలో ఉద్వాసన పలికింది. ఆయనను తిరిగి విధులలో కొనసాగించాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన రెండు రోజులకే తొలిగించింది. అవినీతి ఆరోపణలు, విధి నిర్వహణలో అలక్ష్యం, ఆశించిన రీతిలో విశ్వసనీయతతో విధులు నిర్వహించక పోవడంవల్లనే అలోక్‌వర్మను విధుల నుంచి తొలిగిస్తున్నట్టు అత్యున్నత కమిటీ ప్రకటించింది. సీబీఐ డైరెక్టర్‌గా అలోక్‌వర్మ రెండేండ్ల పదవీ కాలం ఈ నెల 31తో ముగియనుంది. కాగా ప్రభుత్వం ఆయనను కేంద్ర హోం శాఖ పరిధిలోని అగ్నిమాపక సేవలు, సివిల్ డిఫెన్స్, హోంగార్డ్స్ శాఖల డైరెక్టర్ జనరల్‌గా బదిలీ చేసింది. సీబీఐ 55 ఏండ్ల చరిత్రలో పదవీ కాలం ముగియకుండా సంస్థ డైరెక్టర్ ఇలా ఉద్వాసనకు గురికావడం ఇదే మొదటిసారి. సీబీఐ డైరెక్టర్ బాధ్యతలను అదనపు డైరెక్టర్‌గా ఉన్న మన్నెం నాగేశ్వరరావుకు మరోసారి అప్పగిస్తూ కేంద్రం గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. అలోక్‌వర్మను సీబీఐ డైరెక్టర్‌గా తొలిగించాలన్న నిర్ణయాన్ని ఉన్నతస్థాయి కమిటీలోని ముగ్గురిలో ప్రధాని మోదీ, చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్ ప్రతినిధి జస్టిస్ ఏకే సిక్రీ సమర్థించగా, లోక్‌సభలో కాంగ్రెస్ నాయకుడు మల్లికార్జున్ ఖర్గే వ్యతిరేకించారని అధికార వర్గాలు పేర్కొన్నాయి. అలోక్‌వర్మను తిరిగి విధుల్లో నియమించాలని తీర్పునిచ్చిన సుప్రీంకోర్టు ఆయన ప్రధానమైన విధాన నిర్ణయాలు తీసుకోవద్దని ఆదేశించిన సంగతి తెలిసిందే. ఆయన విధుల నిర్వహణపై అత్యున్నత కమిటీ వారం రోజుల్లో సమావేశమై నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. కోర్టు ఆదేశాల మేరకు అత్యున్నత కమిటీ మొదట బుధవారం, తిరిగి గురువారం ప్రధాని మోదీ నివాసంలో రెండుగంటల పాటు సమావేశమైంది. దీనికి సీజేఐ తన ప్రతినిధిగా జస్టిస్ సిక్రీని పంపించారు.

దర్యాప్తు అంటే ప్రధానికి భయం: కాంగ్రెస్

సీబీఐ డైరెక్టర్‌గా అలోక్‌వర్మను తొలిగించేందుకు ప్రధాని మోదీ తీసుకున్న నిర్ణయాన్ని కాంగ్రెస్ తప్పు పట్టింది. అలోక్‌వర్మపై వచ్చిన అభియోగాలపై తన వాదన వినిపించే అవకాశం ఆయనకు ఇవ్వకపోవడాన్ని బట్టి.. దర్యాప్తు అంటే ప్రధాని భయపడుతున్నట్టు తెలుస్తున్నదని వ్యాఖ్యానించింది. రాఫెల్ కుంభకోణంపై సీబీఐ డైరెక్టర్ ద్వారా స్వతంత్ర దర్యాప్తు లేదా జేపీసీ ద్వారా పార్లమెంట్ దర్యాప్తు అంటే ప్రధాని జంకుతున్నారని విమర్శించింది. రాఫెల్ కుంభకోణంపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కేంద్ర మాజీ మంత్రులు అరుణ్‌శౌరీ, యశ్వంత్ సిన్హా, న్యాయవాది ప్రశాంత్ భూషణ్ గత ఏడాది అక్టోబర్ 4న అలోక్‌వర్మను కలిసి విజ్ఞప్తి చేశారు. అదే నెల 23న ప్రభుత్వం ఆయనను విధుల నుంచి తొలిగించి, నిర్బంధ సెలవుపై పంపింది. తనను విధుల నుంచి తొలిగించడాన్ని సవాలు చేస్తూ వర్మ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సుప్రీంకోర్టు ప్రభుత్వ ఉత్తర్వులను కొట్టివేస్తూ వర్మను తిరిగి విధుల్లో చేర్చుకోవాలని మంగళవారం ఆదేశించింది. 77 రోజులపాటు విధులకు దూరంగా ఉన్న అలోక్ వర్మ బుధవారం తన కార్యాలయానికి వచ్చారు. గురువారం ఆయన పలువురు అధికారులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కానీ సాయంత్రానికి ప్రభుత్వం ఆయనకే ఉద్వాసన పలికింది. మరోవైపు వర్మకు ఉద్వాసనపై కాంగ్రెస్ చేసిన విమర్శలను బీజేపీ తిప్పికొట్టింది. సీబీఐ అంతర్గత కలహాలలో జోక్యం చేసుకోవడం ద్వారా ఆ సంస్థను నాశనం చేయాలని కాంగ్రెస్ ప్రయత్నించిందని ఆరోపించింది.

8 అభియోగాలు

అలోక్‌వర్మపై వచ్చిన అవినీతి ఆరోపణలకు సంబంధించి విచారణ జరిపిన సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) ఇచ్చిన నివేదిక ఆధారంగానే ఆయనపై చర్య తీసుకున్నట్టు అధికార వర్గాలు పేర్కొన్నాయి. సీవీసీ నివేదికలో అలోక్‌వర్మపై ఎనిమిది ప్రధాన అభియోగాలున్నట్టు తెలిసింది. కళంకిత అధికారులను సీబీఐలో చేర్చుకొనేందుకు ప్రయత్నించారని, మాంసం వ్యాపారి మొయిన్ ఖురేషీ కేసు దర్యాప్తులో రాజీపడ్డారని సీవీసీ పేర్కొంది. మొయిన్ ఖురేషీ కేసును అలోక్‌వర్మ ప్రభావితం చేసేందుకు ప్రయత్నించినట్టు తమకు సాక్ష్యాధారాలు లభించాయని తెలిపింది. ఇదే కేసులో రూ.2 కోట్లు చేతులు మారడంపై నిఘా సంస్థ రిసెర్చ్ అండ్ ఎనాలిసిస్ వింగ్ (రా) వద్ద ఫోన్ సంభాషణల రికార్డింగులు ఉన్నాయని పేర్కొంది. ఈ కేసులో ఆయన ప్రవర్తన అనుమానాస్పదంగా ఉందని, ఆయనపై దర్యాప్తు జరిపించాల్సిన అవసరముందని సీవీసీ అభిప్రాయపడింది. ఐఆర్‌సీటీసీ కుంభకోణానికి సంబంధించిన కేసులో అలోక్‌వర్మ ఉద్దేశపూర్వకంగా ఒక పేరును ఎఫ్ఐఆర్ నుంచి తొలిగించారని సీవీసీ తెలిపింది. ఈ కేసులో ఆర్జేడీ నాయకుడు లాలూయాదవ్ నిందితునిగా ఉన్న సంగతి తెలిసిందే. కొన్ని కేసులకు సంబంధించిన పత్రాలను ఆయన తమకు అందజేయలేదని, మరికొన్ని కేసుల్లో నకిలీ పత్రాలను అందజేశాడని సీవీసీ తెలిపింది. విశ్వసనీయతలేని అధికారులను సీబీఐలో భర్తీ చేసేందుకు ఆయన ప్రయత్నించారని తెలిపింది. జస్టిస్ పట్నాయక్ సమక్షంలో జరిగిన విచారణలో తన నిజాయితీని నిరూపించుకొనేందుకు ఆయనకు ఎంతో సమయమిచ్చామని, కానీ ఆయన వినియోగించుకోలేదని పేర్కొంది. ఈ అభియోగాల నేపథ్యంలో కొన్ని కేసులకు సంబంధించి అలోక్‌వర్మపై నేరవిచారణ జరుగాల్సిన అవసరముందని, సీబీఐ డైరెక్టర్‌గా ఆయన కొనసాగడం ఎంతమాత్రం భావ్యం కాదని మల్లికార్జున్ ఖర్గే మినహా అత్యున్నత కమిటీలోని మిగిలిన ఇద్దరు ప్రధాని మోదీ, జస్టిస్ సిక్రీ అభిప్రాయపడ్డారని అధికారులు తెలిపారు. సీవీసీ మోపిన అభియోగాలపై తన వాదన వినిపించే అవకాశం అలోక్‌వర్మకు ఇవ్వాలని మల్లికార్జున్ ఖర్గే గట్టిగా వాదించారని, కానీ ప్రధాని మోదీ, జస్టిస్ సిక్రీ అందుకు అంగీకరించలేదని పేర్కొన్నారు.



అలోక్ వర్మ

"అలోక్‌వర్మపై ప్రధాని మోదీ రెండుసార్లు వేటు వేయడం చూస్తుంటే.. ఆయన (మోదీ) తన అబద్ధాలకు తానే బందీ అయినట్టు తెలుస్తున్నది. రాఫెల్ కుంభకోణంలో జరిగిన అవినీతిపై ప్రధాని మనసులో భయం పెరుగుతున్నది. ఆయన నిద్ర కూడా పోవడం లేదు. భారత వాయుసేన నుంచి మోదీ రూ.30 వేల కోట్లు దొంగిలించి తన సన్నిహిత మిత్రుడు అనిల్ అంబానీకి కట్టబెట్టారు."

-రాహుల్‌గాంధీ

ఎన్నికల వేళ..

బయోపిక్‌ల గోల!

- నేతల జీవిత చరిత్రలు, చారిత్రక ఘటనల ఆధారంగా సినిమాల నిర్మాణం
- మోదీ, మన్మోహన్, థాకరే, లాల్‌బహదూర్ శాస్త్రిలపై చిత్రాలు
- బహిరంగసభా వేదికలుగా మారుతున్న వెండితెరలు
- ప్రచారాస్త్రాలుగా మలుచుకుంటున్న రాజకీయ పార్టీలు



న్యూఢిల్లీ, జనవరి 10: మరో మూడు నెలల్లో లోక్‌సభతోపాటు పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు కూడా జరుగనున్న నేపథ్యంలో రాజకీయ పార్టీలు తమ ప్రచారాస్త్రాలలో ఒకదానిగా సినిమాలను కూడా ఉపయోగించుకుంటున్నాయి. ఈ నేపథ్యంతోనే ఏప్రిల్ నెల నాటికి ఆరు నుంచి ఎనిమిది సినిమాలు విడుదల కానున్నట్టు తెలుస్తున్నది. వీటిలో ఎక్కువగా జీవితకథల ఆధారిత సినిమాలు (బయోపిక్)లు ఉండబోతున్నాయి. ఒకరకంగా వెండితెరను బహిరంగ సభా వేదికలుగా మలుచుకుంటున్న పార్టీలు తమ సినిమాల ద్వారానే ఓటర్లను ఆకట్టుకొనేందుకు ప్రయత్నిస్తున్నాయి. 'యూరి: ది సర్జికల్ స్ట్రైక్', 'ది యాక్సిడెంటల్ ప్రైం మినిస్టర్', 'థాకరే', 'ది తాష్కెంట్ ఫైల్స్' చలనచిత్రాలు వెంట వెంటనే విడుదలయ్యేందుకు సిద్ధంగా ఉన్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ జీవిత చరిత్ర ఆధారంగా రెండు సినిమాలు రానున్నాయి. ఒకటి బీజేపీ ఎంపీ, సినీ నటుడు పరేశ్ రావల్ రూపొందిస్తుండగా, మరో సినిమాలో వివేక్ ఒబెరాయ్ మోదీగా నటిస్తున్నారు. శుక్రవారం విడుదలవుతున్న 'యూరి: ది సర్జికల్ స్ట్రైక్' సినిమాను 2016 సెప్టెంబర్‌లో భారత సైనిక దళాలు పాకిస్థాన్ భూభాగంలోకి వెళ్లి ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసిన ఉదంతంపై రూపొందించారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌పై ఆయనకు మీడియా సలహాదారుగా పనిచేసిన సంజయ్ బారు రాసిన 'ది యాక్సిడెంటల్ ప్రైం మినిస్టర్' పుస్తకం ఆధారంగా అదే పేరుతో సినిమాను రూపొందించారు. ఈ చిత్రంలో అనుపమ్ ఖేర్ మన్మోహన్‌గా నటించారు. ఈ సినిమాలో ఇందిరాగాంధీ కుటుంబాన్ని నెగెటివ్‌గాచూపించినట్టు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఓ కుటుంబం పదేండ్లపాటు తెరవెనుక నుంచి ప్రభుత్వాన్ని తన చెప్పు చేతుల్లో ఎలా ఉంచుకుందో ఈ సినిమా తేటతెల్లం చేయనుందని బీజేపీ పేర్కొంటుండగా, ఎన్నికల ముంగిట తమకు వ్యతిరేకంగా జరిగే సినిమా ప్రచారంగా కాంగ్రెస్ దీనిని అభివర్ణించింది. ఇక థాకరే సినిమాను శివసేన వ్యవస్థాపకుడు బాల్‌థాకరే జీవితకథ ఆధారంగా రూపొందిస్తున్నారు. ఈ సినిమా రచయితగా, నిర్మాతగా శివసేన సీనియర్‌నాయకుడు సంజయ్ రౌత్ వ్యవహరిస్తుండగా, నవాజుద్దీన్ సిద్దిఖీ థాకరే పాత్రను పోషిస్తున్నారు. ఈ సినిమా థాకరే జయంతి సందర్భంగా ఈ నెల 25న విడుదల కానుంది. దేశ రెండో ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి మృతిచెందిన అనుమానాస్పద పరిస్థితులపై 'ది తాష్కెంట్ ఫైల్స్' రూపొందించారు. బీజేపీ మద్దతుదారుగా పేరొందిన వివేక్ అగ్నిహోత్రి రూపొందించిన ఈ సినిమాను కూడా కాంగ్రెస్‌ను విమర్శించేందుకే ఎక్కుపెట్టినట్టు తెలుస్తున్నది. ఈ సినిమా ఫిబ్రవరి లేదా మార్చి నెలలో విడుదల కావొచ్చని భావిస్తున్నారు. ఇక తెలుగునాట కూడా ఇప్పటికే ఒక సినిమా విడుదల కాగా, మరో రెండు లేదా మూడు చిత్రాలు ఎన్నికలకు ముందు విడుదలకు సిద్ధమవుతున్నాయి. టీడీపీ వ్యవస్థాపకుడు, దిగ్గజ నటుడు ఎన్టీ రామారావు జీవిత కథతో రెండు సినిమాలను రూపొందించారు. ఇప్పటికే ఎన్టీఆర్ కథానాయకుడు విడుదల కాగా, ఎన్టీఆర్ మహానాయకుడు'ను వచ్చే నెలలో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ఎన్టీఆర్‌పైనే రాంగోపాల్‌వర్మ 'లక్ష్మీస్ ఎన్టీఆర్' అనే మరో సినిమాను రూపొందిస్తున్న విషయం తెలిసిందే. ఇక ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్‌పార్టీని రెండుసార్లు అధికారానికి తీసుకొచ్చిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జీవిత కథ ఆధారంగా 'యాత్ర' సినిమాను తెరకెక్కిస్తున్నారు. .

అయోధ్య కేసులో మరో మలుపు

న్యాయవాది వ్యాఖ్యలతో బెంచ్ నుంచి తప్పుకున్న జస్టిస్ లలిత్

- కొత్తగా మరోసారి రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు
- 29న జరుగనున్న విచారణ



జస్టిస్ లలిత్

న్యూఢిల్లీ, జనవరి 10: అయోధ్యలోని వివాదాస్పద భూమి కేసు విచారణ మరో మలుపు తిరిగింది. ఈ కేసుపై విచారణకు ఏర్పాటు చేసిన ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం నుంచి జస్టిస్ యూయూ లలిత్ తప్పుకున్నారు. ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) రంజన్ గొగోయ్ నేతృత్వంలో ఏర్పడిన రాజ్యాంగ ధర్మాసనంలో సభ్యునిగా ఉన్న జస్టిస్ లలిత్ అయోధ్యపై కేసు విచారణలో పాల్గొనేందుకు తన అయిష్టతను వ్యక్తం చేశారు. దీంతో తాజాగా మరోసారి రాజ్యాంగ ధర్మాసనాన్ని ఏర్పాటు చేస్తామని, కేసు విచారణ ఈ నెల 29 నుంచి ప్రారంభమవుతుందని సుప్రీంకోర్టు తెలిపింది. జస్టిస్ లలిత్ తప్పుకున్నందున కేసును వాయిదా వేయడం తప్ప తమకు మరొక మార్గం లేదని పేర్కొంది. ఈ కేసు విచారణ కోసం ధర్మాసనం గురువారం ఆసీనమవగానే ఓ ముస్లిం పిటిషనర్ తరపున హాజరైన సీనియర్ న్యాయవాది రాజీవ్ ధవన్ మాట్లాడుతూ, ధర్మాసనంలో సభ్యునిగా ఉన్న జస్టిస్ యూయూ లలిత్ 1997లో ఒక న్యాయవాదిగా ఇదే కేసులో ఉత్తర్‌ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కల్యాణ్‌సింగ్ తరపున వాదనలు వినిపించారని గుర్తు చేశారు. అయోధ్యలోని వివాదాస్పద స్థలంలో యథాతథ స్థితిని కొనసాగించడంలో అప్పుడు సీఎంగా ఉన్న కల్యాణ్‌సింగ్ విఫలమయ్యారని, దీంతో అక్కడున్న బాబ్రీ మసీదును కూల్చివేశారని చెప్పారు. న్యాయమూర్తులు ఎస్ఏ బాబ్డే, ఎన్వీ రమణ, డీవై చంద్రచూడ్ కూడా సభ్యులుగా ఉన్న ధర్మాసనం న్యాయవాది ధవన్ వ్యాఖ్యలను గమనంలోకి తీసుకుంది. దాదాపు 20 నిమిషాలపాటు సాగిన వాదనల అనంతరం, 'ఈ కేసును విచారిస్తున్న ధర్మాసనంలో జస్టిస్ లలిత్ సభ్యుడిగా ఉండటంపై న్యాయవాది రాజీవ్ ధవన్‌కు అభ్యంతరం లేదని, ఇక నిర్ణయం తీసుకోవాలని ఆ న్యాయమూర్తే' అని పేర్కొంది. అనంతరం జస్టిస్ లలిత్ ఈ ధర్మాసనంలో కొనసాగేందుకు అయిష్టత వ్యక్తం చేస్తున్నారని, అందువల్ల తమకు కేసు విచారణను వాయిదా వేయక తప్పడం లేదని తెలిపింది. అంతకుముందు రాజీవ్ ధవన్ మాట్లాడుతూ, ఈ కేసును తొలుత ముగ్గురు సభ్యుల ధర్మాసనానికి నివేదిస్తారని తెలిపారని, కానీ సీజేఐ ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు చేశారని అన్నారు. ఇందుకు చట్టపరమైన ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉంటుందన్నారు. దీనిపై సీజేఐ స్పందిస్తూ, ఏ ధర్మాసనంలోనైనా ఇద్దరు సభ్యులుండాలంటూ సుప్రీంకోర్టు 2013లో ఇచ్చిన రూలింగ్‌ను గుర్తు చేశారు. ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనాన్ని ఏర్పాటు చేయడం తప్పు కాదని స్పష్టం చేశారు. 'వాస్తవాలు, పరిస్థితులను పరిశీలనలో ఉంచుకొని, ఈ కేసుకు సంబంధించి భారీ సంఖ్యలో పత్రాలు ఉన్నందున, విచారణకు ఐదుగురు సభ్యుల ధర్మాసనం ఏర్పాటు చేయడం సహేతుకం' అని ఆయన చెప్పారు. 50 సీల్డ్ ట్రంకు పెట్టెల్లో ఉన్న రికార్డులను కోర్టు రిజిస్ట్రీ పరిశీలిస్తుందని అన్నారు. ఆ పత్రాలలో కొన్ని సంస్కృతం, అరబిక్, ఉర్దూ, హిందీ, పర్షియన్, గుర్ముఖి భాషలలో ఉన్నాయని, వాటిని అనువాదం చేయాల్సి ఉంటుందని చెప్పారు.ఈ విచారణలో 113 అంశాలను కోర్టు పరిశీలించాల్సి ఉంటుందని ధర్మాసనం తెలిపింది. అలహాబాద్ హైకోర్టు ముందు విచారణ జరిగినప్పుడు 88 మంది సాక్షులను విచారించి, వారి వాంగ్మూలాలను రికార్డు చేశారని పేర్కొంది. సాక్షుల వాంగ్మూలం 2,886 పేజీలు ఉందని, వాటికితోడు 257 డాక్యుమెంట్లు కూడా ఉన్నాయని తెలిపింది. హైకోర్టు తీర్పు ప్రతి 4,304 పేజీలుండగా, అనుబంధాలతో కలిపి మొత్తం 8వేల పేజీలుందని పేర్కొంది. గత ఏడాది సెప్టెంబర్ 27న, అయోధ్య భూవివాదంపై విచారణ జరిగిన సందర్భంగా, 1994 నాటి తీర్పులో.. 'ఇస్లాం మతంలో మసీదు భాగం కాదు' అంటూ చేసిన వ్యాఖ్యలను పునఃపరిశీలించేందుకు ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు చేయాలన్న విజ్ఞప్తిని సుప్రీంకోర్టు 2:1 మెజార్టీతో తిరస్కరించింది. తిరిగి ఈ నెల 4న ఈ కేసు విచారణకు వచ్చినప్పుడు.. దీనిపై రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు చేస్తారన్న సంకేతాలు కనిపించలేదు. అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ 14 పిటిషన్లు దాఖలయ్యాయి.

అయోధ్య కేసు విచారణను ప్రత్యక్ష ప్రసారం చేయాలి: గోవిందాచార్య

రాజకీయంగా ఎంతో సున్నితమైన అయోధ్య కేసుపై సుప్రీంకోర్టులో జరిగే విచారణను ప్రత్యక్ష ప్రసారం చేయాలని ఆరెస్సెస్ మాజీ సిద్ధాంతకర్త కేఎన్ గోవిందాచార్య కోరారు. ఈ మేరకు ఆయన కేంద్ర ప్రభుత్వానికి ఒక లేఖ రాశారు.

మళ్లీ ట్రిపుల్ తలాక్ ఆర్డినెన్స్

కేంద్ర మంత్రివర్గం నిర్ణయం


న్యూఢిల్లీ, జనవరి 9: ట్రిపుల్ తలాక్‌ను నేరంగా పరిగణించే ఆర్డినెన్స్‌ను మళ్లీ జారీ జేయాలని కేంద్ర మంత్రివర్గం గురువారం నిర్ణయించింది. గతేడాది సెప్టెంబర్‌లో జారీ చేసిన మొదటి ఆర్డినెన్స్ గడువు జనవరి 22తో పూర్తయిపోనుంది. ఈ నేపథ్యంలో మళ్లీ ఆర్డినెన్స్ జారీ చేయాలని కేంద్రం నిర్ణయించింది. మరోవైపు భారతీయ వైద్య మండలి ఆర్డినెన్స్‌ను కూడా మళ్లీ జారీచేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. జమ్మూ కశ్మీర్‌లో రెండు ఎయిమ్స్, గుజరాత్‌లో ఓ ఎయిమ్స్‌ను ఏర్పాటు చేసేందుకు పచ్చజెండా ఊపింది. భారత్, జపాన్ మధ్య 75 బిలియన్ డాలర్ల విలువైన నగదు మార్పిడి ఒప్పందానికి క్యాబినెట్ అంగీకారం తెలిపింది. పెట్టుబడుల ప్రోత్సాహం కోసం అత్యాధునిక సింగిల్ విండో విధానం అభివృద్ధికి ఇరు దేశాల కుదిరిన అవగాహన ఒప్పందానికి కూడా ఆమోదం తెలిపింది. నూతన, పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి విషయంలో సాంకేతిక సహకారం పెంపొందించుకునేందుకు భారత్, ఫ్రాన్స్ మధ్య కుదిరిన అవగాహన ఒప్పందానికి మంత్రివర్గం సమ్మతి తెలిపింది.

ఈబీసీ బిల్లును కొట్టివేయండి

- సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన ఓ స్వచ్ఛంద సంస్థ
- 50% గరిష్ఠ పరిమితిని బిల్లు ఉల్లంఘిస్తున్నదని ఆరోపణ

న్యూఢిల్లీ, జనవరి 10: అగ్రవర్ణాల్లోని ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు (ఈబీసీ) విద్య, ఉద్యోగ అవకాశాల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రాజ్యాంగ (124వ సవరణ) బిల్లు-2019కి వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. రిజర్వేషన్లపై 50 శాతం గరిష్ఠ పరిమితి విధిస్తూ సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పును తాజా బిల్లు ఉల్లంఘిస్తున్నదని పేర్కొంటూ 'యూత్ ఫర్ ఈక్వాలిటీ' అనే స్వచ్ఛంద సంస్థ ఈ పిటిషన్‌ను దాఖలు చేసింది. రాజ్యాంగ మౌలిక స్వరూపానికి విరుద్ధమైన ఈ బిల్లును కొట్టివేయాలని ఆ సంస్థ కోరింది. బిల్లుకు పార్లమెంటు ఆమోదం తెలిపిన మరుసటి రోజే ఈ పిటిషన్ దాఖలు కావడం గమనార్హం. పార్లమెంటు ఆమోదం పొందిన ఈబీసీ బిల్లును ప్రస్తుతం రాష్ట్రపతి ఆమోదానికి పంపనున్నారు. 1992లో ఇందిరా సహానీ కేసులో 9 మంది సభ్యుల సుప్రీంకోర్టు ధర్మాసనం వెలువరించిన తీర్పును ప్రస్తావిస్తూ... రిజర్వేషన్ల కల్పనకు ఆర్థిక ప్రాతిపదిక ఒక్కటే సరిపోదన్న రాజ్యాంగ నిబంధనను తాజా బిల్లు ఉల్లంఘిస్తున్నదని ఆ సంస్థ తన పిటిషన్‌లో పేర్కొంది.

ఢిల్లీ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా షీలా దీక్షిత్



న్యూఢిలీ: ఢిల్లీ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా మాజీ సీఎం షీలా దీక్షిత్ నియమితులయ్యారు. అనారోగ్య కారణాలతో ఇటీవల అధ్యక్ష పదవికి అజయ్ మాకెన్ రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో గురువారం షీలా దీక్షిత్‌ను ఆ పదవిలో నియమిస్తూ కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ ఉత్తర్వులు జారీ చేశారు. దీక్షిత్‌ను ఢిల్లీ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా నియమించడంతో లోక్‌సభ ఎన్నికల్లో ఆప్, కాంగ్రెస్ పొత్తు పెట్టుకోనున్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి.



ఇరువై ఏండ్ల కిందట దూరదృష్టి గల నేత అటల్ జీ భారత రాజకీయాల్లో కొత్త రాజకీయ సంస్కృతిని తెచ్చారు. విజయవంతమైన సంకీర్ణ రాజకీయాలకు పునాది వేశారు. ప్రాంతీయ ఆకాంక్షలకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చి, వాజపేయి మాకు ఏ మార్గం చూపెట్టారో బీజేపీ దాన్నే అనుసరిస్తున్నది.

నరేంద్ర మోదీ, ప్రధాని

మా పార్టీ సమాజ్‌వాదీ పార్టీలో విలీనమయ్యే ప్రసక్తే లేదు. వచ్చే ఎన్నికల్లో మతతత్వ బీజేపీని అడ్డుకోవడానికి ఎవరితోనైనా కలువటానికి సిద్ధం. గౌరవప్రదంగా మా పార్టీ కోరినన్ని సీట్లు ఇచ్చి, మాతో కలిసివచ్చే పార్టీలతో కలిసి పనిచేయడానికి నేను సిద్ధం..

శివపాల్ యాదవ్, ప్రగతిశీల సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు



చరిత్రలో నేడు



1787

వరుణ గ్రహానికి ఉపగ్రహాలు టిటానియా, ఒబెర్రాన్‌లను కనుగొన్న విలియం హెర్షెల్.

1972

బంగ్లాదేశ్ అధ్యక్షునిగా అబు సయ్యద్ చౌదరీ.





2007

హ్యారీపోటర్ 7వ భాగాన్ని పూర్తిచేసిన జేకే రౌలింగ్.

కేంద్రం తీసుకొచ్చిన పౌరసత్వ సవరణ బిల్లుకు నిరసనగా ఈశాన్య భారతంలోని అసోం, త్రిపుర రాష్ట్రాల్లో ఆందోళనలు ఉధృతమయ్యాయి. ఈ బిల్లుతో ఈశాన్య రాష్ట్రాల్లో కొన్ని ప్రాంతాల్లో స్థానికులు మైనార్టీలుగా మారిపోయే పరిస్థితులు తలెత్తుతాయని అంటున్నాయి. ఈ నేపథ్యంలోనే అసోంలో బీజేపీ అధికారపక్ష భాగస్వామ్య పక్షం అసోం గణ పరిషత్ బీజేపీతో తెగదెంపులు చేసుకుంటున్నట్లు ప్రకటించింది. ఏదేమైనా ఈ బిల్లుతో ఈశాన్య రాష్ట్రాల్లో రాజకీయ సమీకరణలు మారిపోయే పరిస్థితులు ఏర్పటం గమనార్హం.

ది హిందూ

షేక్ హసీనా నేతృత్వంలోని మహాకూటమి బంగ్లాదేశ్‌లో తిరుగులేని మెజార్టీతో విజయం సాధించింది. అవామీ లీగ్ 257 స్థానాల్లో విజయం సాధించగా, ప్రతిపక్ష కూటమి కేవలం ఏడు స్థానాల్లో గెలిచి ఉనికిని చాటుకున్నది. బంగ్లాదేశ్ అవతరణ కాలం నుంచీ అపరిష్కృతంగా ఉన్న అనేక సమస్యల పరిష్కారానికి హసీనా భారత్‌కు సంపూర్ణ సహకారాన్ని అందించారు. అలాగే ఈశాన్య రాష్ట్రాల్లోని వేర్పాటువాదులు బంగ్లా భూభాగాన్ని స్థావరం చేసుకున్న దానిపై హసీనా ప్రభుత్వం కఠినంగా వ్యవహరించి భారత్‌కు చేయూతనందించింది.

ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్

రిజర్వేషన్ ఫలాలు

సాధారణ ఎన్నికల ముంగిట కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. అగ్రవర్ణ నిరుపేదలకు విద్య, ఉద్యోగావకాశాల్లో పది శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాజ్యాంగ సవరణ బిల్లు పార్లమెంట్ ఉభయసభల్లో ఆమోదం పొందింది. నిజానికి ఈ పది శాతం రిజర్వేషన్లు అగ్రవర్ణాల్లోని పేదల కోసమనే వివరణ ఆ బిల్లులో లేదు. సమాజంలోని నిరుపేద వర్గాలకు విద్య, ఉద్యోగావకాశాల్లో అవకాశాల కోసమని వివరించింది. ఎంతోకాలంగా అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లు అవసరమన్న వాదం బలంగా ఉన్నది. ఎట్టకేలకు ఎన్డీయే ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై, సమయ సందర్భాలపై ఎన్ని విమర్శలున్నా అన్ని రాజకీయపార్టీలు సమర్థించటం గమనార్హం. రాజ్యాంగం ప్రకారం తరతరాలుగా సామాజికంగా వివక్ష, అణిచివేతలకు గురవుతున్న వర్గాలకు మాత్రమే రిజర్వేషన్లు పొందే అవకాశం ఉన్నది. మౌలికంగా రాజ్యాంగపరంగా రిజర్వేషన్ విధాన స్ఫూర్తి అదే. కానీ ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక వెనుకబాటుతనం, పేదరికం ఆధారంగా రిజర్వేషన్లు కల్పిస్తామని చెబుతున్నది. ఇది రాజ్యాంగస్ఫూర్తికి విరుద్ధమని ఎవరైనా కోర్టు మెట్లెక్కితే ఎంత మేరకు నిలుస్తుందనే సందేహం ఉన్నది. మరోవైపు ఈ పది శాతం రిజర్వేషన్ల పెంపుతో మొత్తం రిజర్వేషన్ల కోటా యాభై శాతానికి మించిపోతున్నది. గతంలో సుప్రీంకోర్టు తీర్పులకు అనుగుణంగా చూస్తే రిజర్వేషన్లు యాభై శాతానికి మించరాదు. ఈ విధమైన రాజ్యాంగపరమైన అవరోధాలు అధిగమించి సమాజంలోని నిరుపేద వర్గాలకు రిజర్వేషన్ ఫలాలు అందాల్సిన అవసరం ఉన్నదన్నది కూడా సామాజిక అవసరంగా గుర్తించాలి.

పీవీ ప్రధానిగా ఉన్న కాలంలో కూడా అగ్రవర్ణాల పేదలకు పది శాతం రిజర్వేషన్లు కల్పించాలని తలపెట్టారు. కానీ ఆ పెంపుదలతో రిజర్వేషన్ల శాతం యాభైకి మించిపోతున్నదని, ఇది రాజ్యాంగస్ఫూర్తికి వ్యతిరేకమని అప్పుడు సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. దీంతో అగ్రవర్ణాల పేదల రిజర్వేషన్ల అంశం అటకెక్కింది. ఆ తర్వాత మరెవరూ అగ్రవర్ణ పేదల రిజర్వేషన్లు అన్న అంశాన్ని ముట్టుకోవటానికి సాహసించలేదు. కాలక్రమంలో అనేక రాష్ట్రాల్లో అగ్రవర్ణాల పేదలకు రిజర్వేషన్లు కావాలనే ఉద్యమాలు ముందుకువచ్చాయి. గుజరాత్, మధ్యప్రదేశ్, హర్యానా, యూపీ రాష్ట్రాల్లో అగ్రవర్ణాల్లోని పేదలకు రిజర్వేషన్లు కావాలని పెద్ద ఎత్తున ఉద్యమించారు. మొత్తంగా రిజర్వేషన్ల కొనసాగింపుపై కూడా మౌలికంగా విధానపరమైన చర్చలు తెరమీదికి వచ్చాయి. మరోవైపు గత కొంత కాలంగా దేశంలో మోదీ నేతృత్వంలోని బీజేపీకి ఎదురుగాలి వీస్తున్నది. ఈ మధ్య జరిగిన రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో బీజేపీ పరాజయం పాలయ్యింది. మరికొన్ని నెలల్లో సాధారణ ఎన్నికలు రాబోతున్న పరిస్థితుల్లో ఈ రిజర్వేషన్ల ఆసరాతో మరోసారి అధికారాన్ని చేజిక్కించుకోవాలని మోదీ చూస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. రాజకీయాలు అటుంచి దశాబ్దాలుగా కొన్ని సామాజిక వర్గాలు ఆకాంక్షిస్తున్న అగ్రవర్ణాలకు రిజర్వేషన్లు కల్పించటం సామాజిక ఆందోళనల ప్రతిఫలనంగా చెప్పుకోవచ్చు. అగ్రవర్ణాల్లోని నిరుపేదలు కులపరమైన రిజర్వేషన్లపై వ్యక్తపరుస్తున్న వ్యతిరేకతలు, ఈర్ష్యాద్వేషాలు సమసిపోవటానికి ఈ పదిశాతం రిజర్వేషన్లు భూమిక అవుతాయనటంలో సందేహం లేదు.

> **నిరుద్యోగ సమస్య తీవ్రమవుతున్న సందర్భంలో ప్రభుత్వాలు రిజర్వేషన్లు, కోటాలతో కాలం వెల్లబుచ్చటం శ్రేయస్కరం కాదు. రెండంకెల వృద్ధిరేట్లు, జీడీపీల పెరుగుదల అనేవి అభివృద్ధి ఫలాలు అందకుండా దూరంగా ఉన్న వర్గాల అసమ్మతిని సంతృప్తి పర్చలేవు. అభివృద్ధిని అంకెల్లో చూడడం కాకుండా క్షేత్రస్థాయిలో ప్రజల జీవన ప్రమాణాల పెరుగుదలకు ఎంతమేర ఉపయోగపడుతున్నాయో చూడాలి. సంపద సృష్టి కోసం తపన పడుతున్న పాలకులు ఆ సంపదను అందరికీ అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలి.**

కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన పది శాతం రిజర్వేషన్లు కేవలం అగ్రవర్ణాల పేదలకు మాత్రమేనని అర్థం కాదు. సమాజంలోని ఆర్థికంగా వెనుకబడిపోయిన నిరుపేద వర్గాలన్నీ ఈ రిజర్వేషన్ ఫలాలను పొందవచ్చు. కులాలు, మతాలకతీతంగా ఈ పెరిగిన పది శాతం రిజర్వేషన్ ఫలాలను అనుభవించవచ్చు. అయితే కేంద్రం తలపెట్టిన పది శాతం రిజర్వేషన్ల పెంపుదల ఆచరణలోకి రావాలంటే, రాజ్యాంగ సవరణ చేసినందున న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తకపోవచ్చు అని కేంద్రం అంటున్నది. ఇదే సందర్భంగా ఇప్పటిదాకా 27 శాతం రిజర్వేషన్లు అనుభవిస్తున్న బీసీలు తమ రిజర్వేషన్ జనాభాకు అనుగుణంగా పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించినప్పుడే అన్నివర్గాలకు సమన్యాయం దక్కుతుందన్న వాదనలూ బలం పుంజుకుంటున్నాయి. అయితే ఈ రిజర్వేషన్ బిల్లు ఆచరణలోకి వచ్చి, ఫలాలు పొందటానికి మరికొంత కాలం పట్టవచ్చు. సరళీకరణ, నూతన ఆర్థిక విధానాలు, ప్రైవేటీకరణ నేపథ్యంలో అందివచ్చిన ఉద్యోగావకాశాల నేపథ్యంలో గత రెండు మూడు దశాబ్దాలుగా రిజర్వేషన్ల సమస్య అంత తీవ్రంగా ముందుకురాలేదు. కానీ మునుముందు నిరుద్యోగ సమస్య తీవ్రమవుతున్న సందర్భంలో ప్రభుత్వాలు రిజర్వేషన్లు, కోటాలతో కాలం వెల్లబుచ్చటం శ్రేయస్కరం కాదు. రెండంకెల వృద్ధిరేట్లు, జీడీపీల పెరుగుదల అనేవి అభివృద్ధి ఫలాలు అందకుండా దూరంగా ఉన్న వర్గాల అసమ్మతిని సంతృప్తి పర్చలేవు. అభివృద్ధిని అంకెల్లో చూడడం కాకుండా క్షేత్రస్థాయిలో ప్రజల జీవన ప్రమాణాల పెరుగుదలకు ఎంతమేర ఉపయోగపడుతున్నాయో చూడా లి. సంపద సృష్టి కోసం తపన పడుతున్న పాలకులు ఆ సంపదను అందరికీ అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలి. తాత్కాలిక ఉపశమనాలతో, బుజ్జగింపులతో సామాజిక సమూహాలను ఎంతోకాలం ఏమార్చటం భావ్యం కాదు.

జనగళం

అభివృద్ధికి ఓటెయ్యాలె

రాష్ట్రవ్యాప్తంగా సర్పంచ్ ఎన్నికలు దగ్గర పడుతున్నా కొద్దీ గ్రామాల్లో హడావుడి మొదలైంది. నువ్వా నేనా అంటూ పోటీదారులు ప్రచారం షురూ చేశారు. అయితే ఓటర్లను ప్రభావితులను చేసే చర్యలకు కూడా అంతులేకుండా పోతున్నది. డబ్బు, మద్యం ప్రభావం పెరిగిపోతున్నది. ముఖ్యంగా యువతను లోబర్చుకోవాలనే కుయుక్తులు పన్నుతున్నారు. సర్పంచిగా గెలిచిన తర్వాత ఊర్లో ఉంటూ ఊరి అభివృద్ధికి ఎవరైతే పాల్పడగలరో వారినే సర్పంచిగా గెలిపియ్యాలె తప్పా మద్యానికి, డబ్బుకు లొంగకూడదు. గ్రామాల్లోని యువత గ్రామాభివృద్ధి కోసం ఒక మ్యానిఫెస్టో రూపకల్పన చేయాలె. ఆ మ్యాని ఫెస్టోను హామీగా తీసుకొనే అభ్యర్థికే పట్టంగట్టాలె. అప్పుడే గ్రామాలు అభివృద్ధి చెందుతాయి. గ్రామ స్వరాజ్య లక్ష్యం నెరవేరుతుంది.

- చుంచు అరుణ్, వెల్గనూర్, దండేపల్లి, మంచిర్యాల

ప్రయాణ భారాలు తగ్గించాలె

పండుగల సీజన్ వచ్చిందంటే చాలు అదే అదనుగా ఆర్టీసీ అధికారులు స్పెషల్ బస్సుల పేరుతో ఛార్జీలను పెంచుతున్నారు. ప్రయాణికుల అవసరాన్ని ఆసరాగా తీసుకొని ప్రభుత్వ సంస్థ అయిన ఆర్టీసీ కూడా బస్సు ఛార్జీలు పెంచటం శోచనీయం. ఛార్జీలు పెంచకుండా బస్సుల సంఖ్యను పెంచి ప్రయాణికుల అవసరాలను తీర్చాలి. అలాగే పండుగలు వచ్చాయంటే చాలు ప్రైవేట్ వాహనాల దోపిడీకి అడ్డుకట్ట లేకుండాపోతున్నది. ఇటు ఆర్టీసీ బస్సుల కొరత ఉండటంతో ప్రయాణికులు గత్యంతరం లేక ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. దీంతో ప్రైవేట్ వాహనాల యాజమానులు అందినకాడికి దండుకుంటున్నారు. ఒక్కోసారి బస్సు ఛార్జీలకు రెండు రెట్లు డబ్బులు వసూలు చేస్తున్నారు. అంతేకాకుండా రోడ్డు ప్రమాదాలూ జరుగుతున్నాయి. కాబట్టి బస్సుల కొరత లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఆర్టీసీ యాజమాన్యానిదే. ప్రజల సౌకర్యార్థం ఏర్పాటైన ఆర్టీసీ లాబాల వేటలో పడి వ్యవహరించటం సమర్థనీయం కాదు. అంతేకాకుండా అదనపు బస్సు ఛార్జీలు వసూలు చేయకుండా ప్రయాణికులను గమ్యం చేర్చాలి. ఆ దిశగా ఆర్టీసీ యాజమాన్యం కృషి చేయాలి.

- పుల్కం సంపత్‌కుమార్, రాములపల్లె, పెగడపల్లి, జగిత్యాల జిల్లా

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

జాతీయం



ప్రొఫెసర్ కనకదుర్గ దంటు

ఎన్నికల్లో లబ్ధి కోసమే ఈ ఎత్తుగడ

ఒక పక్క నోట్ల రద్దుతో దేశంలో బ్యాంకుల ముందు, ఏటీఎంల ముందు మైళ్ల కొద్దీ క్యూలు, తట్టుకోలేని వృద్ధులు వందల సంఖ్యలో మరణించడం, వందల పెండ్లిళ్లు కూడా సామాన్యులు వాయిదా వేసుకుంటే, రాజకీయ నాయకులు, బడా వ్యాపారస్థులు ఇంటి దగ్గర కాలుమీద కాలు వేసుకొని కూర్చుని బ్యాంకుల నుంచి వ్యానులను కొత్త నోట్ల కట్టలతో తమ ఇళ్లకి మరల్చుకుంటుంటే ప్రజా స్పందన ఎలా ఉంటుంది?

ఎన్నికలు ఎదురుగా రావడంతో హడావుడిగా అగ్రవర్ణాలను ఆకట్టుకోవటానికి 10 శాతం రిజర్వేషన్లు మోదీ ప్రకటించటం ఎవరికీ ఆశ్చర్యం కలిగించలేదు, అగ్రవర్ణాలకు తప్ప. ఈ మధ్యే జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 5 రాష్ట్రాల్లో బీజేపీకి వచ్చిన ఫలితాలు ఈ అకస్మాత్ చర్యకు కారణం అని అందరికీ తెలుసు. అసలు ఏ పార్టీ అయినా ఎన్నికల ముందు, అధికారంలోకి వచ్చాక ఏం చేయాలి? ప్రజావసరాలను గమనించి, వారి అవసరాలను తీర్చేటట్టు పథకాలు రచించి, వాటిని ఎలా అమలు పరుస్తారో కూడా ఆలోచించి ఆచరణ సాధ్యంగా వాటిని మలిచి మ్యానిఫెస్టో తయారుచేసి ఎన్నికల ప్రచారంలో ప్రజల ముందుంచాలి. ఎన్నికల్లో గెలిచిన తర్వాత తమ ఉద్యమ సమయంలో ప్రజల మధ్య ఉండి వారి అవసరాలను గమనించిన నాయకుడు కేసీఆర్ వాటిని తన మ్యానిఫెస్టోలో పెట్టారు. 'నీళ్లు, నిధులు, నియామకాలు' మాత్రమే కాకుండా రాష్ట్రాభివృద్ధికి మరెన్నో మ్యానిఫెస్టోలో పెట్టని పథకాలను రచించి ప్రవేశపెట్టారు. ప్రతి పథకాన్ని, తన ప్రతి ఆలోచనను నిపుణలతో చర్చించి, దానికి సమకూర్చవలసిన నిధులు, పరిమితుల గూర్చి క్షుణ్ణంగా అధ్యయనం చేసి దానిని అమలుచేయటంతో అన్ని పథకాలు ఆశించినట్టు రూపుదిద్దుకున్నాయి. త్వరితగతిన అమలుకు నోచుకున్నాయి. సకల జనుల సర్వేలాంటిది సంక్షేమ పథకాల అమలుకు ఉపయోగపడితే, భూ సర్వే రైతులకు సంబంధించిన పథకాలకు ఎంతో తోడ్పడింది. ఇట్లా ఏ పథకమైనా ఎందుకు, ఎలా చేస్తున్నారో తెలిస్తేనే ఆ ప్రభుత్వం మీద ప్రజలకు నమ్మకం కలుగుతుంది. వాటిని చెప్పిన పద్ధతిలో, సమయంలో చేస్తున్నారని ప్రజలకు తెలియడం చాలా ముఖ్యం. 2014లో రాష్ట్ర ఎన్నికల్లో కంటే 2018 డిసెంబర్ ఎన్నికల్లో శాసనసభ్యుల సంఖ్య అధికార పార్టీకి 25 ఎక్కువగా రావటానికి కారణం. ప్రభుత్వం ఏ దిశలో వెళుతుందో ప్రజలకు స్పష్టంగా తెలియడం, వారి కంటికి ఆ పథకాల ఫలితాలు ఎదురుగా ఉండటం! ఇది చాలా ముఖ్యం. ఐదేండ్ల కాలపరిమితిలో చెప్పినవన్నీ వంద శాతం సాధించటం బహుశా ప్రపంచంలో ఏ పార్టీకీ సాధ్యపడదు. కానీ వారి ఆలోచనలు, నిర్ణయాలు చర్యల్లో రూపుదిద్దుకోవటం మొదలైతే ప్రజలకు నమ్మకం కలుగుతుంది. దశ, దిశ తెలుస్తుంది!

ఇక జాతీయ పార్టీ అయిన బీజేపీ ప్రభుత్వ పనితీరు నాలుగున్నరేండ్ల నుంచి గమనిస్తున్నాం. స్వచ్ఛ భారత్ మొదలు ఎన్నో పథకాలు విన్నాం. పెద్దనోట్ల రద్దు లాంటి పెట్రోల్, ఇతర నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుకోవడంతోటి కష్టాలను అనుభవించారు సామాన్య ప్రజలు. అసమానతలు, అవినీతికి ఇతర సామాజిక రుగ్మతలు సరిచెయ్యాలంటే ప్రక్షాళన పైస్థాయి నుంచి రావాలి. ఒక పక్క నోట్ల రద్దుతో దేశంలో బ్యాంకుల ముందు, ఏటీఎంల ముందు మైళ్ల కొద్దీ క్యూలు, తట్టుకోలేని వృద్ధులు వందల సంఖ్యలో మరణించడం, వందల పెండ్లిళ్లు కూడా సామాన్యులు వాయిదా వేసుకుంటే, రాజకీయ నాయకులు, బడా వ్యాపారస్థులు ఇంటి దగ్గర కాలుమీద కాలేసుకొని కూర్చుని బ్యాంకుల నుంచి వ్యానులను కొత్త నోట్ల కట్టలతో తమ ఇళ్లకి మరల్చుకుంటుంటే ప్రజాస్పందన ఎలా ఉంటుంది? ఒక పక్క ఒక టర్మ్ ఎన్నికైన ఎంపీలు జీవితాంతం పింఛన్లు తీసుకుంటుంటే మామూలు జనాలను వారి గ్యాస్ సిలిండర్లు బీదవారి కోసం త్యాగాలు చెయ్యాలనడం ఏం న్యాయం? సామాన్య ప్రజలకు ఏం కావాలి? అన్నదాత అయిన రైతులకు వ్యవసాయానికి నీరు, కరెంట్, ఉద్యోగస్థులకు టైములో ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లు, ధరల నియంత్రణ, ఆడవారికి సమాజంలో రక్షణ, వివక్ష లేని జీవితం, చిన్నపిల్లలకు మంచి గుణాత్మకమైన చదువు, విద్యార్థులకు చదువు అనగానే తగిన ఉద్యోగాలు! ఇవన్నీ ఒక్క టర్మ్‌లో ఎవరూ సాధించలేరు. కానీ వీటన్నింటి కోసం పటిష్ఠమైన పథకాలు రచించి అమలుచేయటం మొదలుపెట్టి సరైన దారిలో వెడుతున్నాయా అన్నది ప్రజలు గమనిస్తుంటారు. అయితే టర్మ్ అయిపోవస్తున్నది కాబట్టి ఆయా పథకాలు ఎంత చిత్తశుద్ధితో ప్రభుత్వాలు నిర్వహిస్తున్నాయో తేలికగా తెలుసుకుంటారు వారు. ఈ లోపల నాయకులు పరస్పర వ్యతిరేక అభిప్రాయాలు కలిగి ఉంటే మాత్రం కష్టమే! చంద్రబాబు గారి హోదా మీద స్టేట్‌మెంట్ల లాగ! లేక మోదీ గారి నల్లధనం అరికట్టే పథకాల లాగా!



నిజానికి మోదీ ఆర్‌ఎస్‌ఎస్ ప్రభావం ద్వారా మెజార్టీ ప్రజల మతాన్ని ఉద్ధరించదల్చుకున్నా విధానాలు వేరుగా ఉండాల్సింది. బ్రిటిష్ వారు వారి విద్యా విధానాన్ని ఎందుకు ప్రవేశపెట్టారో మెకాలే ఒక లేఖలో స్పష్టంగా రాశాడు. "I do not think we would ever conquer this country, unless we break the very backbone of this nation, which is spiritual and cultural heritage. And therefore, I propose that we replace her old and ancient education system and her culture. If the Indians think that all that is forei gn and English is good and greater than their own, they will lose their self esteem, their native culture and they will become what we want them, a truly dominated nation." మెకాలే కలలుగన్న బానిస భారత్‌ను తన పాశ్చాత్య విద్యా విధానంతో, వైవిధ్యభరితమైన ఈ దేశానికి సరిపోని విద్యా విధానాలతో జవహర్‌లాల్ నెహ్రూ పూర్తిచేశాడు. మెకాలే కల సఫలమై ఇప్పటిదాకా తాము మోదీకి నిజంగా ఈ విషయాల మీద అవగాహన ఉంటే 'హిందుత్వ' బారిన పడకుండా అసలైన వేద సంస్కృతి బోధించిన సనాతన ధర్మాన్ని తిరిగి విద్యావిధానంతో ప్రవేశపెట్టేవాడు. ప్రతి రాష్ట్రంలో ఒక సంస్కృత అకాడమీని స్థాపించిర, వేదాలను అన్ని భాషల్లోకి అనువదించి వాటి సారాంశాలను విద్యలో చొప్పించమని ఆదేశించేవాడు. ఆవును తిన్నవాడిని చంపడం కాదు, గోవు గురించి వేదాలలో చెప్పిన విషయాలు విద్యార్థులకు శాస్త్రీయంగా బోధిస్తే, భవిష్యత్తులో గో భక్షణ ఆగిపోయేది. మరుగునపడ్డ వేద సంస్కృతి, వేద భాష సంస్కృతాన్ని పునరుద్ధరిస్తే ఈ జాతి తనంత తానే తిరిగి బలోపేతమౌతుంది. అప్పుడు అగ్రవర్ణాలకు రిజర్వేషన్లు కాదు, ఎవరికీ రిజర్వేషన్లు అవసరమే పడదు. భక్తి కాకుండా శాస్త్రీయత పునాది అయిన ఆధ్యాత్మికత ఒక్క వేదాలే ప్రవచించాయి. దానిని మనుషులు అనుసరిస్తే ఈ వైరుధ్యాలన్నీ మాయమవుతాయి. బీజేపీ అంత అఖండంగా గెలిచినప్పుడు ఇవన్నీ చేసే అవకాశం చాలా ఉండింది. ఇదే మీరు చేయకుండా హిందువులందరూ కలిసికట్టుగా ఉండాలన్న పిడి వాదనను తెరపైకి తెచ్చిన ఈ దేశం ఇంకా ఛిన్నాభిన్నమయ్యేట్టు చేశారు. ఇప్పుడు అగ్రవర్ణాల బిల్లు తెస్తే ఏం లాభం? ఎన్ని బిల్లులు మూలబడి లేవు? మహిళా బిల్లు అప్పుడే సిల్వర్ జూబ్లీ చేసుకుంది. మోదీ గారు చెయ్యదల్చుకున్న పటేల్ విగ్రహం, బుల్లెట్ రైలు లాంటివి తప్ప ఏ పథకాలు 'బారసాల' స్థాయి దాటి 'అన్నప్రాసన' స్థాయికి చేరుకోనే లేదు. ఈ వ్యాసం రాస్తుండగానే ఒక స్నేహితురాలు వచ్చి చాలా సంతోషంగా 'కర్నూలులో విమానాశ్రయానికి పునాదిరాయి వేశాడు తెలుసా చంద్రబాబు' అంటూ ఆనందపడిపోయింది. పాపం! 'మా తెలంగాణలో అటువంటి పునాదిరాళ్లు చంద్రబాబు, కాంగ్రెస్ నేతలు మస్తుగా వేశారు. అసలు కాళేశ్వరం ప్రాజెక్టులో ఉపయోగిస్తున్న సగం రాళ్ళు ఈ 58 ఏండ్లలో వాళ్లేసిన పునాదిరాళ్లే తెలుసా?' అన్నాను. కొన్నేమో ఒకచోట పునాదిరాయి, ఇంకోచోట దానికి సంబంధించిన సంస్థ, కట్టడం-జేఎన్టీయూలాగా, నాగార్జునసాగర్ డ్యామ్ లాగ! ఎవరు నమ్మాలి వీళ్ళని? ఎన్నాళ్ళు? ఎన్నేళ్ళు? మరి ఈ పార్టీలు, నాయకులు చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ఏం లాభం? ఎంతో విలువైన సమయాన్ని పనికిరాని రాజకీయాలతో వృథా చేసుకొని ఇప్పుడు ఆఖరి క్షణంలో వెంటిలేటర్ల లాంటి పథకాలు, బిల్లులు పెడితే ఏం లాభం? రాజకీయ నాయకులూ, ప్రజలు ఎదిగారు, ఆలోచనాపరులయ్యారు. మరి మీరు ఎదుగక తప్పదు! మొన్న ఎన్నికల్లో తమ పథకాలు ఏ దశలో ఉన్నాయో కేసీఆర్ గారు ప్రజల ముందు ఆవిష్కరించినట్టు మీరూ వచ్చే ఎన్నికల్లో చేయగలరా? ఆలోచించండి!

> **కొన్నేమో ఒకచోట పునాదిరాయి, ఇంకోచోట దానికి సంబంధించిన సంస్థ, కట్టడం-జేఎన్టీయూలాగా, నాగార్జునసాగర్ డ్యామ్ లాగ! ఎవరు నమ్మాలి వీళ్ళని? ఎన్నాళ్ళు? ఎన్నేళ్ళు? మరి ఈ పార్టీలు, నాయకులు చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ఏం లాభం? ఎంతో విలువైన సమయాన్ని పనికిరాని రాజకీయాలతో వృథా చేసుకొని ఇప్పుడు ఆఖరి క్షణంలో వెంటిలేటర్ల లాంటి పథకాలు, బిల్లులు పెడితే ఏం లాభం? రాజకీయ నాయకులూ, ప్రజలు ఎదిగారు, ఆలోచనాపరులయ్యారు. మరి మీరు ఎదుగక తప్పదు! మొన్న ఎన్నికల్లో తమ పథకాలు ఏ దశలో ఉన్నాయో కేసీఆర్ గారు ప్రజల ముందు ఆవిష్కరించినట్టు మీరూ వచ్చే ఎన్నికల్లో చేయగలరా? ఆలోచించండి!**

ఆకాశవాణి మూగపోవద్దు

విశ్లేషణ



సురేష్ కాలేరు

నిర్వహణ వ్యయం భారీగా పెరుగుతుండటంతో దశాబ్దాల తరబడి విశిష్ట సేవలందించిన ప్రభుత్వ రంగంలోని ఆకాశవాణిపై కేంద్ర ప్రభుత్వం చూపిస్తున్న నిర్లక్ష్య వైఖరితో క్రమక్రమంగా మూగబోయే పరిస్థితులు రావడం బాధాకరం. ప్రసారాల హేతుబద్ధీకరణ నిర్వహణ వ్యయంలో భాగంగా ఆల్ ఇండియా రేడియో (ఎయిర్) జాతీయ ఛానల్‌ను మూసివేయాలని దీంతోపాటు అకాడమీ ఆఫ్ బ్రాడ్ కాస్టింగ్ అండ్ మల్టీమీడియా కూడా ముసివేయాలని ప్రసార భారతి ఇటీవల నిర్ణయించాయి.

మోదీ ప్రభుత్వం ప్రసార భారతిపై చూపించిన నిర్లక్ష్య వైఖరి క్రమక్రమంగా విక్రయించాలనే ఆలోచనలు చేయడం, వాటి మనుగడనే ప్రశ్నార్థకంగా మార్చివేయడం. ప్రకటనలు తెచ్చుకోండి.. మీ ఆదాయం సమకూర్చుకోండి అని ఆదేశాలు జారీ చెయ్యడం. వివిధ పట్టణాల్లో ఉన్న స్టేషన్లను క్రమంగా మూసివేసే కార్యక్రమానికి తెరలేపడం. ప్రసార భారతిని రెండుగా చీల్చే కుట్రలు చేస్తున్నారనే వార్తలు రావడం ఇటీవలి నిర్ణయంతో తేటతెల్లమైంది.

మారుమూల ప్రజలకు సమాచారం వినోదం అందించడంలో ఆల్ ఇండియా రేడియో, (ఆకాశవాణి) అందిస్తున్న సేవలు అజరామరమైనవి. దేశంలో 420 స్టేషన్లు కలిగి అన్ని భాషల్లో ఆకాశవాణి సినిమా పాటలు వార్తలు, వివిధ శీర్షికల కింద శ్రోతలు కోరుకున్న కార్యక్రమాలు అందజేస్తున్నది. దాదాపు 60 ఏండ్ల నుంచి రేడియో కార్యక్రమాలకు కోట్లాది అభిమాన శ్రోతలున్నారు.

ఆకాశవాణి ప్రధాన ఉద్దేశం ప్రజలకు సమాచారం అందించడం. అనేక సంక్షోభ సమయాల్లో, విపత్తుల సమావేశాల్లో మారుమూల ప్రాంతాలకు కొండ ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు రేడియో చేస్తున్న సేవలను మరువలేం. ఆకాశవాణిని ఏ ఒక్క ప్రైవేట్ ఎఫ్ ఎమ్ స్టేషన్లతో పోల్చకూడదు. దేశ సంస్కృతి సంప్రదాయాలను ప్రజలకు అందించే కార్యక్రమాలు ప్రసారం చేసే ఆకాశవాణిని నిర్లక్ష్యం చేయడం దారుణం.

1971లో ప్రారంభమైన 'వివిధ భారతి' కార్యక్రమాలు 102.8 మెగా హెర్జ్ హిందీతో పాటు స్థానిక భాషలు కలిసి ప్రతి రోజూ 17 గంటల 17 నిమిషాల పాటు వార్తలతో కలిసి వివిధ కార్యక్రమాలను ప్రసారం చేస్తున్నది. ఎన్నో ప్రైవేట్ ఎఫ్.ఎం. ఛానళ్లు తామరతంపరగా పుట్టుకువచ్చినా వివిధ భారతి కార్యక్రమాల పట్ల ఉన్న ఆదరణ ఏ మాత్రం తగ్గడంలేదు. ఆకాశవాణి కార్యక్రమాలకు శ్రోతలు ఉత్తరాల ద్వారానే ఇమెయిల్స్, ఎస్.ఎం.ఎస్‌ల ద్వారా పాటలు కోరుకుంటున్నారు. ప్రతి రోజు ఆదరణ పెరుగుతుందనడానికి ఒక వారం రోజులు ఆ కార్యక్రమాలు ఎవరైనా వింటే అర్థమవుతుంది.

వివిధ భారతి తెలుగు కార్యక్రమాలకు దాదాపు 40 లక్షల మంది రెగ్యులర్ శ్రోతలు ఉన్నట్టు ఒక అంచనా. చాలా గ్రామాల్లో దినసరి కూలీలు చేనేత కార్మికులు, బీడీ కార్మికులు, క్షురకులకు, దర్జీలకు ప్రతిరోజు రేడియో కార్యక్రమాలు ఒక ఆలంబన. ఉదాహరణకు ఆకాశవాణిలో ప్రసారమయ్యే కార్యక్రమాలు ఏక కాలంలో పండిత పామరులను ఆకర్షిస్తాయి. ఎంతోమంది ఉన్నతాధికారులు, ఉద్యోగులు వివిధ హోదాల్లో ఉన్నవారికి ముఖ్యంగా గృహిణులు, విశ్రాంత ఉద్యోగులకు ఆకాశవాణి ఒక ప్రియ నేస్తం. రోజూవారీ పని చేసుకుంటూ శ్రమను మర్చిపోయే వినోదాన్ని పొందే ఆకాశవాణి శ్రోతలది ఒక కుటుంబం. వారిది ఒక ప్రపంచం. రేడియోతో వారి అనుబంధం వీడదీయలేనిది.

ఇప్పటికీ పోస్టాఫీస్‌కు వెళ్లి ఉత్తరాలు కొనుక్కొని నచ్చిన సినిమా పాటలు రాయడం, తిరిగి వాటిని రేడియోలో వినడం అనేది ఒక అనుభూతి. వేలాదిమంది శ్రోతలు ఇప్పటికీ అసంఖ్యాక ఉత్తరాలు రాస్తున్నారంటే రేడియో ఎందరి జీవితాలతో మమైకమైపోయిందో తెలుస్తుంది. ప్రతిరోజూ శ్రోతలకు బోర్ కొట్టకుండా వివిధ వినూత్న శీర్షికలతో విజ్ఞానాన్ని అందిస్తూ వినోద భరితమైన కార్యక్రమాలు రూపొందించడంలో సమర్పించడంలో వివిధభారతిలోని వివిధ విభాగాలు పడుతున్న శ్రమ శ్రోతలకు వినబడటమే కాదు కనబడుతుంది.

చక్కటి భాషా, స్పష్టమైన ఉచ్చారణతో సందర్భోచిత పాటలు వివిధ ప్రత్యేక దినోత్సవాలు సందర్భాలు వివరిస్తూ విశ్లేషిస్తూ ప్రసారం చేసే కార్యక్రమాలు చాలా పరిశోధనాత్మకంగా ఉంటాయి. ప్రతిరోజు 'హరివిల్లు' 'బృందావనం' శీర్షిక కింద ప్రసారం చేసే కార్యక్రమాలు ఆకాశవాణి ఔన్నత్యాన్ని చాటుతున్నాయి. తెలుగుభాషను కాపాడుతున్న ప్రసార, ప్రచార మాధ్యమాల్లో ఆకాశవాణి మొదటిస్థానంలో ఉంటుందని గట్టిగా చెప్పవచ్చు. ఎక్కడ శృతిమించకుండా నిబద్ధతతో, క్రమశిక్షణతో పనిచేసే సిబ్బంది ఆకాశవాణి సొంతం.

1997లో ప్రసార భారతి కార్పొరేషన్ ఏర్పాటైన నాటి నుంచి ఆకాశవాణి దూరదర్శన్‌లకు గడ్డుకాలం మొదలైంది. కొత్త రిక్రూట్‌మెంట్ లేక ప్రమోషన్లు లేక డిప్యూటేషన్లతో నెట్టుకురావడం. క్రమక్రమంగా ప్రైవేట్ ఎఫ్.ఎం.లకు అనుమతులు ఇవ్వడం. మొదలైన చర్యలతో ప్రభుత్వాలే ఆకాశవాణిని అణగదొక్కాయి. 'ఆకాశవాణి' అందరిది. వివిధ భారతి విభిన్న వర్గాలది, దీన్ని కాపాడుకోవడం అందరి బాధ్యత. ప్రభుత్వ కార్యక్రమాలను పథకాలను ప్రజలకు చేరవేసే ప్రసారభారతిని కాపాడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిది. అవసరమైతే వివిధ శాఖల నుంచి ప్రసారభారతి కార్పొరేషన్‌కు నిధులు అందేలా ప్రణాళిక రూపొందించాల్సిన అవసరం ఉన్నది. గత ఐదేండ్లలో ప్రభుత్వ పథకాల ప్రచారానికి ప్రధాన మంత్రి కార్యక్రమాల ప్రచారానికి వేలకోట్లు వెచ్చించింది. అందులో నుంచి కొంత బడ్జెట్‌ను రేడియోకు కేటాయిస్తే బాగుంటుంది. నరేంద్ర మోదీ గారు మీ మనస్సులో మాటను మాకు అందజేసే సాధనం రేడియో ఒక్కసారి 'సామాన్యుల మనస్సులో మాట' వినండి. ఆకాశవాణి, దూరదర్శన్‌లను కాపాడండి. ప్రసారభారతిని నిలబెట్టండి.

> **'ఆకాశవాణి' అందరిది. వివిధ భారతి విభిన్న వర్గాలది, దీన్ని కాపాడుకోవడం అందరి బాధ్యత. ప్రభుత్వ కార్యక్రమాలను పథకాలను ప్రజలకు చేరవేసే ప్రసారభారతిని కాపాడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిది. అవసరమైతే వివిధ శాఖల నుంచి ప్రసారభారతి కార్పొరేషన్‌కు నిధులు అందేలా ప్రణాళిక రూపొందించాల్సిన అవసరం ఉన్నది.**

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy**. Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.



ప్రారంభమైన కొత్తకొండ బ్రహ్మోత్సవాలు

భీమదేవరపల్లి (వరంగల్ అర్బన్): వరంగల్ అర్బన్ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం సాయంత్రం స్వామివారి కల్యాణ మహోత్సవంతో కన్నుల పండువగా ప్రారంభమయ్యాయి. స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ ఈవో ఉడుతల వెంకన్న అన్ని ఏర్పాట్లు చేశారు. వేడుకల్లో భాగంగా 14న భోగి, 15న మకర సంక్రాంతి పర్వదినాన బండ్లు తిరుగుట, 16న నాగవెల్లి వసంతోత్సవం, 17న త్రిశూలస్నానం, 18న వేకువజామున అగ్నిగుండాలు, అదేరోజున సాయంత్రం స్వామివారి ఊరేగింపుతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.



రాజన్న అన్నదానానికి రూ.లక్ష విరాళం

వేములవాడలోని శ్రీరాజరాజేశ్వర స్వామివారి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి సికింద్రాబాద్‌కు చెందిన రిటైర్డ్ ఐపీఎస్ అధికారి వీ భాస్కర్‌రెడ్డి లక్షా 116 రూపాయలు విరాళాన్ని ఆలయ ఈవో దూస రాజేశ్వర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- వేములవాడ కల్చరల్

శునకానికీ దశదినకర్మ!

సత్తుపల్లిరూరల్: నేటి యాంత్రిక జీవనంలో బంధుత్వాలు, ఆప్యాయతలు తగ్గిపోతున్న తరుణంలో.. ఎంతో అపురూపంగా తాము పెంచుకున్న శునకం (మిన్నీ) చనిపోతే ఆ కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. పెంచుకున్న మమకారానికి గుర్తుగా దశదినకర్మ నిర్వహించారు. ఈ ఘటన ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం యాతాలకుంటలో చోటుచేసుకున్నది. పదేండ్ల క్రితం కోటేశ్వరరావు, రమణమ్మ దంపతులు ఓ కుక్క పిల్లను కొనుగోలు చేసి దానికి మిన్నీగా నామకరణం చేసి పెంచుకుంటున్నారు. కుటుంబ సభ్యులతో కలిసిపోయి ఉండే మిన్నీ గత నెల 31న మరణించడంతో వారు విషాదంలో మునిగిపోయారు. మిన్నీ జ్ఞాపకార్థం గురువారం దశదినకర్మ నిర్వహించి తమ బంధుమిత్రులను ఆహ్వానించారు. వారంతా శునకం చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. గ్రామంలో ఫ్లెక్సీలు సైతం ఏర్పాటు చేశారు.



శునకం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యజమాని కుటుంబ సభ్యులు, వారి బంధువులు

ఒకే మాట.. ఒకే బాట

జోరుగా ఏకగ్రీవాలు.. ప్రోత్సాహక నిధులకే జనం మొగ్గు

రోజురోజుకూ పెరుగుతున్న తీర్మానాలు



నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: పల్లెల అభివృద్ధికి ఆయా గ్రామాల వారు 'ఒకే మాట.. ఒకే బాట' సిద్ధాంతాన్ని పాటిస్తున్నారు. ప్రభుత్వమిచ్చే రూ. 10 లక్షల ప్రోత్సాహకంతోపాటు స్థానిక ఎమ్మెల్యేలు ప్రకటించిన అదనపు నిధులు సాధించేందుకు పాలక వర్గాలను ఏకగ్రీవం చేసుకోవాలని భావిస్తున్నారు. ఇందుకోసం ఎక్కడికక్కడ సమావేశమై తమ పంచాయతీ పాలక వర్గాలను ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు తీర్మానాలు చేస్తున్నారు. రోజురోజుకూ తీర్మానాలు పెరుగుతున్నాయి. గురువారం కూడా పెద్ద ఎత్తున తీర్మానాలు చేశారు. వరంగల్ అర్బన్ జిల్లా భీమదేవరపల్లి మండలం గొల్లపల్లి సర్పంచ్, వార్డు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సర్పంచ్‌గా ఎల్దీ ఎల్లమ్మ, ఉపసర్పంచ్‌గా జెర్ర సతీశ్, వార్డు సభ్యులుగా సంగ ఓదెలు, మ్యాకల సమ్మయ్య, పూదరి శ్రీలత, నేతుల వనమ్మ, నేతుల కేతమ్మ, కనబోయిన శ్రీనివాస్, సింగరబోయిన లావణ్యను ఏకగ్రీవంగా ఎన్నుకుంటూ స్థానికులు తీర్మానం చేశారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలంలో కొత్త జీపీగా ఏర్పడిన అల్లూరి సీతారామరాజు(ఏఎస్సార్) తండాను స్థానికులు ఏకగ్రీవం చేసుకున్నారు. సర్పంచ్‌గా గుగ్లావత్ జమున, ఉపసర్పంచ్‌గా గుగ్లావత్ మహేశ్‌తోపాటు వార్డు సభ్యులను ఎన్నుకునేందుకు తీర్మానం చేశారు. అనంతరం కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావును మర్యాదపూర్వకంగా కలువగా ఆయన వారిని అభినందించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం అగ్రహారం గ్రామపంచాయతీ వాసులు ఏకగ్రీవానికి మద్దతు పలికారు. సర్పంచ్‌గా మునిగె అమృతవ్వ, ఉపసర్పంచ్‌గా పొన్నవేణి బాలమల్లు, వార్డుసభ్యులుగా మామిండ్ల జగన్, పులి మల్లయ్య, మామిండ్ల దేవవ్వ, దనాల శోభ, మామిండ్ల బుగ్గరాములు, మునిగె వేణు, మునిగె మల్లీశ్వరీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వికారాబాద్ జిల్లాలో గురువారం మరో రెండు గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. బంట్వారం మండలం మద్వాపూర్ సర్పంచ్‌గా పట్లోళ్ల గోవింద్‌రెడ్డిని, మర్పల్లి మండలం నర్సాపూర్ పెద్ద తండా సర్పంచ్‌గా ధరమ్‌సింగ్, ఉపసర్పంచ్‌గా కాశీరాం, వార్డు సభ్యులుగా రుక్కిబాయి, బన్సీబాయి, రాజు, గోపాల్, సంతోష్, కాశీరాం, మోహన్, వఖిల్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలంలో మూడు గ్రామాలు ఏకగ్రీవమయ్యాయి. పాగుంట, తూర్పుతండా, ఉమిత్యాలతండాల్లో ఒక్కొక్కరు మాత్రమే నామినేషన్ వేయడంతో వారు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



ఏకగ్రీవంగా ఎన్నికైన రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం అగ్రహారం పంచాయతీ నూతన పాలకవర్గ సభ్యులు

పార్టీలకతీతంగా కలిసిరావాలి: ఎమ్మెల్యే బండ్ల

ధరూర్ /మల్దకల్: జోగుళాంబ గద్వాల జిల్లా ధరూర్, మల్దకల్ మండలాల్లో సర్పంచ్ అభ్యర్థులతో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి గురువారం సమావేశమయ్యారు. సీఎం కేసీఆర్ పాలనలో గ్రామాలను మరింతగా అభివృద్ధి చేసుకునేందుకు పంచాయతీల ఏకగ్రీవం కోసం పార్టీలకతీతంగా కలిసిరావాలని పిలుపునిచ్చారు. ఏకగ్రీవానికి సహకరించిన అభ్యర్థులకు భవిష్యత్తులో మరిన్ని అవకాశాలు కల్పిస్తామని భరోసా కల్పించారు.

ఏకగ్రీవాలు ఇలా..

పంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవాల జోరు కొనసాగుతున్నది. తొలివిడత నామినేషన్ల దాఖలు గడువు ముగిసిన తరువాత ఒక్క నామినేషన్ మాత్రమే దాఖలైన పంచాయతీలను ఏకగ్రీవమైనట్టుగా ప్రకటించనున్నారు. అయితే నామినేషన్ ఉపసంహరణకు గడువు ముగిసిన తరువాత ఏకగ్రీవాల సంఖ్య మరింత పెరగనున్నాయి. ఇప్పటివరకు అందిన సమాచారం ప్రకారం సర్పంచ్ పదవికి ఒక్క నామినేషన్ దాఖలైన పంచాయతీల సంఖ్య జిల్లాల వారీగా ఇలావున్నాయి. కొత్తగూడెం జిల్లాలో 10, ఖమ్మంలో 4, రంగారెడ్డిలో 8, కరీంనగర్‌లో 3, రాజన్న సిరిసిల్లలో 9, జగిత్యాలలో 7, మంచిర్యాలలో 1, ఆసిఫాబాద్‌లో 8, వరంగల్ అర్బన్ జిల్లాలో 5, వరంగల్ రూరల్‌లో 15, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 16, మహబూబాబాద్‌లో 12, జనగామలో 11, కామారెడ్డిలో 17, నిజామాబాద్‌లో 14, ఆదిలాబాద్‌లో 39, నిర్మల్‌లో 31, మహబూబ్‌నగర్‌లో 23, నాగర్‌కర్నూల్‌లో 17, జోగుళాంబ గద్వాలలో 3, వనపర్తిలో 10, సూర్యాపేటలో ఒకటి, నల్లగొండ జిల్లాలో 11 పంచాయతీలకు ఒక్కో నామినేషన్ మాత్రమే దాఖలయ్యాయి.



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రామసుబ్రహ్మణ్యం గురువారం నాగార్జునసాగర్‌ను సందర్శించారు. కుటుంబసభ్యులతో కలిసి హిల్‌కాలనీలోని బుద్ధవనాన్ని, సాగర్ డ్యాం, క్రస్ట్‌గేట్లు, గ్యాలరీలోని డ్యాం నమూనాను తిలకించారు. - నందికొండ




గురువారం వనపర్తి జిల్లాకేంద్రంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శం

ఎమ్మెల్యే సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

వనపర్తి రూరల్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని వనపర్తి ఎమ్మెల్యే సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. మన ప్రభుత్వం చేపడుతున్న పలు పథకాలను వివిధ రాష్ట్రాలు అమలుచేసేందుకు ముందుకు వస్తున్నాయన్నారు. కేంద్రం కూడా రైతుబీమా, రైతుబంధు పథకాలను అమలుచేసేందుకు యోచిస్తుండటం సంతోషకరమని చెప్పారు. వనపర్తి జిల్లా కేంద్రంలో గురువారం తహశీల్దార్ శాంతిలాల్‌తో కలిసి 31 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీము-బారక్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లక్ష్మయ్య, గొర్రెల కాపరుల సంఘం చైర్మన్ కురుమూర్తి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



గురువారం లోయర్ మానేరు డ్యాం మధ్య ఉన్న ఐలాండ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

పర్యాటక ప్రాంతంగా మానేరు ఎగువ ప్రాంతం

డ్యామ్‌లోని ఐలాండ్‌కు కేసీఆర్ పేరు: ఎమ్మెల్యే గంగుల

ముకరంపుర: మానేరు ఎగువ ప్రాంతాన్ని పర్యాటకంగా తీర్చిదిద్దుతామని కరీంనగర్ శాసనసభ్యుడు గంగుల కమలాకర్ స్పష్టంచేశారు. డ్యామ్ మధ్యలోని ఎత్తైన ప్రదేశానికి కేసీఆర్ ఐలాండ్‌గా నామకరణం చేస్తున్నట్టు ప్రకటించారు. మానేరు డ్యామ్ మధ్య గుట్టప్రాంతాన్ని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దాదాపు 15 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ ఐలాండ్ చుట్టూ 25 కాటేజీలు, రెస్టారెంట్‌లు, పార్కులు ఏర్పాటుచేయాలనే సంకల్పంతో రూ.5 కోట్లతో ప్రణాళికలు రూపొందించి ముఖ్యమంత్రికి ప్రతిపాదనలు పంపుతున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో డిప్యూటి మేయర్ గుగ్గిళ్ల రమేశ్, కార్పొరేటర్‌లు, టీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గురువారం హన్మకొండ కాపువాడలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని అధికారులతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్

టూరిస్ట్‌హబ్‌గా వరంగల్ : ఎమ్మెల్యే దాస్యం

రెడ్డికాలనీ (వరంగల్): చారిత్రకమైన కట్టడాలు, ఆలయాలు, ప్రార్థనా మందిరాలు పూర్వవైభవం సంతరించుకొనేలా అభివృద్ధి చేసి నగరాన్ని టూరిస్ట్ హబ్‌గా తీర్చిదిద్దుతామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ చెప్పారు. గురువారం హన్మకొండ కాపువాడలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని సందర్శించి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆర్కియాలజీశాఖ అధికారి నాగరాజు, కుడా అధికారి అజిత్‌రెడ్డి, ఎండోమెంట్ ఈవో సునీత, రెవెన్యూశాఖ, స్థానిక నాయకులతో కలిసి ఆలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పద్మాక్షమ్మగుట్టలోని రాజకోట ప్రదేశాన్ని రూ.2.30 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్టు తెలిపారు.

దవాఖానలో ఒక్కటైన ప్రేమ జంట

వారి ప్రేమను అర్థం చేసుకొని పెండ్లి జరిపించిన పెద్దలు

వికారాబాద్, నమస్తే తెలంగాణ: తమ ప్రేమ విఫలమవుతున్నదన్న బాధతో ఆత్మహత్యకు యత్నించిన ప్రేమికులు.. దవాఖానలో చికిత్స పొందుతూ వివాహం బంధంతో ఒక్కటయ్యారు. వివరాల్లోకి వెళ్తే.. వికారాబాద్ మండలం అత్తెల్లికి చెందిన షహదాబేగం, ధారూరులోని కుక్కింద గ్రామానికి చెందిన నవాజ్ వరుసకు బావమరుదళ్లు. కొంతకాలంగా వీరు ప్రేమించుకొంటున్నారు. పెండ్లి సంబంధం చూడటంతో మనస్తాపానికి గురై షాహెదాబేగం పురుగులమందు తాగింది. విషయం తెలుసుకొన్న నవాజ్ కూడా పురుగులమందు తాగాడు. ఇద్దరిని వికారాబాద్ మిషన్ దవాఖానకు చికిత్స నిమిత్తం తీసుకొచ్చారు. వారి ప్రేమను అర్థం చేసుకొన్న పెద్దలు దవాఖానలోనే పెండ్లిచేసి ఇద్దరిని కలిపారు.



టూరిజం ఎండీతో సమావేశమైన ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్

మన్యంకొండ ఆలయాభివృద్ధికి నిధులివ్వండి

టూరిజం ఎండీకి ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ వినతి

మహబూబ్‌నగర్, నమస్తే తెలంగాణ ప్రతినిధి: పేదల తిరుపతిగా పేరొందిన మన్యంకొండ ఆలయాభివృద్ధికి నిధులు కేటాయించాలని టూరిజం కార్పొరేషన్ ఎండీ మనోహర్‌రావును మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ కోరారు. గురువారం ఆయన ఎండీని కలిసి ఈ మేరకు విన్నవించారు. ఈ ఆలయానికి తెలంగాణతోపాటు కర్ణాటక, మహారాష్ట్ర, ఏపీ నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారని, ఈ ఆలయ ప్రాంగణంలో మరిన్ని వసతులు కల్పించాల్సిన అవసరం ఉన్నదని సూచించారు. ఇప్పటికే రూ.12 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టామని, మరిన్ని పనులను చేపట్టేందుకు రూ.20 కోట్లపైగా అవసరమవుతాయని వివరించారు. త్వరలోనే నిధులు మంజూరు చేస్తామని ఎండీ హామీ ఇచ్చినట్టు ఎమ్మెల్యే తెలిపారు.

ఏసీబీకి చిక్కిన పరిశ్రమల శాఖ అధికారి

రూ.10వేలు తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు



నిందితుడు వీరేశం

మహబూబాబాద్ రూరల్: రైతు నుంచి రూ.10 వేలు లంచం తీసుకొంటుండగా జిల్లా పరిశ్రమల అధికారిని ఏసీబీ అధికారులు పట్టుకొన్నారు. ఈ సంఘటన మహబూబాబాద్‌లో గురువారం చోటుచేసుకున్నది. ఏసీబీ డీఎస్పీ భద్రయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం టీక్యా తండా కు చెందిన ధరావత్ బగ్గా అనే రైతు.. ఏడాది కిందట వరికోత మెషిన్ కొనుగోలు చేశాడు. ప్రభుత్వ సబ్సిడీ కోసం దరఖాస్తు చేసుకొన్నాడు. ఫైల్ ప్రభుత్వానికి పంపించేందుకు జిల్లా పరిశ్రమల శాఖ అధికారి వీరేశం రూ.12 వేలు లంచం డిమాండ్ చేశాడు. రైతు నుంచి వీరేశం లంచం తీసుకొంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొన్నారు. అరెస్టు చేసి ఏసీబీ కోర్టులో హాజరుపర్చనున్నట్టు ఏసీబీ ఇన్‌స్పెక్టర్లు వెంకట్, సతీశ్‌కుమార్, క్రాంతికుమార్ తెలిపారు.

రేపు సిరిసిల్లలో కైట్ ఫెస్టివల్

సిరిసిల్లటౌన్ : సంక్రాంతి పండుగ సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లాకేంద్రంలో కైట్ ఫెస్టివల్ నిర్వహణకు మున్సిపల్ అధికారులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. మానేరు తీరంలోని బతుకమ్మ ఘాట్ వేదికగా శనివారం కైట్ ఫెస్టివల్ నిర్వహించనున్నారు. హైదరాబాద్‌కు చెందిన కైట్ ఫ్లయర్స్ బృందం సభ్యులు ఈ వేడుకలో పాల్గొనేందుకు రానున్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో కైట్ ఫ్లయర్స్ ప్రజలకు అవగాహన కల్పించేలా ఏర్పాటుచేసిన పతంగులను ప్రదర్శించనున్నారు. మహిళలకు ముగ్గుల పోటీలతో పాటు ఫుడ్ స్టాల్స్ ఏర్పాటుచేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

వడ్డీ వ్యాపారులపై ఉక్కుపాదం

అక్రమ వడ్డీ వసూలు చేస్తున్నవారి ఇండ్లపై పోలీసు దాడులు

నల్లగొండ క్రైం: నల్లగొండ జిల్లాలో అధికమొత్తంలో వడ్డీ వసూలు చేసే వ్యాపారుల ఇండ్లు, దుకాణాలపై పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. నల్లగొండ, కొండమల్లేపల్లి, నిడమనూరు, మిర్యాలగూడతోపాటు పలు ప్రాంతాల్లోని ప్రైవేటు ఫైనాన్స్‌లు, స్కీములు, అక్రమంగా చిట్టీలు నడిపేవారిని గుర్తించి తనిఖీలు నిర్వహించారు. కొండమల్లేపల్లిలోని పలువురి ఇండ్లల్లో సోదాలు జరిపి రూ.11 లక్షల నగదు, పలు ప్రామిసరీ నోట్లు, తనఖా ఉంచుకొన్న ల్యాండ్ డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదుచేసినట్టు దేవరకొండ డీఎస్పీ మహేశ్వర్ తెలిపారు.

నేడు హైమన్ డార్ఫ్ వర్ధంతి

గిరిజన సంప్రదాయ పద్ధతిలో కార్యక్రమం

మార్లవాయిలో ఏర్పాట్లు పూర్తి

జైనూర్: ఆదివాసుల జీవితాల్లో వెలుగులు నింపిన హైమన్ డార్ఫ్ వర్ధంతి సందర్భంగా ఆసిఫాబాద్ జిల్లాలోని జైనూర్ మండలం మార్లవాయిలో శుక్రవారం డార్ఫ్ సేవలను ఆదివాసీలు స్మరించుకోనున్నారు. ఈ కార్యక్రమానికి అదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్ కలెక్టర్లతోపాటు ఎంపీ గోడా నగేశ్, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, మాజీ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఎస్పీ మల్లారెడ్డి హాజకానున్నారు. స్వాతంత్ర్య పోరాటానికి ముందే గిరిజనులకు 1.60 లక్షల ఎకరాల భూపంపిణీ జరిగేలా చేసి వారి గుండెల్లో చెరగని ముద్రవేశారు. 1909 జూన్ 22న ఆస్ట్రేలియాలో జన్మించిన డార్ఫ్.. నిజాం కాలంలో గిరిజనుల తిరుగుబాటుకు కారణాన్ని తెలుసుకొనేందుకు ప్రభుత్వ దూతగా 1940లో ఇక్కడికి వచ్చి మార్లవాయి గ్రామంలో స్థిరపడ్డారు. ఆదివాసులకు అండగా, వారి అభివృద్ధికి కావాల్సిన సహకారం కోసం నిజాం ప్రభుత్వానికి నివేదికలు సమర్పించారు. డార్ఫ్ ప్రోత్సహంతో తొలిసారి ఆదివాసీ తెగ నుంచి తుకారాం ఐఏఎస్‌గా ఎంపికయ్యారు.



ఆసిఫాబాద్ జిల్లా మార్లవాయిలో హైమన్ డార్ఫ్ దంపతుల విగ్రహాలు

డార్ఫ్ కుమారుడు లచ్చు పటేల్: ఆదివాసీలతో అనుబంధానికి గుర్తుగా డార్ఫ్, బెట్టి ఎలిజిబెత్ దంపతులు వారి సంతానానికి గిరిజనుడి పేరు పెట్టుకొన్నారు. తమ కుమారుడికి లచ్చుపటేల్‌గా నామకరణం చేశారు. 1990లో బెట్టి ఎలిజిబెత్ హైదరాబాద్‌లో కన్నుమూయగా, ఆమె కోరిక మేరకు మార్లావాయి గ్రామంలో సమాధి చేశారు. సతీమణి మరణం అనంతరం ఇంగ్లండ్ వెళ్లినప్పటికీ.. తరుచుగా మార్లావాయిని సందర్శించేవారు. 1995లో డార్ఫ్ తుదిశ్వాస విడిచినా మార్లావాయి గిరిజనులు ఆయన తమ అభివృద్ధి కోసం అందించిన సేవలను ఇప్పటికీ స్మరించుకొంటున్నారు.



గురువారం వరంగల్ రూరల్ జిల్లా గంగదేవిపల్లి గ్రామపంచాయతీని సందర్శించిన నేపాల్, బంగ్లాదేశ్ ప్రతినిధులు

గంగదేవిపల్లిని సందర్శించిన విదేశీ బృందం

గీసుగొండ: దేశంలోనే ఆదర్శ గ్రామంగా నిలిచిన వరంగల్ రూరల్ జిల్లా గీసుగొండ మండలంలోని గంగదేవిపల్లి గ్రామాన్ని గురువారం విదేశీ బృందం సందర్శించింది. నేపాల్, బంగ్లాదేశ్‌తోపాటు మన దేశం నుంచి వచ్చిన 18 మందితో కూడిన బృందం జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గ్రామాన్ని సందర్శించింది. బృందం సభ్యులు గ్రామంలోని వీధుల్లో తిరిగి రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సౌకర్యం, వ్యవసాయం చేస్తున్న పనితీరు, ప్రభుత్వ పాఠశాల, శిక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో గ్రామాభివృద్ధి కమిటీతో సమావేశమయ్యారు. గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కూసం రాజమౌళి అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యాన్ని వివరించారు. కార్యక్రమంలో ఎన్‌ఐఆర్డీ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీకాంత్, బాలవికాస ప్రోగాం ఆఫీసర్ సింగిరెడ్డి సునీత, వివిధ కమిటీల సభ్యులు జ్యోతి, సరోజన, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు



ఖమ్మంలో టీఆర్‌ఎస్‌లో చేరిన వారికి గులాబీ కండువా కప్పుతున్న ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి



నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ కాంగ్రెస్ నాయకులను టీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

గులాబీ పార్టీలో చేరికల జోరు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: టీఆర్‌ఎస్‌లోకి చేరికలు జోరందుకున్నాయి. వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున గులాబీ కండువాల కప్పుకొంటున్నారు. గురువారం కూడా భారీగా చేరారు. నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండకు చెందిన కాంగ్రెస్ నాయకులు 65 మంది మాజీ మంత్రి, జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సమక్షంలో హైదరాబాద్‌లో టీఆర్‌ఎస్‌లో చేరారు. వనపర్తి జిల్లా పెద్దమందడి సర్పంచ్ అభ్యర్థి పల్లె సత్యనారాయణతోపాటు 10మంది కార్యకర్తలు వనపర్తి ఎమ్మెల్యే సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. సూర్యాపేట జిల్లా మద్దిరాలలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు షేక్ ముజీబ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు 100 మంది తుంగతుర్తి ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ సమక్షంలో, గరిడేపల్లి జెడ్పీటీసీ పెండెం శ్రీను ఆధ్వర్యంలో 60 మంది, గరిడేపల్లి మండలం ఎల్‌బీనగర్‌కు చెందిన బోధ సైదిరెడ్డి ఆధ్వర్యంలో 40 మంది, మఠంపల్లి నుంచి 20 మంది టీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు శానంపూడి సైదిరెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో గూటికి చేరారు. ఖమ్మం జిల్లా కొణిజర్ల, జూలూరుపాడు మండలాలకు చెందిన పలు పార్టీల నాయకులతోపాటు 110 కుటుంబాల వారు ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షంలో, వైరా, కారేపల్లి, ఏన్కూరు మండలాలకు చెందిన 250 కుటుంబాల వారు వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్, టీఆర్‌ఎస్ జిల్లా నాయకులు బొర్రా రాజశేఖర్ సమక్షంలో, వైరా మండలం గోవిందాపురంలో 20 కుటుంబాల వారు మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ సమక్షంలో, కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం నాయకులగూడేనికి చెందిన 80 కుటుంబాల వారు మాజీ ఎమ్మెల్యే కోరం కనకయ్య సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు.



ఖమ్మం జిల్లా వైరాలో టీఆర్‌ఎస్‌లో చేరిన వారితో వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్

13న మర్రి చెన్నారెడ్డి శత జయంతి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ముఖ్యమంత్రి దివంగత మర్రి చెన్నారెడ్డి శతజయంతి ఉత్సవాలను ఈ నెల 13న నిర్వహిస్తున్నట్టు ఆయన కుమారుడు మర్రి రవీందర్‌రెడ్డి తెలిపారు. లోయర్ ట్యాంక్‌బండ్‌లోని ఇందిరాపార్క్ రాక్ గార్డెన్‌లో ఉన్న మర్రి చెన్నారెడ్డి విగ్రహానికి 13న ఉదయం 9 గంటలకు పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పిస్తామని పేర్కొన్నారు.

రెండుసార్లు ముఖ్యమంత్రిగా చెన్నారెడ్డి

1919 జనవరి 13న ఇప్పటి రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం పెద్దమంగళారంలో జన్మించిన మర్రి చెన్నారెడ్డి స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు. ప్రత్యేక తెలంగాణ కోసం 1969లో తొలిదశ ఉద్యమానికి నాయకత్వం వహించారు. ఉత్తర్‌ప్రదేశ్, రాజస్థాన్, తమిళనాడు లకు గవర్నర్‌గా పనిచేశారు. కేంద్రమంత్రిగా, ఉమ్మడి ఏపీకి రెండుసార్లు సీఎంగా ఉన్నారు. తమిళనాడు గవర్నర్‌గా విధులు నిర్వర్తిస్తూనే 78వ ఏట 1996 డిసెంబర్ రెండున చెన్నారెడ్డి కన్నుమూశారు.

రాహుల్‌కు బుద్ధిపెరగలేదు!

- రక్షణమంత్రిపై వ్యాఖ్యలు సరికాదు: బీజేపీ నేత ఇంద్రసేనారెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీకి వయసు పెరిగిందికానీ విచక్షణా జ్ఞానం లేదని, బుద్ధి పెరగలేదని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లు ఇంద్రసేనారెడ్డి మండిపడ్డారు. రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ విషయంలో ఆయన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నామని పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఇంద్రసేనారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ఏం మాట్లాడాలి, ఏం మాట్లాడకూడదనేది ఇప్పటికీ రాహుల్‌కు తెలియకపోవడం కాంగ్రెస్ పార్టీ దురదృష్టమని తెలిపారు. ఈబీసీలకు రిజర్వేషన్లను కల్పిస్తూ ప్రధాని మోదీ సంచలన నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు.

ఏడాదికి ఒకేసారి నోటిఫికేషన్

- ఫసల్ బీమాపై నూతన మార్గదర్శకాలు
- 2019 వానకాలం సీజన్ నుంచే అమలులోకి..
- జిల్లాలు, పంటలవారీగా ప్రకటించిన రాష్ట్రస్థాయి కోఆర్డినేషన్ కమిటీ
- ఆదిలాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్ పైలట్ ప్రాజెక్టు కింద సాగుచేసిన టమాటా పంటకు వర్తింపు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: 2019 వానకాలం నుంచి ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై) అమలు మార్గదర్శకాలలో ప్రభుత్వం మార్పులు చేసింది. సవరించిన మార్గదర్శకాలు 2019-20 వానకాలం, యాసంగి పంటల సీజన్‌లకు ఒకేసారి నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. ఆదిలాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో పైలెట్ ప్రాజెక్టుగా సాగుచేసిన టమాటా పంటను పునర్‌వ్యవస్థీకరించిన వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం(ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్) కింద చేర్చారు. 2019-20 సంవత్సరానికి సంబంధించి పంటల బీమా పథకం అమలుపై రాష్ట్రస్థాయి కోఆర్డినేషన్ కమిటీ వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి సీ పార్థసారథి అధ్యక్షతన సచివాలయంలో జరిగిన సమావేశం ఫసల్ బీమా యోజన మార్గదర్శకాల్లో మార్పులు సూచించింది. మారిన మార్గదర్శకాలకు అనుగుణంగా పంటలు, జిల్లాలను రాష్ట్రస్థాయి కోఆర్డినేషన్ కమిటీ నిర్ణయించింది. క్లస్టర్-1 కింద ఆదిలాబాద్, మంచిర్యాల, కొమ్రంభీం ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి, సిద్దిపేట ఉన్నాయి. క్లస్టర్ -2 కింద నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, యాదాద్రి, రంగారెడ్డి, క్లస్టర్-3 కింద పెద్దపల్లి, కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల, జనగామ, క్లస్టర్ -4 కింద ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, సంగారెడ్డి, మెదక్, క్లస్టర్-5 కింద భద్రాద్రి, వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్, వనపర్తి, నాగర్‌కర్నూల్, క్లస్టర్ -6 కింద మేడ్చల్ మల్కాజిగిరి, మహబూబ్‌నగర్, జోగుళాంబ గద్వాల, వికారాబాద్, మహబూబాబాద్ జిల్లాలు ఉన్నాయి. పంటలవారీగా గ్రామం, మండలం యూనిట్లుగా బీమా వర్తించనుంది. నిజామాబాద్ జిల్లాలో యూపీఐ పథకం అమలు కానుంది. అడవి పందులు, కోతులు, దుప్పులు దాడితో పంటనష్టపోయినా పైలెట్ ప్రాజెక్టుగా పరిగణలోకి తీసుకుంటారు. సమావేశంలో వ్యవసాయశాఖ కమిషనర్ రాహుల్ బొజ్జా, ఉద్యానశాఖ డైరెక్టర్ ఎల్ వెంకట్రామిరెడ్డి, ఆర్బీఐ, ఎస్ఎల్బీసీ, టీఎస్డీపీఎస్, ఏఐసీతో పాటు బీమా కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు.



రైతుల కోసం తెలుగులో హెల్ప్‌లైన్

నిజామాబాద్ జిల్లాలో అడవి పందులు, కోతులు పంట నష్టంచేసినా బీమా వర్తింపజేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి సీ పార్థసారథి సమావేశంలో సూచించారు. రైతుల కోసం తెలుగులో హెల్ప్‌లైన్ ఏర్పాటుచేయాలని అధికారులను ఆదేశించారు. పంటనష్టాన్ని అంచనా వేయడానికి ఇన్సూరెన్స్ కంపెనీలు తగినంతమంది సిబ్బందిని నియమించుకోవాలని సూచించిన ఆయన పంటనష్టాన్ని అంచనా వేయడంలో ఆలస్యం జరిగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సీజన్‌వారీగా బీమా వర్తించే పంటలు

2019 వానకాలం సీజన్‌లో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద వరి, జొన్న, మొక్కజొన్న, కందులు, పెసర్లు, మినుములు, వేరుశనగ, సోయాబీన్, పసుపు, పత్తి, ఎండుమిర్చి, బత్తాయి, పామాయిల్ పంటలకు పంటల బీమా వర్తించనుంది. 2019 యాసంగిలో వరి, జొన్న, వేరుశనగ, మినుములు, పెసర్లు, నువ్వులు, పొద్దుతిరుగుడు, మిర్చి, ఉల్లిగడ్డ, శనగ, మొక్కజొన్న, మామిడి పంటలకు పంటల బీమా వర్తిస్తుంది.


సీజన్	పంట	తుది గడువు
వానకాలం	వరి	31.08.2019
	జొన్న, మొక్కజొన్న, కందులు, పెసర్లు, మినుములు, వేరుశనగ, సోయాబీన్, పసుపు	31.07.2019
	పత్తి	15.07.2019
	ఎర్రమిర్చి	ఇంకా నిర్ణయించలేదు
	బత్తాయి	09.08.2019
	పామాయిల్	14.07.2019
యాసంగి	మామిడి	01.12.2019
	మొక్కజొన్న	15.12.2019
	వరి, జొన్న, వేరుశనగ, మినుములు, పెసర్లు, పొద్దుతిరుగుడు, నువ్వులు, ఎర్రమిర్చి, ఉల్లిగడ్డలు	31.12.2019
	మొక్కజొన్న	15.12.2019

చిప్‌కార్డు పేరిట కొత్త మోసం

- రూ. లక్ష కాజేసిన సైబర్ కేటుగాళ్లు
- రాచకొండ కమిషనరేట్ పరిధిలో మరో క్రైం

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:

'హలో మీరు చిప్‌తో కూడిన ఏటీఎం కార్డు తీసుకున్నారా? లేదా పాత మ్యాగ్నటిక్ స్ట్రిప్‌కార్డు వాడుతున్నారా? పాతకార్డులు ఇక చెల్లవు.. చిప్‌తో కూడిన కొత్త కార్డు తీసుకొని ఉంటే వివరాలు చెప్పండి అప్‌డేట్ చేస్తాం. అని నమ్మించి ఏకంగా లక్ష రూపాయలు కాజేశారు. ఈ సంఘటన రాచకొండ కమిషనరేట్ పరిధిలో చోటు చేసుకుంది. ఉద్యోగ విరమణ పొందిన ఓ మహిళకు ఈ నెల 7న బ్యాంకు అధికారినంటూ ఓ వ్యక్తి ఫోన్ చేశాడు. తాను బ్యాంకు అధికారిగా నమ్మించి కార్డుపై ఉన్న 16 అంకెల నంబరును, సీవీవీ, గడువు తేదీ అడిగి తెలుసుకొని మీ సెల్‌కు ఓటీపీ వస్తుంది.. చెప్తే ఎంట్రీ చేస్తామని నమ్మించాడు. వివరాలన్నీ చెప్పిన సదరు మహిళ బ్యాంకు ఖాతా నుంచి అరగంటలో రూ. లక్ష మాయమయ్యాయి. బాధితురాలు లబోదిబోమంటూ రాచకొండ పోలీసులను ఆశ్రయించింది. ఫోన్ నంబరు, నగదు బదిలీ అయిన వ్యాలెట్ల ప్రాథమిక వివరాల ఆధారంగా ఉత్తరాదికి చెందిన ముఠాగా అనుమానిస్తున్నట్టు రాచకొండ సైబర్ క్రైం ఏసీపీ హరినాథ్ తెలిపారు. చిప్ కార్డు వివరాల అప్‌డేట్ పేరుతో ఎవరైనా ఫోన్లు చేసి వివరాలు అడిగితే తెలియజేయవద్దని సూచించారు. చిప్ కార్డులకు సంబంధించి ఎవైనా అనుమానాలు ఉన్నా బ్యాంక్ కార్యాలయాలను నేరుగా సంప్రదించాలని వివరించారు.



ప్రయాణికుల జేబులకు రైల్వే చిల్లు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రైల్వేను లాభాల ట్రాక్ఎక్కించాలనే అధికారుల తపన ప్రయాణికులకు పెనుభారమవుతున్నది. తరుచూ చార్జీలు పెంచుతున్నారే తప్ప, తదనుగుణంగా సౌకర్యాలు కల్పించడం లేదన్న ఆరోపణలున్నాయి. తాజాగా 48 ఎక్స్‌ప్రెస్ రైళ్లను సూపర్‌ఫాస్ట్‌గా అప్‌గ్రేడ్‌చేస్తూ చార్జీలు పెంచిన రైల్వే శాఖ.. రైళ్ల సగటు వేగాన్ని కేవలం ఐదు కిలోమీటర్లు మాత్రమే పెంచింది. రైళ్లు సకాలంలో నడిచే పరిస్థితి లేకపోవడం, వేగాన్ని పెద్దగా పెంచకపోవడంతో ప్రయాణికులకు ఆశించిన ప్రయోజనం చేకూరడం లేదు. రైల్వే నూతన టైమ్‌టేబుల్ ప్రకారం అప్‌గ్రేడ్ చేసిన రైళ్ల సగటువేగాన్ని గంటకు 50 నుంచి 55 కిలోమీటర్లకు పెంచారు. వాతావరణ పరిస్థితుల కారణంగా ఉత్తరాదికి వెళ్లే రైళ్లు ఆలస్యంగా నడుస్తున్న సీజన్ ఆరంభంలో సూపర్‌ఫాస్ట్ లెవీని విధించడం ప్రయాణికులకు ఏరకంగానూ ఉపయోగపడటం లేదు. ప్రస్తుతం రాజధాని, దురంతో, శతాబ్ది వంటి ప్రీమియర్ సర్వీసులుసహా అన్ని రైళ్లూ ఆలస్యంగా నడుస్తున్నాయి. సూపర్‌ఫాస్ట్ రైళ్లుగా అప్‌గ్రేడ్ చేసిన రైళ్లలో ప్రయాణికులకు అదనంగా ఎలాంటి సౌకర్యాలూ కల్పించలేదు. అయినా స్లీపర్‌క్లాస్‌కు అదనంగా రూ.30, సెకండ్, థర్డ్ ఏసీలపై రూ.45, ఫస్ట్ క్లాస్ ఏసీపై రూ.75 సూపర్‌ఫాస్ట్ చార్జీలు చెల్లించాల్సి వస్తున్నది. సూపర్‌ఫాస్ట్ లెవీగా అదనంగా రూ.70 కోట్లు సమీకరించాలని రైల్వే శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. 48 రైళ్ల ను సూపర్‌ఫాస్ట్ జాబితాలో చేర్చడంతో మొత్తం ఈ విభాగంలో చేరిన రైళ్ల సంఖ్య 1,072కు పెరిగింది. అదనపు చార్జీలు వసూలు చేయడమే లక్ష్యంగా వీటిని నడుపుతున్నట్టు ఆరోపణలున్నాయి. ఇందుకు అనుగుణంగా స్పీడ్‌ను పెంచకపోవడం ఒక ఎత్తైతే, పెంచిన ఐదు కిలోమీటర్ల స్పీడు వల్ల ప్రయాణికులకు ఎలాంటి ప్రయోజనం చేకూరడం లేదు.



గ్రామ స్వరాజ్యం



రిజర్వేషన్‌తో వరించిన సర్పంచ్ పదవి

ప్రేమ వివాహం చేసుకున్న జకీర్, సునీత

కలిసొచ్చిన ప్రేమ పెండ్లి

ప్రేమ జంటకు పంచాయతీ రిజర్వేషన్ కలిసొచ్చింది. మతాలు వేరైనా ఇద్దరి మనుసులు ఒకటి కావడంతో ఆదర్శ వివాహం చేసుకున్నారు. ఆ యువతికి రిజర్వేషన్ రూపంలో సర్పంచ్ పదవి వరించింది. మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం చిన్న ధర్మారం గ్రామానికి చెందిన షేక్ జకీర్, మందమర్రి మండలం పులిమడుగు గ్రామానికి చెందిన భూక్యా సునీత 2012లో ప్రేమించి పెండ్లి చేసుకున్నారు. వీరికి కూతురు, కొడుకు ఉన్నారు. ప్రస్తుతం చిన్న ధర్మారం ప్రత్యేక గ్రామ పంచాయతీ కావడంతో సర్పంచ్ పదవి ఎస్టీకి రిజర్వు అయ్యింది. ఆ గ్రామంలో సునీత ఒక్కరు మాత్రమే ఎస్టీ కావడంతో ఆమెకు సర్పంచ్ పదవి కలిసి వచ్చింది. టీఆర్‌ఎస్ మద్దతుదారుగా సునీత నామినేషన్ వేశారు. ఒక్క నామినేషన్ మాత్రమే దాఖలు కావడంతో సునీత ఎన్నిక ఏకగ్రీవం కానున్నది.

- కాసిపేట రూరల్

1.17 కోట్లు సీజ్

17 మందిపై కేసు నమోదు: డీజీపీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పంచాయతీ ఎన్నికల సందర్భంగా రూ. 1.17 కోట్ల నగదును సీజ్ చేసినట్టు డీజీపీ మహేందర్‌రెడ్డి ప్రకటించారు. ఎన్నికల కోడ్ సందర్భంగా వివిధ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నామని, ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న నగదును సీజ్‌చేసినట్టు వెల్లడించారు. అదే విధంగా రూ. మూడు లక్షల విలువైన మద్యంతోపాటు ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఖమ్మం జిల్లాలో గురువారం రూ. 1,17,88,820 నగదు స్వాధీనం చేసుకున్నామని, జగిత్యాల జిల్లాలో రూ. 1.23 లక్షలు, వనపర్తి జిల్లాలో రూ.35వేలు, కరీంనగర్ జిల్లాలో 1.30 లక్షలు, మంచిర్యాల జిల్లాలో రూ.10,945 విలువ చేసే మద్యం, ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు. మొత్తం 17 మందిపై ఎన్నికల నిబంధనల ఉల్లంఘన కేసులు నమోదు చేసినట్టు గురువారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

111 మంది ఓటర్లే!

సారంగాపూర్: జగిత్యాల జిల్లాలో అతి తక్కువగా ఓటర్లు ఉన్న గ్రామం చిన్న కొల్వాయి. బీర్‌పూర్ మండలంలోని చిన్న కొల్వాయి గూడెం ఇదివరకు కొల్వాయి పంచాయతీ పరిధిలో ఉండేది. సీఎం కేసీఆర్ సర్కార్ తండాలను కొత్త పంచాయతీలుగా మార్చడంతో చిన్న కొల్వాయి కొత్త గ్రామపంచాయితీగా ఏర్పాటైంది. జిల్లాలోనే అతి తక్కువ ఓటర్లున్న గ్రామంగా ఇది నిలిచింది. గ్రామంలో 111మంది ఓటర్లుండగా నాలుగు వార్డులు ఏర్పాటు చేశారు. గ్రామ సర్పంచ్ స్థానం ఎస్టీ జనరల్‌కు కేటాయించారు. ఇక్కడి పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు స్థానికులు ప్రయత్నిస్తున్నారు.

సోపానం

ఎంపీ గుత్తా.. నాడు వార్డు సభ్యుడే

- రైతు సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షుడిగానూ రాణింపు
- ప్రజాదరణతో అంచెలంచెలుగా ఎదిగిన సుఖేందర్‌రెడ్డి



చిట్యాల: వార్డు సభ్యుడిగా రాజకీయ రంగంలోకి అడుగిడిన గుత్తా సుఖేందర్‌రెడ్డి అంచెలంచెలుగా పార్లమెంట్ సభ్యుడిగా ఎదిగారు. పలు హోదాల్లో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తూనే మూడు పర్యాయాలు ఎంపీగా గెలుపొందారు. విద్యార్థి సంఘం నాయకుడిగా రాజకీయ పునాది వేసుకున్న గుత్తా.. 1971-72లో నానక్‌రాం భగవాన్ సైన్స్ కాలేజీలో విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. అనంతరం ఇందిరాగాంధీ స్ఫూర్తితో 1978లో కాంగ్రెస్ పార్టీలో చేరి 1981లో స్వగ్రామమైన చిట్యాల మండలం ఉరుమడ్ల వార్డు సభ్యుడిగా గెలుపొందారు. 1984లో చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా, 1985లో చైర్మన్‌గా పనిచేశారు. 1992లో సింగిల్‌విండో చైర్మన్‌గా గెలుపొందిన గుత్తా.. 1992-1999 వరకు ఉరుమడ్ల పాల సంఘం చైర్మన్‌గా పనిచేశారు. అదే సమయంలో 1992లో నల్లగొండ-రంగారెడ్డి జిల్లాల పాల ఉత్పత్తిదారుల యూనియన్‌కు చైర్మన్‌గా ఎన్నికయ్యారు. 1995-1999 వరకు ఏపీ డెయిరీ డెవలప్‌మెంట్ చైర్మన్‌గా పనిచేశారు. అదే సమయంలో 1998లో నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు సభ్యుడిగానూ కొనసాగారు. 1995లో దేవరకొండ జెడ్పీటీసీ సభ్యుడిగా గెలుపొందారు. 1999లో మొదటిసారిగా నల్లగొండ ఎంపీగా గెలుపొందిన గుత్తా.. తిరిగి 2009, 2014లో అదే నల్లగొండ స్థానం నుంచి ఎంపీగా జయకేతనం ఎగురవేశారు. పలు రకాల పదవులను కూడా గుత్తా నిర్వహించారు. అర్బన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా, పార్లమెంటు హౌస్ కమిటీ సభ్యుడిగా, ఇన్ఫర్మేషన్ బ్రాడ్ కాస్టింగ్ కమిటీ సభ్యుడిగా, ఎంపీ లాడ్స్ కమిటీ సభ్యుడిగా పనిచేశారు. ప్రస్తుతం నల్లగొండ ఎంపీగా కొనసాగుతూనే, రైతు సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షుడిగా సేవలందిస్తున్నారు.



నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం డిండిచింతపల్లిలో నామినేషన్లను పరిశీలిస్తున్న రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు బాలమాయాదేవి



యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలో ఏకగ్రీవ పంచాయతీ బబ్లూ నాయక్ తండాలో మాట్లాడుతున్న పరిశీలకులు సురేంద్రమోహన్

ఎన్నికల ప్రక్రియ.. పరిశీలకుల పర్యవేక్షణ

వంగూరు/తుర్కపల్లి: పంచాయతీ ఎన్నికలను పురస్కరించుకొని రాష్ట్ర పరిశీలకులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఎన్నికల ప్రక్రియను పరిశీలిస్తున్నారు. రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు బాలమాయాదేవి గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం డిండిచింతపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించారు. అధికారులు చేపట్టిన నామినేషన్ల పరిశీలనను జిల్లా పంచాయతీ అధికారి సురేశ్ మోహన్, కల్వకుర్తి ఆర్డీవో రాజేష్‌కుమార్‌తో కలిసి ఆమె పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నామినేషన్ల పరిశీలనను జాగ్రత్తగా చేపట్టాలని సూచించారు. ఇందులో ఎలాంటి అవకతవకలకు తావివ్వకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కాగా మరో పరిశీలకులు సురేంద్ర మోహన్ యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలోని బబ్లూనాయక్ తండా, బొమ్మలరామారం మండలంలోని తూంకుంట గ్రామ పంచాయతీలను సందర్శించారు. ఈ పంచాయతీలు ఏకగ్రీవం కాగా.. ఆ ప్రక్రియ అందరి సమ్మతితోనే జరిగిందా?, ఎవరి ఒత్తిడి అయినా ఉందా? అని ఆరా తీశారు. సమిష్టి నిర్ణయం మేరకే ఏకగ్రీవం చేసుకున్నామని, ప్రభుత్వం అందించే ప్రోత్సాహక నిధులతో గ్రామాలను అభివృద్ధి చేసుకోవచ్చనే ఆలోచనతో ఉన్నామన్నారు. ఈ సందర్భంగా పరిశీలకులు సురేంద్రమోహన్ మాట్లాడుతూ.. ఏకగ్రీవమవుతున్న గ్రామ పంచాయతీలపై అభ్యంతరాలుంటే తెలియజేయాలని సూచించారు.

వేలంపాటలపై డీజీపీకి లేఖ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ : పంచాయతీల్లో పదవుల వేలంపై చర్యలు తీసుకోవాలని గురువారం ఎస్‌ఈసీ నాగిరెడ్డి డీజీపీ మహేందర్‌రెడ్డికి లేఖ రాశారు. వికారాబాద్ జిల్లా బోజ్యా నాయక్‌తండాలో ఉదంతాన్ని అందులో పేర్కొన్నారు. ఇతర జిల్లాల్లోనూ జరుగుతున్న ఇలాంటి ఘటనలపై చర్యలు తీసుకోవాలని సూచించారు. పదవులు వేలం వేసినా, అక్రమాలకు పాల్పడినా, ప్రభావితం చేసినా చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఏకగ్రీవాలపై విచారణచేస్తున్నామని, వేలం వేసినట్టు అనుమానిస్తే విచారణ చేసేందుకు జిల్లా పోలీస్ అధికారులకు ఆదేశాలివ్వాలని నాగిరెడ్డి డీజీపీని కోరారు.

వేలంపాటలపై అప్రమత్తంగా ఉండాలి

గ్రామాల్లో పదవులు వేలం వేస్తున్నట్టు తమ వద్ద సమాచారం ఉన్నదని, ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఎలక్షన్ వాచ్ ఫోరం కో-ఆర్డినేటర్లు పద్మనాభరెడ్డి, చెలికాన్‌రావు కోరారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులతో గురువారం సమావేశమయ్యారు. పంచాయతీ ఎన్నికల్లో కొంతమంది కులాలు, వర్గాల వారీగా ఓట్ల రాజకీయాలు చేస్తున్నారని ఎస్‌ఈసీకి సూచించారు. అదేవిధంగా ఎన్నికల సమయంలో ఏకగ్రీవ పంచాయతీలకు ప్రోత్సాహకాలు అందిస్తామని ఎమ్మెల్యేలు ప్రకటించడం కోడ్ పరిధిలోకి వస్తుందని, దీనిపై విచారణచేయాలని కోరారు.

ఏకతాటిపై పల్లెలు

360 తొలివిడుతలో ఏకగ్రీవ పంచాయతీలు!

- పలు గ్రామాలకు సింగిల్ నామినేషన్లు
- ఈ నెల 13న అధికారిక జాబితా ప్రకటన
- ప్రభుత్వ ప్రోత్సాహక నిధులతో అభివృద్ధికి బాటలు



పంచాయతీ ఎన్నికలకు సంబంధించి కార్యకర్తలకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

తంగళ్లపల్లి సంపత్, హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

పల్లె ప్రజలు రాజకీయాలకు అతీతంగా ఒక్క తాటిపైకి వచ్చారు. ఎన్నికల పేరుతో కులం, మతం, వర్గంగా విడిపోయే అవకాశం ఇవ్వకుండా.. గ్రామాభివృద్ధి అనే ఏకైక నినాదంతో ఒక్కటయ్యారు. అందరూ కలిసి చర్చించుకొని ఏకగ్రీవంగా పంచాయతీ పాలకవర్గాన్ని ఎన్నుకొని ఐక్యమత్యాన్ని నిరూపించుకున్నారు. ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తున్నారు. తొలి విడుత పంచాయతీ ఎన్నికల నామినేషన్ల పర్వం బుధవారంతో ముగిసింది. గురువారం నామినేషన్లను పరిశీలించారు. శుక్రవారం అప్పీల్‌కు అవకాశం ఉంది. ఇప్పటివరకు 360కిపైగా గ్రామాల్లో సర్పంచ్ స్థానాలకు సింగిల్ నామినేషన్ దాఖలైనట్టు సమాచారం. ఆయా గ్రామాల్లో వార్డు స్థానాలకు కూడా ఒక్కొక్కరే నామినేషన్లు వేశారు. దీంతో అవన్నీ ఏకగ్రీవం కానున్నాయి. ఈ నెల 13న పోటీచేసే అభ్యర్థుల తుది జాబితాను ప్రకటించనున్నారు. ఈ జాబితా ప్రకటన అనంతరం ఏకగ్రీవంగా నిలిచిన పంచాయతీలను అధికారికంగా ప్రకటిస్తామని రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు తెలిపారు. 2013లో జరిగిన ఎన్నికల్లో తెలంగాణ ప్రాంతంలో మొత్తం 540 గ్రామాలు ఏకగ్రీవమైతే... ఈసారి మొదటి విడుతలోనే 360కిపైగా ఏకగ్రీవంగా నిలువడం విశేషం.

కొత్త చట్టం.. కొత్త మార్పులు

గ్రామాల్లో రాజకీయాలు ఎక్కువగా ఉంటాయని, ముఖ్యంగా పంచాయతీ ఎన్నికల సమయంలో ఇవి తీవ్రం అవుతాయనే అభిప్రాయం ఉంది. చాలా గ్రామాల్లో పార్టీల పరంగా, కుల, మత, వర్గ ప్రాతిపాదికన విడిపోతారని చెప్తుంటారు. గ్రామ రాజకీయ కక్షలకు బలైన కుటుంబాలు ఎన్నో ఉన్నాయి. కానీ ఈసారి పరిస్థితులు మారాయి. అన్నిచోట్ల అభివృద్ధి నినాదమే ప్రధానంగా వినిపిస్తున్నది. దీనికి ప్రధాన కారణం రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన నూతన పంచాయతీ రాజ్ చట్టమే. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ చట్టం ద్వారా పంచాయతీల పాలకవర్గాలకు అనేక బాధ్యతలను అప్పగించారు. అవినీతికి పాల్పడితే చర్యలు తీసుకునే అధికారాన్ని కూడా కల్పించారు. కొత్త చట్టం ప్రకారం ప్రతినెలా గ్రామసభలు నిర్వహించాల్సి ఉంటుంది. వరుసగా మూడుసార్లు గ్రామసభ జరుగకపోతే సర్పంచ్‌పై వేటు పడుతుంది. గ్రామ అభివృద్ధి ప్రణాళికను గ్రామసభల్లో వివరించి ఆమోదింపజేయాల్సి ఉంటుంది. గ్రామాభివృద్ధి కమిటీలకు ప్రాధాన్యం ఇచ్చారు. స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలను భాగస్వాములను చేశారు. దీంతో కొత్త చట్టం గ్రామాల్లో స్నేహపూర్వక వాతావరణాన్ని తీసుకొచ్చింది. చాలా రోజులుగా పార్టీల పేరుతో విడిపోయిన వారిని కూడా అభివృద్ధి కోసం ఒక్కటిగా చేసింది. ఇన్నేండ్లు వెనకబడి ఉన్న తమ గ్రామాన్ని ఆదర్శంగా నిలుపుకొనేందుకు ఏకతాటిపైకి వస్తున్నారు.

రూ.50 లక్షల వరకు నిధులు

ఏకగ్రీవ గ్రామాల్లో ఈ ఏడాది రూ.50 లక్షల వరకు నిధులు రానున్నాయి. కొత్త పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం ఒక్కో గ్రామానికి రూ.20 లక్షలకుపైగా నిధులు వస్తాయి. ఏకగ్రీవమైతే ప్రభుత్వం నజరానా కింద రూ.10 లక్షలు ఇస్తున్నది. మరోవైపు ఎమ్మెల్యేలు బంపర్ అఫర్లు ప్రకటించారు. ఏకగ్రీవ గ్రామాలకు రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు ప్రోత్సాహకం ఇస్తామని ప్రకటించారు. ఇలా ఏకగ్రీవ గ్రామాలకు తొలి ఏడాదిలోనే దాదాపు రూ.50 లక్షల నిధులు రానున్నాయి. మొదటి విడుత స్ఫూర్తితో మూడో విడుత పూర్తయ్యేసరికి వెయ్యికిపైగా పంచాయతీలు ఏకగ్రీవమవుతాయని అంచనా వేస్తున్నారు.

ఆదర్శంగా నూతన గ్రామాలు

నూతన పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం రాష్ట్రంలో 4,383 గ్రామాలు కొత్తగా ఆవిర్భవించాయి. ఇన్నాళ్లూ సమస్యలతో సావాసం చేసిన గిరిజన ఆవాసాలు, తండాలు, శివారు గ్రామాలు పంచాయతీలుగా ఆవిర్భవించాయి. దీంతో వారంతా తమ గ్రామాభివృద్ధే ప్రధానాంశంగా ఒక్కటిగా నిలుస్తున్నారు. ప్రస్తుతం ఏకగ్రీవమవుతున్న పంచాయతీల్లో కొత్త గ్రామాలు, గిరిజన తండాలే అధికంగా ఉంటున్నాయి. మెదక్ జిల్లాల్లో 18 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమైతే, ఇందులో ఆరు తండాలే ఉండటం గమనార్హం. కొత్త గ్రామాల్లో అందరినీ ఏకతాటిపైకి తెచ్చే బాధ్యతను యువత తీసుకుంటున్నది. మరోవైపు పంచాయతీ పోటీలోకి విద్యావంతుల రాక పెరిగింది. గతంలో ఒక్కో సర్పంచ్ స్థానానికి పదివరకు నామినేషన్లు వచ్చేవి. ఇప్పుడు చాలాచోట్ల సర్పంచ్ స్థానాలకు ఇద్దరు ముగ్గురే నిలబడ్డారు.

అభ్యర్థులూ.. మీరే తేల్చుకోండి

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ: ఏకగ్రీవం.. ప్రస్తుతం రాష్ట్రమంతటా వినిపిస్తున్న నినాదం. ముఖ్యంగా తండాలు, కొత్త పంచా యతీలు ఇందుకోసం పోటీ పడుతున్నాయి. కల్వకుర్తి నియోజకవర్గం కడ్తాల మండలం గోవిందాయపల్లి తండా ప్రజలు వినూత్న ప్రయత్నంతో చర్చనీయాంశంగా మారారు. 628 మంది ఓటర్లు న్న ఆ తండాలో సర్పంచ్‌గా పోటీకి మాజీ సర్పంచ్ రాములునాయక్, మన్యానాయక్, శైలానాయక్, సేవ్యానాయక్, దేశ్యానాయక్ ముందుకొచ్చారు. దీంతో తండా పెద్దలు, ఓటర్లు కలిసి ఏకగ్రీవం కోసం వారితో చర్చించారు. తొలిసారి పంచాయతీగా మారిన తమ తండాలో ఏకగ్రీవంగా పాలకవర్గాన్ని ఎన్నుకొందామని ప్రతిపాదించారు. ప్రభుత్వ నజరానాతోపాటు, ఎమ్మెల్యే అందించే ప్రోత్సాహకంతో గ్రామాన్ని అభివృద్ధి చేసుకుందామని చెప్పారు. అయితే ఐదుగురు ఆశావహుల్లో ఎవరూ బెట్టు వీడలేదు. దీంతో తండావాసులంతా కలిసి 'మీ ఐదుగురు కలిసి ఎక్కడికైనా వెళ్లి చర్చించుకోండి. సర్పంచ్‌గా, ఉప సర్పంచ్‌గా ఎవరుంటారో తేల్చుకొని రండి. తండాలో మాత్రం చర్చలు, గొడవలు వద్దు' అని తేల్చిచెప్పారు. దీంతో ఆ ఐదుగురూ వెల్దండ మండలంలోని శిరసనగండ్ల శ్రీరామాలయానికి వెళ్లి చర్చించుకొంటున్నారు.

గోవిందాయపల్లి తండావాసుల వినూత్న ప్రయత్నం


తెరపైకి స్థానిక వాదం

కల్వకుర్తి నియోజకవర్గంలోనే మాడ్గుల మండలంలో జనరల్ స్థానాల్లో పోటీ ఆసక్తికరంగా ఉంది. హైదరాబాద్‌లో స్థిరపడినవారిలో కొందరు గ్రామాలకు తిరిగి వచ్చి పోటీచేయాలని భావిస్తున్నారు. అయితే స్థానిక ఆశావహులు మాత్రం స్థానికంగా ఉంటున్న తమనే గెలిపించాలని కోరుతున్నారు. మాడ్గుల, ఇర్విన్, నాగిళ్ల, కొలుకులపల్లి, కలకొండలో ఈ పరిస్థితి కనిపిస్తున్నది.

అంతా బంధుగణమే

అనేక పంచాయతీల్లో బంధువులే బరిలో నిల్చారు. శామీర్‌పేట మండలం లక్ష్మాపూర్‌లో అన్నాదమ్ములు సింగం ఆంజనేయులు, సింగం సత్తయ్య పోటీపడుతుండగా, వారి అల్లుడు క్యాతం మధుకృష్ణ కూడా నామినేషన్ దాఖలు చేశారు. అదేవిధంగా వరుసకు బాబాయ్ అబ్బాయ్ అయ్యే ఎల్ రాంప్రసాద్, ఎల్ కృష్ణమూర్తి సైతం నామినేషన్లు వేశారు. ఇలా ఒకే ఇంటికి చెందిన వారు బరిలో నిలువడం చర్చనీయాంశంగా మారింది.

ముఖం చాటేసిన కాంగ్రెస్



- గ్రామాల్లోకి తొంగిచూడని పార్టీ నేతలు
- నైరాశ్యంలో క్షేత్రస్థాయి కార్యకర్తలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి నుంచి కాంగ్రెస్ ఇంకా తేరుకున్నట్టు కన్పించడం లేదు. అసెంబ్లీ పోరు ముగిసిన వెంటనే వచ్చిన పంచాయతీ ఎన్నికల్లో ఆ పార్టీ నేతలు ముఖం చాటేశారు. రాష్ట్రంలో మూడు విడుతల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీచేసిన విషయం తెలిసిందే. ఇందులో మొదటి విడుత 4,479 పంచాయతీల్లో ఎన్నికలకు నామినేషన్ల పర్వం ముగిసింది. అయినప్పటికీ కాంగ్రెస్ నేతలెవరూ గ్రామాల వైపు చూడటం లేదు. పార్టీ నాయకులెవరూ పట్టించుకోకపోవడంతో క్షేత్రస్థాయిలో కార్యకర్తలు పంచాయతీ ఎన్నికల్లో పోటీచేయడానికి వెనుకంజ వేస్తున్నారు. పెద్దపెద్ద నేతలే ఓడిపోయారు.. మేమెంతా అంటూ ఉసూరుమంటున్నారు. ఒకవైపు ఇతర పార్టీలకు చెందిన నేతలు ఏకగ్రీవ పంచాయతీల కోసం కృషిచేస్తుంటే కాంగ్రెస్ నేతలు ఇప్పటి వరకు పల్లెల్లో అడుగుపెట్టలేదు. మొదటి దఫా ఎన్నికల్లో పార్టీ తరపున పోటీచేయడానికి ఉత్సాహం చూపెడుతున్నా నేతల సహకారం లేకపోవడంతో క్యాడర్ గ్రామ పంచాయతీ ఎన్నికలకు దూరంగా ఉంటున్నట్టు ద్వితీయశ్రేణి నాయకులు పేర్కొంటున్నారు.

రాష్ట్ర పార్టీ నేతల సిగపట్లు

ఒకపక్క గ్రామ పంచాయతీ ఎన్నికలు జరుగుతుంటే రాష్ట్ర పార్టీనేతలు సిగపట్లు పడుతున్నారు. స్వయంగా పీసీసీ అధ్యక్షుడిపై అవినీతి ఆరోపణలు, సీనియర్ నేతలపై సస్పెన్షన్ వేటు వంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. పార్టీని ఎలా బలోపేతం చేయాలనే దానిపై దృష్టి పెట్టకుండా వ్యక్తిగత ప్రయోజనాలకు పెద్దపీట వేస్తున్నారని కిందిస్థాయి నాయకులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ విషయాలన్నిటినీ గమనిస్తున్న క్షేత్రస్థాయి పార్టీకార్యకర్తలు కూడా వీరిని పెద్దగా పట్టించుకోవడం లేదు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గ్రామాలకు గ్రామాల్లో తుడిచిపెట్టుకుపోయింది. దీంతో నేతలు అవమానభారంతో గ్రామాల్లోకి రాలేని పరిస్థితి ఉన్నదని పేర్కొంటున్నారు.

విదేశీ టూర్లకు ఉత్తమ్

పంచాయతీ సమరం సమయంలోనే టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విదేశీటూర్లకు వెళ్లడంతో పార్టీ వ్యవహారాలను పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. యూరప్ వెళ్లిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పంచాయతీ ఎన్నికలను గాలికొదిలేశారని పార్టీ నేతలు పెదవి విరుస్తున్నారు. గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు ఈ ఎన్నికలను ఉపయోగించుకోవాల్సి ఉండగా నేతలంతా నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని ద్వితీయశ్రేణి నేతలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. విదేశీ టూర్లపై ఉన్న మోజు పార్టీ పటిష్ఠతపై లేకుండాపోయిందని తప్పుపడుతున్నారు. మిగిలిన రెండు విడుతలపైన దృష్టి పెట్టేందుకు నేతలు చొరవ తీసుకుంటే మంచిదని పార్టీ సీనియర్ నేత హన్మంతరావు హితవు పలుకడం గమనార్హం.

దుబాయ్ నుంచి వచ్చి సర్పంచ్‌గా పోటీ



నోముల శివ

మెట్‌పల్లి టౌన్: సర్పంచ్ పదవిపై ఉన్న మోజు సముద్రాలను సైతం దాటి వచ్చేలా చేస్తున్నది. ఓ వలసజీవి ఏకంగా దుబాయ్ నుంచి సర్పంచ్‌గా పోటీ చేసేందుకు స్వదేశానికి వచ్చాడు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం రాజేశ్వర్‌రావుపేటకు చెందిన నోముల శివ కొన్నేండ్లుగా ఉపాధి కోసం గల్ఫ్‌కు వెళ్లాడు. అప్పుడప్పుడు వచ్చి వెళ్తుంటాడు. ఊరికి ఏదైనా చేయాలనే తపనతో గతంలో తెలంగాణ ఉద్యమంలోనూ చురుగ్గా పాల్గొన్నాడు. సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేయాలనే ఆలోచనతో దుబాయ్ నుంచి స్వగ్రామానికి చేరుకున్నాడు. రిజర్వేషన్ సైతం తనకు అనుకూలంగా రావడంతో బరిలోకి దిగనున్నాడు. గతంలో శివ నానమ్మ సైతం సర్పంచ్‌గా పనిచేశారు. సర్పంచ్‌గా పోటీ చేసేందుకు ఆసక్తితో ఉన్న విషయాన్ని గురువారం కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించినట్టు శివ తెలిపాడు.


SMT. D.PARVATHI
PRESENTS
DVV
ENTERTAINMENT
MEGA POWERSTAR
A BOYAPATI SREENU FILM
సంక్రాంతి శుభాకాంక్షలతో
ప్రపంచవ్యాప్తంగా
నేడే విడుదల
వినయ
విధేయ
రామ
DANAYYA DVV BOYAPATI SREENU
DEVI SRI PRASAD
M. RATHNAM RISHI PUNJABI - ARTHUR A. WILSON KOTAGIRI VENKATESWARA RAO
A.S. PRAKASH KANAL KANNAN V.Y. PRAVEEN KUMAR

తొలి వన్డే వేదిక హైదరాబాద్

భారత్‌లో ఆసీస్ పర్యటన షెడ్యూల్ విడుదల

ముంబై: ప్రపంచకప్ ముందు టీమ్ ఇండియా మరింత బిజీగా మారింది. ఆసీస్, న్యూజిలాండ్ సిరీస్ ముగిసిన వెంటనే సొంతగడ్డపై ఆస్ట్రేలియాతో 2 టీ20లతో పాటు ఐదు వన్డేల సిరీస్‌లో తలపడనున్నారు. ఈ నెల 18తో ఆసీస్‌లో భారత పర్యటన ముగుస్తుండగా.. అనంతరం న్యూజిలాండ్ పర్యటనకు బయలుదేరనుంది. ఐపీఎల్ టోర్నీ ప్రారంభానికి ముందుగా ఫిబ్రవరి 24 నుంచి మార్చి 13 వరకు కంగారూలతో సిరీస్‌కు గురువారం భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) షెడ్యూల్ విడుదల చేసింది. మార్చి2న రెండు దేశాల మధ్య జరిగే తొలి వన్డేకు హైదరాబాద్ ఆతిథ్యమివ్వనుంది. ఆసీస్, భారత్ మధ్య జరిగే రెండో టీ20 మ్యాచ్‌కు విశాఖపట్నం వేదికగా నిలువనుంది. 2017లో స్టీవ్‌స్మిత్ నాయకత్వంలో ఆస్ట్రేలియా జట్టు ఆఖరిసారిగా భారత్ పర్యటించింది.





క్రీడలకు ప్రభుత్వం పెద్దపీట

యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనితారామచంద్రన్

భువనగిరి టౌన్: క్రీడల్లో రాణించి జిల్లాకు గుర్తింపు తీసుకురావాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనితారామచంద్రన్ అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న 52వ సీనియర్ రాష్ట్రస్థాయి ఖోఖో చాంపియన్‌షిప్ పోటీలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. క్రీడలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని చెప్పారు. రాష్ట్ర స్థాయి క్రీడలకు భువనగిరి వేదికగా కావడం సంతోషకరమని చెప్పిన ఆమె ఇలాంటి కార్యక్రమాలతో గ్రామీణ స్థాయి క్రీడాకారులు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందన్నారు. మొదటి రోజు ఉమ్మడి జిల్లాలకు చెందిన మహిళా విభాగానికి చెందిన 10 జట్లను, పురుషుల విభాగానికి చెందిన 10 జట్లను 'ఎ' 'బి' గ్రూపులుగా విభజించి లీగ్ మ్యాచ్‌లను నిర్వహించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో తెలంగాణ ఖోఖో అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వర్, జనరల్ సెక్రెటరీ శ్రీనివాసరావు, నల్లగొండ జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటనారాయణ గౌడ్, జనరల్ సెక్రెటరీ నాతి క్రిష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



విజేతలతో భద్రాచలం ఐటీడీఏ పీవో పమేలా సత్పతి

ఓవరాల్ చాంప్ భద్రాచలం

ఐటీడీఏ రాష్ట్రస్థాయి గిరిజన క్రీడలు

భద్రాచలం, నమస్తే తెలంగాణ: ఐటీడీఏ రాష్ట్రస్థాయి గిరిజన క్రీడోత్సవాల్లో భద్రాచం జోన్ ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను దక్కించుకుంది. రెండో స్థానంలో ఏటూరు నాగారం , మూడోస్థానంలో ఉట్నూర్‌జోన్ నిలిచాయి. భద్రాచలం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మూడు రోజులుగా జరుగుతున్న ఐటీడీఏ రాష్ట్రస్థాయి గిరిజన క్రీడోత్సవాలు గురువారంతో ముగిశాయి. ముగింపు వేడుకకు భద్రాచలం ఐటీడీఏ పీవో పమేలా సత్పతి ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందించారు. విద్యార్థులు చదువుతో పాటు అదనంగా క్రీడల్లో కూడా రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ డీడీ సీహెచ్ రామ్మూర్తి, తెలంగాణ రాష్ట్ర క్రీడల నిర్వహణ అధికారి వీ జ్యోతి, జిల్లా క్రీడల నిర్వాహణ అధికారి పుట్టా శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

స్పష్టత వచ్చినట్లే!

ఫాం కోల్పోతే ఎవరి స్థానానికి హామీ లేదు

ప్రపంచ కప్ జట్టుపై రోహిత్ వ్యాఖ్య

సిడ్నీ: ప్రపంచకప్ ఆడే భారత జట్టుపై పూర్తి స్పష్టత వచ్చినట్లేనని వన్డే జట్టు వైస్ కెప్టెన్ రోహిత్ శర్మ అభిప్రాయం వ్యక్తం చేశాడు. శనివారం నుంచి ఆస్ట్రేలియాతో మూడు వన్డేల సిరీస్ ప్రారంభం కానుండగా.. గురువారం రోహిత్ శర్మ మీడియాతో మాట్లాడాడు. ప్రపంచకప్ సమయానికి టీమ్ ఇండియా 13 వన్డేలు ఆడనుందని, ప్రస్తుతం వన్డే సిరీస్ ఆడుతున్న జట్టే ప్రపంచకప్ బరిలోకి దిగుతుందని ఆశాభావం వ్యక్తం చేశాడు. అలా అని జట్టులో ఎవరి స్థానానికీ హామీ లేదని చెబుతూ ఫామ్ కోల్పోతే జట్టులో చోటు గల్లంతవుందని రోహిత్ స్పష్టం చేశాడు. గాయాలు, ఫామ్ కోల్పోవడం వంటివి జరుగకపోతే తప్ప జట్టులో ఒకటి రెండు మార్పులు కూడా చోటు చేసుకోకపోవచ్చని రోహిత్ తెలిపాడు.

రాయుడు భేష్:

భారత జట్టును చాన్నాళ్లుగా వేధిస్తున్న నం 4 సమస్యకు రాయుడు పరిష్కారం చూపించాడని రోహిత్ శర్మ మెచ్చుకున్నాడు. దాదాపు మూడేండ్లుగా ఈ స్థానంలో 11 మందిని పరిశీలించగా..వెస్టిండీస్‌తో జరిగిన సిరీస్‌లో రాణించడం ద్వారా రాయుడు నిలదొక్కుకున్నాడు. ఈ సిరీస్‌లో రాయుడు ఒక సెంచరీ, అర్ధసెంచరీ సహా కీలక సమయంలో బ్యాట్‌ను ఝులింపించి నాలుగోస్థానంలో సరైనోడు అనిపించుకున్నాడు. అతని ఆటతీరుపై కెప్టెన్ కోహ్లీ , కోచ్ రవిశాస్త్రి సంతృప్తి వ్యక్తం చేశాడు. ఇన్నింగ్స్ నిర్మించడంలోనూ పరిస్థితులకు తగినట్లుగా బ్యాటింగ్ చేస్తూ నాలుగోస్థానానికి అతికినట్లుగా రాయుడు సరిపోయాడు. ప్రపంచకప్ కోసమే రాయుడు రంజీలకు వీడ్కోలు పలికిన విషయం తెలిసిందే. సీనియర్ మహేంద్ర సింగ్ ధోనీ జట్టుకు మార్గదర్శి అంటూ అతని నుంచి యువ ఆటగాళ్లు స్ఫూర్తి పొందుతారని రోహిత్ వెల్లడించాడు. తన కెప్టెన్సీతో జట్టుకు ఎన్నో విజయాలు అందించిన ధోనీ.. తన సలహాలతో ఆటగాళ్లకు ఎంతో తోడ్పతున్నాడని చెప్పాడు. ఇప్పటికీ జట్టులో ధోనీ కీలకమైన ఆటగాడని, వికెట్ల వెనుక నిలుచుని అతనిచ్చే సలహాలతోనే జట్టు మణికట్టు స్పిన్నర్లు కుల్దీప్, చాహల్ చక్కటి ఫలితాలను అందిస్తున్నారని కితాబిచ్చాడు.

ఒకటి రెండు మార్పులు మినహా..

ప్రపంచకప్‌లాంటి మెగాటోర్నీ బరిలోకి దిగే జట్టు ఎంపికలో ఆటగాళ్ల ఫామ్, ఫిట్‌నెస్ ప్రభావితం చేస్తుందని రోహిత్ చెప్పాడు. 'ప్రపంచకప్ టోర్నీకి ముందు టీమ్ ఇండియా 13 వన్డేల్లో తలపడనుంది. ఆసీస్‌లో మూడు వన్డేలు, న్యూజిలాండ్‌లో 5 వన్డేలతో పాటు సొంతగడ్డపై ఆసీస్‌తో మరో ఐదు వన్డేలు ఆడబోతున్నాం. ఇవి కాకుండా టీ20లతో పాటు ఐపీఎల్ కూడా ఆడాల్సి ఉంది. ఆటగాళ్లు గాయాలపాలవకుండా ఫిట్‌నెస్‌తో ఉండేందుకు ప్రయత్నించాలి' అని అన్నాడు. వ్యక్తిగత మెరుపుల వల్ల ఒకటీ, రెండు మ్యాచ్‌ల్లో గెలవొచ్చేమో కానీ,చాంపియన్‌గా నిలవాలంటే సమిష్టి కృషి అవసరమవుతుందన్నాడు. జట్టు కష్టకాలంలో బాధ్యత తీసుకోవడానికి ప్రతి ఆటగాడు సిద్ధంగా ఉంటే నిలకడగా విజయాలు లభిస్తాయని స్పష్టం చేశాడు. గతేడాది ఆసియా కప్ టోర్నీలో టాపార్డర్ విఫలమైనా మిడిలార్డర్ మెరుపులతో మన జట్టు విజేతగా నిలిచిందని గుర్తు చేశాడు. అంతేకాదు సొంతగడ్డపై జరిగిన సిరీస్‌లోనూ టీమ్ ఇండియా సమిష్టిగా రాణించి వెస్టిండీస్‌ను ఓడించిందని వెల్లడించాడు.

వాళ్లు లేకున్నా:

పేస్ బౌలింగ్‌లో ఎప్పుడూ ఆస్ట్రేలియా జట్టు బలహీనంగా లేదని రోహిత్ చెప్పాడు. ప్రస్తుత వన్డే సిరీస్‌లో స్టార్ పేసర్లు మిషెల్ స్టార్క్, కమిన్స్, హేజిల్‌వుడ్ లేకున్నా వారి బౌలింగ్ బలహీనం కాదన్నాడు. '2016లో భారత జట్టు పర్యటించిన సమయంలో వీరు ముగ్గురూ లేరు. అయినా భారత్‌పై 1-4తో వన్డే సిరీస్‌ను ఆసీస్ గెలుచుకుంది. వారి బౌలింగ్ బలంగా ఉందని చెప్పేందుకు ఇది మంచి ఉదాహరణ. మా బ్యాట్స్‌మెన్‌ను ఇబ్బంది పెట్టే నైపుణ్యమున్న బౌలర్లు వారి జట్టులో ఉన్నారు. వారిని ఒత్తిడిలోకి నెట్టి విజయం సాధించేందుకు మేం ప్రయత్నిస్తాం' అని స్పష్టం చేశాడు.

మహీ.. మార్గదర్శి

మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీపై రోహిత్ శర్మ ప్రశంసల వర్షం కురిపించాడు. అతను జట్టుకు మార్గదర్శిలాంటి వాడని. అతని నుంచి యువ ఆటగాళ్లు స్ఫూర్తి పొందుతారని అన్నాడు. వరల్డ్ కప్ లాంటి మెగాటోర్నీలో ధోనీ పాత్ర కీలకమన్నాడు. మహీ గొప్ప ఫినిషర్. అతని సామర్థ్యం గురించి కొత్తగా చెప్పాల్సిన అవసరం లేదు. అతను జట్టులో ఉండటం చాలా అవసరం. ఎల్లప్పుడూ ప్రశాంతంగా ఉండే ధోనీ వికెట్ల వెనుక ఉన్నాడంటే జట్టుకు కొండంత అండ. జట్టుకు చాలాకాలం పాటు విజయవంతమైన కెప్టెన్‌గా వ్యవహరించిన ధోనీ ఇప్పటికీ తన సలహాలతో యువ ఆటగాళ్లకు ఎంతో తోడ్పడతాడు. స్పిన్నర్లు చహల్, కుల్దీప్ యాదవ్ విజయవంతమవడంలో ధోనీ పాత్ర ఎంతో ఉంది. వికెట్ల వెనుక నుంచి అతని సలహాల వల్లే ఈ జోడీ చక్కటి ఫలితాలను రాబట్టింది. లోయర్‌ఆర్డర్ బ్యాటింగ్ చేయాలంటే ధోనీ తరువాతే ఎవరైనా. మహీ ఫినిషింగ్ నైపుణ్యం గురించి ఎంత చెప్పినా తక్కువే. . కెప్టెన్సీ నుంచి తప్పుకున్న తర్వాత కూడా ధోనీ జట్టులో కీలక పాత్ర పోషిస్తున్నాడు.

స్థానం పదిలం చేసుకుంటా:

టెస్టు జట్టులో స్థానం సుస్థిరం చేసుకుంటానని రోహిత్ శర్మ ధీమా వ్యక్తం చేశాడు. చివరిటెస్ట్‌లో ఆడకపోవడం బాధించినా బిడ్డను చూసుకోవడం సంతోషం కలిగించిందని చెప్పుకొచ్చాడు. సిడ్నీ టెస్ట్ ముగిసిన అనంతరం ఆసీస్‌లో తొలి సిరీస్ విజయాన్ని సభ్యులతో కలిసి పంచుకోవడం ఆనందం కలిగించిందన్నాడు. 'టెస్ట్ మ్యాచ్‌లో విజయం సాధించాలంటే వ్యూహాత్మకంగా ఆడాలి. చిన్న చిన్న లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని పూర్తిచేస్తూ ముందుకు సాగాలి. ఆసీస్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌లో మేం ఇలాగే ఆడి ఫలితాన్ని సాధించాం. ఒక ఆటగాడిలోని అసలు సత్తా సంప్రదాయ ఫార్మాట్‌లోనే బయటపడుతుంది. అందుకే టెస్ట్ క్రికెట్ ఆడేలా నా ఆట తీరును మార్చుకుని జట్టులో స్థానం సుస్థిరం చేసుకుంటాను' అని పేర్కొన్నాడు.



రోహిత్

నంబర్ 1 మేరీ కోం..

న్యూఢిల్లీ: ఆరోసారి ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన భారత స్టార్ బాక్సర్ మేరీ కోం ప్రపంచ ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్‌గా నిలిచింది. గతేడాది ఢిల్లీలో ముగిసిన ప్రపంచ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో మేరీ 48 కేజీల విభాగంలో స్వర్ణం నెగ్గిన సంగతి తెలిసిందే. దీంతో అంతర్జాతీయ బాక్సింగ్ సంస్థ(ఏఐబీఏ) తాజాగా ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో టాప్ ర్యాంక్ చేజిక్కించుకుంది. బాక్సింగ్ చరిత్రలో అత్యంత విజయవంతమైన బాక్సర్‌గా కొత్త చరిత్ర నమోదు చేసిన మేరీ 48 కేజీల విభాగంలో ఈ ఏడాదికి గాను 1700 పాయింట్లు సాధించింది. 48 కేజీల విభాగాన్ని చేర్చకపోవడంతో 2020లో జరిగే ఒలింపిక్స్ క్రీడల్లో 51 కేజీల విభాగంలో మేరీ కోం పడనుంది. 2018 ఏడాదిని విజయవంతంగా కొనసాగించిన మేరీ కోం.. పోలండ్ టోర్నీతోపాటు కామన్వెల్త్, ప్రపంచ చాంపియన్‌షిప్‌లో స్వర్ణాలు కైవసం చేసుకుంది. బల్గేరియాలో జరిగిన టోర్నీలోనూ రజతం నెగ్గింది. ఇతర మహిళా బాక్సర్లలో పింకీ జాంగ్రా (51కేజీలు), ఆసియా క్రీడల రజత పతక విజేత మనీశ్ మౌన్(54కేజీలు) ఎనిమిదో స్థానంలో నిలిచారు. ఇండియా ఓపెన్‌లో స్వర్ణం గెలుచుకున్న లోవ్లీనా(69కేజీల)విభాగంలో రెండోస్థానం అందుకుంది. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్యం గెలుచుకున్న సిమ్రన్‌జిత్ కౌర్(64కేజీలు) నాలుగోస్థానం దక్కించుకుంది.

భారత్ పరాజయం

ఏఎఫ్‌సీ ఆసియా కప్

అబుదాబి: గోల్ చేసేందుకు పలుమార్లు అవకాశాలు వచ్చినా ఫినిషింగ్ లోపంతో భారత ఫుట్‌బాల్ జట్టు సద్వినియోగం చేసుకోకపోవడంతో ఏఎఫ్‌సీ ఆసియాకప్‌లో ఛెత్రిసేన పరాజయం పాలైంది. ఆతిథ్య యూఏఈ జట్టుతో గురువారం జరిగిన గ్రూప్ ఏ రెండో లీగ్ మ్యాచ్‌లో 2-0 గోల్స్ తేడాతో భారత్ ఓడింది. యూఏఈ ఆటగాళ్లు ఖల్ఫాన్ ముబారక్(41వ నిమిషం), అలీ అహ్మద్ మక్బూత్ (88వ నిమిషం) గోల్స్ కొట్టి జట్టుకు తొలి విజయాన్నందించారు. బహ్రెయిన్ జట్టుతో జరిగిన తొలిమ్యాచ్‌ను 1-1 స్కోరుతో డ్రా చేసుకున్న యూఏఈ జట్టు ..రెండో మ్యాచ్‌లో విజయంతో 4 పాయింట్లు సాధించి టేబుల్ టాపర్‌గా నిలిచింది. భారత్ 3 పాయింట్లతో రెండోస్థానంలో కొనసాగుతున్నది. ఆట ప్రారంభంలోనే భారత్‌కు గోల్ చేసేందుకు వచ్చిన అవకాశం వచ్చింది. సందేశ్ జిగన్స్ కొట్టిన కార్నర్ షాట్‌ను అనురిధ్ థాపా హెడ్డర్ గోల్‌పోస్ట్ సమీపం నుంచి బయటకు దూసుకెళ్లింది.

వాణిజ్య

సెన్సెక్స్	నిఫ్టీ
36,106	10,821
↘106	↘33

ముడి చమురు (బ్రెంట్) ↗ 61.35 డాలర్లు

బంగారం ధరలు

న్యూఢిల్లీ(రూ.లలో)	
24 క్యారెట్లు	33,070
22 క్యారెట్లు	32,920
వెండి (కిలో)	40,510

విదేశీ మారకం

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలర్	67.70	74.20
యూరో	78.20	86.20
బహ్రెయిన్ దినార్	180.00	192.00
కువైట్ దినార్	224.00	237.00
సౌదీ రియాల్	17.80	19.60
యూఏఈ దిర్హామ్	18.20	19.80

చికెన్ ధరలు

	(రూ.లలో)
ఫారం ధర	79.00
రిటైల్ లైవ్	101.00
డ్రెస్డ్	146.00
స్కిన్‌లెస్	167.00

నెక్ (వంద గుడ్లకు)

	(రూ.లలో)
హైదరాబాద్	453-00
రంగారెడ్డి	453-00
మెదక్	453-00
కరీంనగర్	455-00
వరంగల్	455-00
రిటైల్ ప్రైస్	5-15

చిన్న వ్యాపారులకు పెద్ద ఊరట

జీఎస్టీ మినహాయింపు పరిమితి రెట్టింపు

వార్షిక టర్నోవర్ రూ.20 లక్షల నుంచి 40 లక్షలకు పెంపు

32వ జీఎస్టీ మండలి సమావేశంలో నిర్ణయం

న్యూఢిల్లీ, జనవరి 10: చిన్న వ్యాపారులకు గొప్ప ఊరట లభించింది. వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) మినహాయింపు పరిమితిని కేంద్రం రెట్టింపు చేసింది. ప్రస్తుతం రూ.20 లక్షల వార్షిక టర్నోవర్ వరకు జీఎస్టీ నమోదు నుంచి మినహాయింపున్నది. దీన్ని రూ.40 లక్షలకు పెంచారు. ఈ మేరకు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ నేతృత్వంలో గురువారం ఇక్కడ జరిగిన జీఎస్టీ మండలి 32వ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. దీంతో ఇక వార్షిక టర్నోవర్ రూ.40 లక్షలు దాటితేగానీ జీఎస్టీ చెల్లింపులు ఉండవన్నమాట. కాగా, కొండ ప్రాంత, ఈశాన్య రాష్ట్రాలకు ఈ పరిమితి ఇప్పుడు రూ.10 లక్షలుగా ఉంటే.. దాన్ని రూ.20 లక్షలకు పెంచారు. ఇక్కడ వార్షిక టర్నోవర్ రూ.20 లక్షలు దాటితే జీఎస్టీ చెల్లింపులు జరుపాల్సిందే. ఇకపోతే జీఎస్టీ కంపోజిషన్ స్కీం కింద టర్నోవర్ ఆధారంగా చిన్న వర్తకులు, వ్యాపారులు చెల్లిస్తున్న 1 శాతం పన్ను రూ.1.5 కోట్ల వార్షిక టర్నోవర్ దాటినవారికే వర్తిస్తుందని సమావేశం అనంతరం విలేఖరులతో మాట్లాడుతూ జైట్లీ తెలిపారు. ప్రస్తుతం ఈ పన్ను వార్షిక టర్నోవర్ కోటి రూపాయలు దాటితే పడుతున్నది. ఏప్రిల్ 1 నుంచి మార్పు వర్తిస్తుందని జైట్లీ పేర్కొన్నారు. రూ.50 లక్షల దాకా వార్షిక టర్నోవర్ ఉన్న సేవలు లేదా, వస్తు, సేవల కల్పనదారులు, సరఫరాదారులూ కంపోజిషన్ స్కీంను ఉపయోగించుకోవడానికి అర్హులని చెప్పారు. కంపోజిషన్ స్కీం కింద సేవల కోసం పన్ను రేటు 6 శాతంగా ఉంటుందని తెలిపారు. ఈ నిర్ణయాలు ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థ (ఎంఎస్‌ఎంఈ)లకు ఊతమివ్వగలవని జైట్లీ ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే నిర్మాణ రంగంలో జీఎస్టీ రేట్లకు సంబంధించి పరిశీలనకు ఓ కమిటీని ఏర్పాటు చేస్తామని కూడా జైట్లీ ఈ సందర్భంగా చెప్పారు. దీనిపై ఇంకా ఏకాభిప్రాయం కుదరాల్సి ఉందన్నారు.

ఎంఎస్‌ఎంఈలకు ఊతం: పరిశ్రమ

జీఎస్టీ మండలి తీసుకున్న తాజా నిర్ణయాలు చిన్న వ్యాపారులకు గొప్ప ప్రయోజనాల్ని చేకూర్చేలా ఉన్నాయని పరిశ్రమ వర్గాలు ఆనందం వ్యక్తం చేశాయి. సీఐఐ, అసోచామ్, కేపీఎంజీ ఇండియాతోపాటు డెలాయిట్ ఇండియా, ఈవై ఇండియా వంటి ఏజెన్సీలూ హర్షం వెలిబుచ్చాయి. ముఖ్యంగా ఎంఎస్‌ఎంఈలకు ఈ నిర్ణయాలు గొప్ప ఊరటను ఇవ్వగలవని సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ అభిప్రాయపడ్డారు. పన్ను భారం తగ్గడం వల్ల వ్యాపారాభివృద్ధికి ఆస్కారముంటుందన్నారు. ఈ నిర్ణయాల వల్ల లక్షలాది ఎంఎస్‌ఎంఈలకు లబ్ధి చేకూరగలదని అసోచామ్ పేర్కొన్నది. కంపోజిషన్ స్కీంపై నిర్ణయాలనూ స్వాగతించారు.

రూ.8,200 కోట్ల ఆదాయం దూరం

జీఎస్టీ రిజిస్ట్రేషన్‌కు సంబంధించి మండలి తీసుకున్న తాజా నిర్ణయంతో ఖజానాకు భారీగా ఆదాయం దూరం కానున్నట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. చిన్న వ్యాపారులకు రూ.20 లక్షల నుంచి రూ.40 లక్షలకు జీఎస్టీ మినహాయింపునిస్తున్న నేపథ్యంలో రూ.5,200 కోట్ల రాబడి తగ్గవచ్చని అంచనా వేస్తున్నారు. అలాగే కంపోజిషన్ స్కీం కింద తీసుకున్న నిర్ణయాలతో దాదాపు మరో రూ.3,000 కోట్ల ఆదాయం ప్రభావితం కావచ్చని అంటున్నారు. ఇప్పటికే జీఎస్టీ నెలసరి వసూళ్లు పడిపోతున్న వేళ.. గత నెల జరిగిన మండలి చివరి సమావేశంలోనూ తీసుకున్న నిర్ణయాలు సర్కారీ ఆదాయాన్ని తగ్గించిన విషయం తెలిసిందే. జీఎస్టీ గరిష్ఠ శ్లాబైన 28 శాతం నుంచి చాలా వస్తు, సేవలను దిగువ శ్లాబుల్లోకి మార్చగా, 18, 12 శాతాల నుంచీ కొన్నింటిని తొలగించారు. మరికొన్నింటిపై పన్నును తొలగించగా, మొత్తం నాటి నిర్ణయాలతో రూ.5,500 కోట్ల ఆదాయం ఖజానాకు దూరమైంది.

త్రైమాసిక చెల్లింపులు, వార్షిక రిటర్నులు

జీఎస్టీ కింద ప్రస్తుతం 1.17 కోట్లకుపైగా వ్యాపారులు నమోదై ఉన్నారు. ఇందులో 18 లక్షలకుపైగా వ్యాపారులు కంపోజిషన్ స్కీంను ఎంచుకున్నారు. రెగ్యులర్ ట్యాక్స్‌పేయర్లు నెలవారీగా పన్నులు చెల్లించాల్సి ఉండగా, కంపోజిషన్ స్కీంలో ఉన్నవారు మూడు నెలలకోసారి చెల్లించాల్సి ఉంటుంది. అయితే రిటర్నులను ఏడాదికోసారి దాఖలు చేయాల్సి ఉంటుంది. కంపోజిషన్ స్కీం కింద వర్తకులు, తయారీదారులు రాయితీలో 1 శాతం పన్నును చెల్లిస్తే.. రెస్టారెంట్లు 5 శాతం జీఎస్టీని చెల్లించాలి.

కేరళకు ప్రోత్సాహం

గతేడాది ప్రకృతి ప్రకోపానికి విలవిల్లాడిన కేరళకు కేంద్రం నుంచి ప్రోత్సాహం దక్కింది. రెండేండ్ల వరకు రాష్ట్రంలో వస్తు, సేవల అమ్మకాలపై 1 శాతం విపత్తు సెస్సు విధించుకోవచ్చని జీఎస్టీ మండలి చెప్పింది. దీనివల్ల వచ్చే నిధులతో భీకర వరదలతో దెబ్బతిన్న ప్రాంతాల్లో పునరావాస చర్యలు చేపట్టాలన్నది.

నిర్మాణ రంగానికి నిరాశే

హైదరాబాద్: నిర్మాణ రంగంపై జీఎస్టీని ఐదు శాతానికి తగ్గిస్తారనే ఊహాగానాల మధ్య సమావేశమైన జీఎస్టీ కౌన్సిల్ నిరాశనే మిగిల్చింది. లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా సానుకూల నిర్ణయం ఉంటుందన్న ఆశలు ఆవిరయ్యాయి. రియల్ ఎస్టేట్ సమస్యలపై తాజా సమావేశంలో భిన్నమైన అభిప్రాయాలు నెలకొనడంతో కూలంకషంగా చర్చించడానికి ఏడుగురు సభ్యుల మంత్రుల బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ఇచ్చే ప్రతిపాదనలపై వచ్చే సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని జైట్లీ తెలిపారు. దీంతో రియల్ ఎస్టేట్ అభివృద్ధి చెందేలా ప్రతిపాదనలు ఉంటాయన్న ఆశాభావాన్ని క్రెడాయ్ జాతీయ అధ్యక్షుడు జక్సేషా వ్యక్తం చేశారు. ప్రస్తుతం అందుబాటు గృహాలపై 8 శాతం జీఎస్టీని వసూలు చేస్తుండగా, ఇతర గృహాలపై 12 శాతం వడ్డిస్తున్నారు.

టీసీఎస్ అదరహో..

- **క్యూ3లో 24 శాతం పెరిగిన లాభం**
- **రూ.8,105 కోట్లుగా నమోదు**
- **ఒక త్రైమాసికంలో ఇదే అత్యంత గరిష్ఠం**
- **రూ.4 మధ్యంతర డివిడెండ్ ప్రకటన**

ముంబై, జనవరి 10: దేశంలో అతిపెద్ద ఐటీ ఎగుమతుల సంస్థయైన టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్) ఆర్థిక ఫలితాలు అదరహో అనిపించాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను సంస్థ రూ.8,105 కోట్ల నికర లాభాన్ని ఆర్జించినట్లు ప్రకటించింది. అంతక్రితం ఏడాది ఇదే సమయంలో నమోదైన రూ.6,531 కోట్ల లాభంతో పోలిస్తే 24.1 శాతం పెరుగుదల కనిపించింది. ఒక త్రైమాసికంలో ఇంతటిస్థాయిలో లాభాలను ఆర్జించడం కంపెనీ చరిత్రలో ఇదే తొలిసారి. అక్టోబర్-డిసెంబర్ మధ్యకాలంలో కంపెనీ ఆదాయం రూ.30,904 కోట్ల నుంచి రూ.37,338 కోట్లకు ఎగిసింది. వృద్ధిపరంగా చూస్తే 20.8 శాతంగా ఉన్నది. కంపెనీకి కీలకంగా ఉన్న ఉత్తర అమెరికా మార్కెట్‌లో అంచనాలకుమించి వృద్ధిని నమోదు చేసుకోవడంతోపాటు బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ విభాగాలు మెరుగైన పనితీరు కనబర్చడంతో నికర లాభంలో 23 శాతం వృద్ధిని నమోదు చేసుకోవడానికి దోహదపడిందని కంపెనీ ఎండీ, సీఈవో రాజేష్ గోపినాథన్ తెలిపారు.

ఆర్థిక ఫలితాల్లోని ముఖ్యాంశాలు..

- డిసెంబర్ నాటికి సంస్థ వద్ద 5.9 బిలియన్ డాలర్ల కాంట్రాక్టులు
- కంపెనీకి వచ్చిన మొత్తం ఆదాయంలో డిజిటల్ వాటా 30 శాతం.
- కొత్తగా 6,827 మంది సిబ్బందిని నియమించుకోవడంతో మొత్తం సంఖ్య 4.18 లక్షలకు చేరుకున్నారు.
- సంస్థ వద్ద రూ.43 వేల కోట్ల మిగులు నిధులు
- ప్రతిషేరుకు రూ.4 మధ్యంతర డివిడెండ్, 18న చెల్లింపు.

విద్యుత్‌రంగంలో అగ్రగామిగా రాష్ట్రం

- సీఎం కేసీఆర్, ఉద్యోగుల కృషివల్లే ఇది సాధ్యమైంది
- పవర్ ఇంజినీర్స్ డైరీ ఆవిష్కరణలో ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు
- వచ్చేనెలతో 50 ఏండ్ల సర్వీస్ పూర్తి చేసుకోనున్న సీఎండీ

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: విద్యుత్‌రంగంలో దేశంలోనే తెలంగాణ అగ్రగామిగా ఉన్నదని, సీఎం కేసీఆర్ కార్యదక్షత, ఉద్యోగుల నిరంతర కృషి వల్లే ఇది సాధ్యమైందని ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు పేర్కొన్నారు. గురువారం సోమాజిగూడలోని విద్యుత్ ఇంజినీర్స్‌భవన్‌లో తెలంగాణ స్టేట్ పవర్ ఇంజినీర్స్ అసోసియేషన్ 'పవర్ ఇంజినీర్స్ డైరీ-2019'ని ఆవిష్కరించి మాట్లాడారు. ట్రాన్స్‌మిషన్ నష్టాలను 2.88 శాతానికి తగ్గించి, ట్రాన్స్‌మిషన్ విద్యుత్ సామర్థ్యాన్ని 99.9 శాతానికి పెంచామన్నారు. ట్రాన్స్‌కో డిస్ట్రిబ్యూషన్ రంగంలో రూ.22 వేల కోట్లు పెట్టుబడులు పెట్టామని వివరించారు. త్వరలోనే విద్యుత్ ఉద్యోగులు, జెన్‌కో సిబ్బందికి ప్రోత్సాహకం అందిస్తామన్నారు. అసోసియేషన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు పీ రత్నాకర్‌రావు, పీ సదానందం మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని మిగులు విద్యుత్‌గా మార్చడంలో సీఎం కేసీఆర్ మార్గదర్శకత్వంలో సీఎండీ ప్రభాకర్‌రావు కృషి ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి, టీఎస్ఎన్పీడీసీఎల్ సీఎండీ ఏ గోపాల్‌రావు, విద్యుత్ సంస్థల డైరెక్టర్లు, అసోసియేషన్ ప్రతినిధులు బీ మంగీలాల్, కిరణ్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, భాస్కర్, సురేశ్, ప్రశాంత్, సంతోష్, వెంకటనారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.



వచ్చే నెలతో 50 ఏండ్ల సర్వీసు పూర్తిచేసుకుంటున్న సందర్భంగా 50 కిలోల కేక్‌ను కట్‌చేస్తున్న ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు. చిత్రంలో ఎస్పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి, ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు తదితరులు

అవిశ్రాంతంగా ప్రభాకర్‌రావు సేవలు

ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు విద్యుత్ రంగం సర్వీస్‌లోకొచ్చి వచ్చేనెలతో 50 ఏండ్లు పూర్తిచేసుకుంటున్న సందర్భంగా 'గోల్డెన్ జూబ్లీ ఇయర్'గా పేర్కొంటూ పవర్ ఇంజినీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 50 కిలోల కేక్‌ను కట్‌చేశారు. 1969 ఫిబ్రవరి 10న సంస్థలో అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్‌గా నేరుగా నియామకమయ్యారు. అప్పటినుంచి అంచెలంచెలుగా ఎదుగుతూ నేడు ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీగా.. తెలంగాణలో 24 గంటల విద్యుత్‌ను అందించడంలో కీలకపాత్ర పోషిస్తున్నారు. ఈ నేపథ్యంలో అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రభాకర్‌రావును పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. విద్యుత్ సంస్థల్లో విశిష్ట సేవలను అందిస్తూ రాష్ట్రం అభివృద్ధిలో మొదటి స్థానంలో నిలిచేలా చేశారని అసోసియేషన్ ప్రతినిధులు కొనియాడారు. 50 ఏండ్లపాటు విద్యుత్ రంగంలో అందించిన సేవలు అందరికీ ఆదర్శనీయమని ప్రశంసించారు. విద్యుత్‌రంగంలో అర్ధ శతాబ్దకాలంగా సేవలందిస్తున్న ప్రభాకర్‌రావు అనేక అవార్డులను సొంతం చేసుకున్నారు. ఎకనామిక్ టైమ్స్, సీబీఐపీ, స్కోచ్, 2016లో బూర్గుల రామకృష్ణారావు అవార్డులను అందుకున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఏపీఎస్ఈబీకి ఒక బిలియన్ యూఎస్ డాలర్ల రుణం మంజూరులో భాగంగా అమెరికాలోని ప్రపంచ బ్యాంకుకు వెళ్లిన దేశ ప్రతినిధుల బృందంలో సభ్యుడిగా ఉన్నారు.

కోటి ఎకరాల మాగాణమే కేసీఆర్ లక్ష్యం



గురువారం ట్రీ 2019 డైరీని ఆవిష్కరిస్తున్న విశ్రాంత ఇంజినీర్ సానా మారుతి, ట్రీ అధ్యక్షుడు చంద్రమౌళి, ప్రధానకార్యదర్శి మేరెడ్డి శ్యాంప్రసాద్‌రెడ్డి, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ తెలంగాణ స్టేట్‌సెంటర్ చైర్మన్ రామేశ్వరరావు తదితరులు

ట్రీ-2019 డైరీ ఆవిష్కరణలో విశ్రాంత ఇంజినీర్ల స్పష్టీకరణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రతి ఎకరాకు సాగునీరు అందించినప్పుడే రాష్ట్రప్రభుత్వం చేపట్టిన భగీరథ యత్నానికి సార్థకత లభిస్తుందని.. ఇందుకు నీటిపారుదల శాఖ ఇంజినీర్లు కృషిచేయాలని విశ్రాంత ఇంజినీర్ సానా మారుతి అన్నారు. ఖైరతాబాద్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ తెలంగాణ స్టేట్‌సెంటర్ కార్యాలయంలో గురువారం తెలంగాణ విశ్రాంత ఇంజినీర్ల అసోసియేషన్ (ట్రీ) 2019 డైరీని ఓయూ ప్రొఫెసర్ బాబూరావు, విశ్రాంత ఈఎన్సీ కే ప్రకాశ్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణలో నీటి వనరులు పుష్కలంగా ఉన్నాయన్నారు. ట్రీ ప్రధానకార్యదర్శి మేరెడ్డి శ్యాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. కోటి ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో సీఎం కేసీఆర్ పనిచేస్తున్నారని, ఇంజినీర్లు అండగా నిలిచి స్వప్నం సాకారమయ్యేందుకు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో ట్రీ అధ్యక్షుడు చంద్రమౌళి, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ తెలంగాణ స్టేట్‌సెంటర్ చైర్మన్ రామేశ్వరరావు, పర్యావరణవేత్త వేదకుమార్, విశ్రాంత ఇంజినీర్లు రాంరెడ్డి, రమణనాయక్, దామోదర్‌రెడ్డి, తెలంగాణ ఇంజినీర్స్ జేఏసీ చైర్మన్ వెంకటేశం పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు మక్కాలో సౌకర్యాలు

- హజ్ కమిటీ చైర్మన్ మహ్మద్ మసీఉల్లాఖాన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రం నుంచి మక్కా సందర్శనకు వెళ్లే హజ్ యాత్రికులందరికీ అన్ని సౌకర్యాలు కల్పించినట్టు హజ్ కమిటీ చైర్మన్ మహ్మద్ మసీఉల్లాఖాన్ తెలిపారు. హజ్ యాత్రికుల ఎంపిక అంశంపై గురువారం హజ్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హజ్ యాత్రకు ఎంపికైన అభ్యర్థుల పేర్లను 12న హోంమంత్రి మహ్మద్ మహమూద్‌అలీ ప్రకటిస్తారన్నారు. సమావేశంలో హజ్ కమిటీ సభ్యుడు మహ్మద్ ఫరీదుద్దీన్, వక్ఫ్‌బోర్డు సభ్యుడు మహ్మద్ సలీం, ఎమ్మెల్సీ మహ్మద్ ఫారూఖ్‌హుస్సేన్, హజ్ ప్రత్యేకాధికారి ఎస్‌ఏ షుకూర్ పాల్గొన్నారు.

చిన్న పత్రికలకు అండదండలు

- మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: చిన్న పత్రికలకు ప్రభుత్వం అండగా నిలవాల్సిన అవసరం ఉన్నదని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ అన్నారు. వాటిని కాపాడుకునే బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదని చెప్పారు. చిన్న పత్రికల సమస్యలను ఇప్పటికే చాలావరకు పరిష్కారించామన్నారు. గురువారం అకాడమీ కార్యాలయంలో నేటి నిజం తెలుగు దిన పత్రిక క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ పత్రిక ఎడిటర్ దేవదాస్, టుడే ఫ్రీడం ఎడిటర్ వీణాదాస్, సమీక్ష ఎడిటర్ నజ్రీన్‌ఖాన్, సీనియర్ జర్నలిస్ట్ ఆజంఖాన్, సూరజ్, ఏనుగుల దామోదర్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ
జిందగీ
శుక్రవారం 11 జనవరి 2019 WWW. NTNEWS.COM /nt.zindagi

మహిళా క్యాబ్ డ్రైవర్లు!



మహిళల భద్రత, ఉపాధి.. దేశ సమస్యల్లో ఆందోళనకరమైన అంశాలు. నిర్భయ లాంటి చట్టాలు వచ్చిన తర్వాత కూడా మహిళల భద్రతకు భరోసా లేకుండా పోతున్నది. మరోవైపు వాళ్లకు ఉపాధి అవకాశాలు కూడా సరిగా లేని పరిస్థితి. ఇలాంటి వాటిని నివారించడానికి కర్ణాటక ప్రభుత్వం వినూత్న ఆలోచన చేసింది.

కర్ణాటక టూరిజం, బెంగళూర్ ఎయిర్‌పోర్టు అధికారులు కలిసి మహిళల కోసం ప్రత్యేక క్యాబ్‌లు ప్రారంభించారు. ఇందులో విశేషం ఏముందని అనుకుంటున్నారా? ఆ క్యాబ్‌లను నడపడానికి మహిళా డ్రైవర్లనే నియమించారు. దీంతో ఎయిర్‌పోర్టు నుంచి బయల్దేరే మహిళలకు భద్రత పెరుగుతుందనీ, మరికొందరి మహిళలకు ఉపాధీ లభిస్తుందని చెపుతున్నారు. ప్రతీ క్యాబ్‌కు జీపీఎస్ అనుసంధానం చేశారు. దీంతో పాటు ఎమర్జెన్సీ సందేశాలు పంపే వీలు కూడా కార్లలో ఏర్పాటు చేశారు. మహిళా డ్రైవర్లకు డ్రైవింగ్‌లో మెళకువలతో పాటు ఆత్మరక్షణ జాగ్రత్తలు కూడా నేర్పుతున్నారు. మహిళా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేయటం, ఇంటి నుంచి ఎయిర్‌పోర్ట్‌కు తీసుకురావడం వీళ్ల పని. అధికారుల ఆలోచనతో తాము ఉపాధి పొందుతున్నామని మహిళా డ్రైవర్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కంచి.. పదహారణాల పట్టు!

పిండి వంటల ఘుమఘుమలు.. హరిదాసు కీర్తనలు.. ముంగిట్లో రంగవల్లులు..
పడచుల పరికిణీల మెరుపులు.. గాజుల గలగలలు.. ఉంటేనే సంక్రాంతి పండుగకు అర్థం.. ఆనందం.
మరి ఈ పండుగ పూట.. పదహారణాల పడుచులా ఉండాలంటే..
కంచి పట్టు పరికిణీలు కట్టాల్సిందే! పర్‌ఫెక్ట్ మ్యాచింగ్‌లు.. కత్తిలాంటి కాంట్రాస్ట్‌లు..
మిమ్మల్ని వలవేసి మరి లాగేలా ఉండే ఈ డిజైన్‌లపై ఓ లుక్కేయండి.



పవులూరి నాగతేజ
ఫ్యాషన్ డిజైనర్, తేజ శారీస్
కూకట్‌పల్లి, హైదరాబాద్
tejasarees@yahoo.com

లిపిడ్ ప్రొఫైల్ ఎక్కువ ఉంటే ప్రమాదమా?



అడుగండి చెబుతా

నా వయసు 33 సంవత్సరాలు. ఆర్నెళ్లుగా నాకు చేతులు, కాళ్లు తీవ్రంగా లాగేస్తున్నాయి. తరచూ తిమ్మిర్లు వస్తున్నాయి. గుండెభాగంలో కూడా నొప్పి వస్తుంది. హైబీపీ సమస్య అని డాక్టర్లు చెప్పారు. ఒత్తిడికి గురికావడం వల్లే ఇలా అవుతుందన్నారు. గుండెకు సంబంధించి ఈసీజీ, 2డీ ఎకో పరీక్షలు చేశారు. మందులు వాడమని చెప్పారు. లిపిడ్ ప్రొఫైల్ పరీక్ష రిపోర్ట్‌ను బట్టి సమస్య ఏంటో చెప్తామని అన్నారు. నాకు ఆందోళనగా ఉంది. ఏంటీ లిపిడ్ ప్రొఫైల్? ఇది ఎక్కువగా ఉంటే నాకు ప్రమాదం ఉన్నట్టా? తెలియజేయగలరు.

- జే. రమేష్, హైదరాబాద్



డాక్టర్ సుజేష్
జనరల్ ఫిజీషియన్
గవర్నమెంట్
ఈఎస్ఐ హాస్పిటల్
హైదరాబాద్

రమేష్‌గారూ.. ముందు మీరు ఆందోళనను పక్కనపెట్టండి. అనవసర ఆందోళనే మీకు సమస్యగా మారుతున్నది. కాళ్లు.. చేతులు లాగడం, తిమ్మిర్లు రావడం అనేది చిన్న సమస్యే. కొందరిలో కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉండటం వల్లగానీ, బీపీ అధికంగా ఉండటం వల్లగానీ ఇలా జరుగుతుంది. కాబట్టి మీరు దిగులు చెందకండి. మీరు కుప్పకూలి పోయిన కారణం కూడా అదే. ఒత్తిడిని తగ్గించుకుంటే ఇలాంటి సమస్యలు ఉత్పన్నం కావు. ఈసీజీలోగానీ.. 2డీ ఎకో పరీక్షలోగానీ ఎలాంటి ప్రతికూలమైన ఫలితాలు రాలేదు అన్నారు. అయినా ఆందోళన చెందుతున్నాను అని చెప్తున్నారు. మీరు మందులు వాడారు కానీ దానికి తగ్గట్టుగా లైఫ్‌స్టయిల్‌ను మార్చుకోలేదు అనే విషయం స్పష్టంగా తెలుస్తున్నది. ఎక్కువగా ఆల్కహాల్ తీసుకునేవారికి, కొవ్వు పదార్థాలు ఎక్కువ తినేవారికి, పొగ తాగేవారికి ఇలాంటి లక్షణాలు ఉంటాయి. కానీ మీరు మద్యం, ధూమపానం గురించి పేర్కొనలేదు. ఒకవేళ మీకు అలాంటి అలవాట్లు ఉంటే వెంటనే మానేయండి. ఇక మీ ప్రధాన అనుమానం లిపిడ్ ప్రొఫైల్. దీని గురించి విపరీతంగా ఆలోచించాల్సిన అవసరం లేదు. రక్తంలో ఉన్న కొలెస్ట్రాల్ శాతాన్ని తెలుసుకోవడమే లిపిడ్ ప్రొఫైల్. ఒకవేళ రక్తంలో కొలెస్ట్రాల్ శాతం ఎక్కువగా ఉందని లిపిడ్ ప్రొఫైల్ పరీక్షలో తేలితే.. డాక్టర్ సూచించిన మందులు వాడండి.

నీళ్లు లేకున్నా పచ్చదనమే



- బ్రొమెలియాడ్ అనే మొక్క చాలా ఆకర్షణీయం. ఈ మొక్కలకు సూర్యరశ్మి పరోక్షంగా ఉంటే చాలు. వీటికి రెండువారాలకోసారి నీరు పెడితే చాలు బాగా ఎదుగుతుంది.
- కాక్టస్.. ఈ రకమైన మొక్కలు తక్కువ నీటితో పచ్చగా ఉంటాయి. వీటితో పాటు లివింగ్ రాక్, రేట్స్ టెయిల్, బిషన్ కేప్ మొక్కలకు కూడా తక్కువ నీరు సరిపోతుంది. వీటిని ఇంటి లోపల లేదా బయట పెంచవచ్చు. వారాల తరబడి నీరు లేకున్నా బాగా పెరుగుతాయి.
- స్పైడర్ మొక్కలు వేలాడుతుంటాయి. ఇవి తెలుపు, ఆకుపచ్చ గీతలతో ఉంటాయి. ఈ మొక్కలకు అతి తక్కువ నీరు సరిపోతుంది. మట్టి కూడా పెద్దగా అవసరం లేదు.
- మడగాస్కర్ డ్రాగన్ ట్రీ అనే మొక్క కాక్టి మొక్కవలే ఉంటుంది. వారాల తరబడి నీళ్లు పట్టకపోయినా బతుకుతుంది. దీనికి మట్టి కొంచెం మెత్తగా ఉండాలి. నేలమీద కుదరకపోతే కుండీలలో పెంచవచ్చు.

సిరిముగ్గు





బి. దుర్గాభవాని
ఆర్.ఎన్.కాలనీ,
హైదరాబాద్

మీరు ముగ్గులు పంపాల్సిన మా చిరునామా:

సిరి ముగ్గు,
నమస్తే తెలంగాణ,
8-2-603/1/7,8,9, కృష్ణాపురం,
బంజారాహిల్స్, రోడ్ నెం - 10,
హైదరాబాద్ - 500034.
zindagi.nt@gmail.com

వంట చిట్కాలు



- చేప ముక్కలకు ఉప్పు కలిపి డీప్ ఫ్రీజర్‌లో పెడితే ముక్కలు అంటుకోకుండా ఉంటాయి.
- స్వీట్స్‌లో చక్కెరను పొడిగా చేసి వేస్తే అవి చాలా రుచిగా ఉంటాయి.
- ఉడికించిన తర్వాత కూడా కూరగాయల రంగు కోల్పోకుండా ఉండాలంటే ఆ నీళ్లలో కొంచెం పసుపు, ఆలివ్ నూనె వేసి ఉడికించాలి.
- పసుపు కలిపిన నీటితో వంటగదిని శుభ్రం చేస్తే ఈగల బాధ ఉండదు.
- పాలు పొంగకుండా ఉండాలంటే అవి మరిగేటప్పుడు ఆ గిన్నెపై ఒక స్పూన్ పెట్టండి.

నమస్తే తెలంగాణ
చింతన
[హైదరాబాద్]
శుక్రవారం 11 జనవరి 2019



నమో నమామి

ఆదిదేవ నమస్తుభ్యం ప్రసీద మమభాస్కరా
దివాకర నమస్తుభ్యం ప్రభాకర నమోస్తుతే
సప్తాశ్వరథ మారూఢమ్ ప్రచండం కశ్యపాత్మజమ్
శ్వేతపద్మపథం దేవం తం సూర్యం ప్రణమామ్యహమ్ ॥

-ఆదిత్య స్తవం

భానుసప్తమి సందర్భంగా ఈ ఆదిత్య స్తవ పఠనం అత్యంత శుభకరం. ప్రత్యక్ష ఆదిదేవుడు, భాస్వరశక్తితో మండే భాస్కరుడు, దివాకరుడు, ప్రభాకరుడు, ఏడు గుర్రాల రథాన్ని అధిరోహించిన వాడు, కశ్యప ప్రజాపతి కుమారుడు, ప్రచండ తేజోవంతుడు, తెల్లని పద్మాన్ని ధరించిన వాడు అయిన సూర్యభగవానునికి ఇదే నా నమస్కారం.

మంచిమాట




జంతువును మనిషి స్థాయికి, మనిషిని దేవుని స్థాయికి ఎదిగేలా చేసేదే మతం.

- స్వామి వివేకానంద

పద్యనీతి

చదవని వాడజ్ఞుండగు
జదివిన సదసద్వివేక చతురత గలుగుం
జదువంగ వలయును జనులకు
చదివించెద నార్యులొద్ద(జదువుము తండ్రీ ॥

- బమ్మెర పోతన (శ్రీమదాంధ్ర మహాభాగవతం, సప్తమ స్కంధం)



'చదువుకోని వారు లోకం దృష్టిలో అజ్ఞానుల కిందే లెక్క. చదువుకుంటేనే సమాజంలోని మంచీ, చెడు తెలుసుకొనే వివేకం కలుగుతుంది. అందుకే, చదువు ముఖ్యం. నిన్ను ఆర్యులైన గురువుల దగ్గరకు పంపి చదివిస్తాను. చక్కగా చదువుకో నాయనా..' అని ప్రహ్లాదునికి అతని తండ్రి హిరణ్యకశిపుడు నీతిబోధ చేసిన సందర్భంలోనిదీ పద్యం.

పర్వదినాలు

- స్వామి వివేకానంద జయంతి (12వ తేది), శ్రీశైలంలో సంక్రాంతి బ్రహ్మోత్సవాలు (12 నుంచి 18 వరకు)
- భానుసప్తమి (13వ తేది)
- భోగి పండుగ, ధనుర్మాసం సమాప్తి, గోదా కల్యాణం, శబరిమలలో మకరజ్యోతి దర్శనం (14వ తేది)
- మకర సంక్రాంతి, ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభం, అలహాబాద్‌లో అర్ధ కుంభమేళ ఆరంభం, ఆది శంకరాచార్యుల వారి సన్యాస స్వీకారం (15వ తేది)
- కనుమ పండుగ, బొమ్మల కొలువు (16వ తేది)
- పుత్రదా ఏకాదశి (17వ తేది)

మేల్కొలుపు



శ్రీమన్నభీష్ట వరదాఖిల లోకబంధో
శ్రీ శ్రీనివాస జగదేక దయైక సింధో
శ్రీ దేవతాగృహ భుజాంతర దివ్యమూర్తే
శ్రీ వేంకటా చలపతే తవ సుప్రభాతమ్ ॥ 13 ॥

- శ్రీ వేంకటేశ్వర సుప్రభాతమ్

మానవాళి కోర్కెలను తీర్చేవాడవు, లోకాలన్నింటికీ బంధువువు. జగత్తులోని ఏకైక దయామూర్తివి. సంపదల దేవతైన శ్రీ లక్ష్మీదేవికి నీ హృదయ పీఠంపై నివాసమిచ్చిన వాడవు. దివ్యప్రభలతో వెలుగొందే మనోహరుడవు అయిన శ్రీ వేంకటా చలాధిపతీ! అందుకొనుమా మా సుప్రభాతమ్.

సందర్భ శుద్ధి

భోగి పండుగ వేళ .. గోదా కల్యాణ వేడుక

పాశురాలతో పరమ సన్నిధి!

సిరినోము (తిరుప్పావై) పండగా.. గోదా – రంగనాథుల పెండ్లి జరుగగా.. శ్రీ వైష్ణవ ఆలయాలలో ఆ అట్టహాసం చూడటానికి రెండు కండ్లూ చాలవు. ధనుర్మాసంలో 30 రోజులపాటు కన్నె గోదాదేవి పాడిన ప్రేమ పాశురాలు ఆమెను శ్రీ రంగనాథ స్వామి సన్నిధికి చేర్చాయంటే నమ్మశక్యం కాదు. కానీ, 1243 సంవత్సరాల కిందట (క్రీ.శ.776) ఇది నిజంగా జరిగింది. వందలాది మంది విష్ణుభక్తులు కండ్లనిండా చూస్తుండగా గర్భగుడిలోకి వెళ్లిన ఆమె జ్యోతి స్వరూపంగా మారి స్వామి విగ్రహంలో సంలీనమైంది.

శ్రీ విష్ణుమూర్తిని ఆరాధించే భక్తులందరికీ అవి దివ్య ప్రబంధాలే కావచ్చు. కానీ, ఆ కన్నెపిల్లకు మాత్రం ప్రేమ పాశురాలు. రోజుకొక ప్రేమ పావు(శు)రాన్ని గోకులంలోని కన్నయ్య కోసం ఎగురవేస్తూ ఆ తమిళ పాటల్ని అవలీలగా, తనను తాను మైమరిచి పోయి, తమకంగా పాడుతుంటే వినేవారికి, చూసేవారికి ఇది కలియుగమా, ద్వాపరనా అనిపించి ఉంటుంది. ఒక్కోరోజు ఒక్కో పాశురం (పాట) చొప్పున పాడుతూ ఆ కారణజన్మురాలు తన తిరుప్పావై (సిరినోము) వ్రతదీక్షను పూర్తి చేసి శ్రీ రంగనాథుని పెండ్లి యాడిన విధం అద్భుతం, అనితర సాధ్యం!

కొత్త క్రాంతి వైపు..

మకర సంక్రాంతి ఎప్పుడూ, ప్రతి ఏటా వచ్చే పండుగే కదా, ఏముంది ప్రత్యేకత? అనుకుంటారు చాలామంది. రోజూ తినే తిండే అయినా తినక తప్పదు. కాకపోతే, కొత్త రుచులను కోరుకోవడం సహజం. ఈ క్రమంలోనే ఈ పండుగకి కూడా మన మనసుని శుద్ధి చేసుకుందాం. నూతన ఆలోచనలతో కొత్త క్రాంతివైపు ప్రయాణం మొదలు పెడదాం. మిగిలిన రంగాల మాటెలా వున్నా ఆధ్యాత్మిక సాధనపట్ల అనురక్తిని ఇకనైనా పెంచుకుందాం. తద్వారా మానసిక ప్రశాంతతను సాధిద్దాం. 'నేను', 'నాది' అనే అహంలోంచి బయటపడి.. మనిషి, మానవజాతి అనే విశాలతత్వంలోకి వద్దాం. శాస్త్రీయంగానే దేవుణ్ణి నమ్ముదాం. మానవీయత, జీవకారుణ్యం, ప్రకృతి ప్రేమలను మించిన దైవత్వం మరేముంటుంది!





ప్రేమ పాశురాల సృష్టికర్త ఆండాళ్ గోదాదేవి తల్లి కన్నెపిల్లగా నడయాడిన ఊహాచిత్రం

ఇప్పటికి మన కండ్ల ముందర్నుంచి ఎన్నో మకర సంక్రాంతులు వెళ్లి ఉంటాయి. కానీ, ఈ (2019) పండుగ గత 27 రోజులుగా ఒక అపురూప వేడుకగానే అనిపిస్తున్నది. కారణం, గోదాదేవి తమిళంలో పాడిన 30 పాశురాల పరమార్థాన్ని తెలుగు భక్తుల కోసం ప్రబోధించడానికి శ్రీ వైష్ణవ ఆధ్యాత్మిక గురువు, ఉపదేశకులు త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్ స్వామి సమక్షంలో ధనుర్మాసోత్సవం జరుగుతుండడం. ఇన్ని రోజులుగా హైదరాబాద్‌లోని నందగిరి హిల్స్ నిజంగానే ఆనాటి నందగోకులాన్ని ఎందరికో గుర్తుకు తెస్తున్నది. ఆయన ఇక్కడ ప్రతి రోజూ అందిస్తున్న ప్రవచనాల సుధలు ఆహుతులకు అమృతాక్షర భాండాలే. స్వామి వారి ఆధ్యాత్మిక ప్రసంగం సాగినంతసేపు ఆహుతులైన భక్తుల్లోని శ్రద్ధాసక్తులు, వినయ విధేయతలు కొత్త సందర్శకులను విస్మయ పరుస్తాయి.



గోదా తల్లి పాశురాలు ఒక్కమాటలో చెప్పాలంటే శ్రీకృష్ణుడికి ఆమె సంధించిన ప్రేమ పారవశ్యపు పాశుపతాస్త్రాలే. నాలుగు వేదాలు, 108 ఉపనిషత్తులు, షట్ దర్శనాలు, మహాభాగవత గాథలు, పురాణాలు మొత్తంగా జగాలనేలే ఆ పరమాత్మ శ్రీమహావిష్ణువు విరాట్ విశ్వరూపాన్ని వాటిలో దర్శిస్తాం. 'మార్గళి త్తింగళ్ మది నిరైంద నన్నాళాల్...' (1)తో మొదలై 'ఎంగుమ్ తిరువరుళ్ పెత్తు ఇన్బురువర్ ఎంబావాయ్' (30)తో పూర్తయ్యే మూడు పదుల మేలుకొలుపులను మన కండ్ల ముందు సాక్షాత్కరింపజేస్తున్న చిన జీయర్ స్వామి ప్రసంగాలను ప్రత్యక్షంగా విన్న వాళ్లంతా ఎంతో అదృష్టవంతులు. ఇన్ని రోజులూ కనీసం టీవీల ముందు కూర్చుని లైవ్‌లో చూస్తున్న వారూ ఆ సారాన్ని అందుకున్న వాళ్లయ్యారు. 'సిరితల్లి గోదగా' దిగివచ్చి శ్రీహరి రంగనాథునిలో లీనం కావడానికి మరో 3 రోజులే ఉంది. కనుక, ఈ ముగింపు అవకాశం మరెవరికి లభించినా అంతకు మించిన సంతోషం వారికి మరొకటి ఉండదేమో.

ఆళ్వారుల వారి నాలాయిర ప్రబంధంలో మొత్తం 4,000 పాశురాలు ఉంటే, ప్రత్యేకించి గోదాదేవి పాడిన ముప్పది పాటలకు యావత్ విష్ణుభక్తుల లోకమే దాసోహమైంది. దీనినిబట్టి, ఆ పాటల దివ్యత్వం, గొప్పతనం మనకు బోధపడుతాయి. ఆ గోదా తల్లిది ఎంత నిర్మలమైన ప్రేమంటే స్వామిని కోర్కెలేవీ కోరలేదు. ఆఖరకు ముక్తిని సైతం అడగలేదు. కేవలం 'కన్నయ్య సఖ్యం మాత్రమే' కావాలంది. 'పిల్లా మేలుకో, పల్లెపిల్లా మేలుకో, రేపల్లె పిల్లా మేలుకో.. నల్లాని సామినీ పెళ్లాడ మనసైతే, తెల్లారు జామునే చలిమునక వెయ్యాలి!' (తిరుప్పావై దివ్యప్రబంధం : ముళ్లపూడి వెంకటరమణ) అంటూ సాగే ఆ పాటల్లో ఎంత సరళత్వమో, అంత చిక్కదనం. శ్రీహరి జగజ్జాయమానమైన దశావతారాల సారం సహా సర్వాంతర్యామి సకల మహోన్నత శక్తియుక్తులన్నీ 'కట్టె కొట్టె తెచ్చె' అన్నంత సూక్ష్మంలో దర్శింపజేశాయి.

ఈ భోగి పండుగ వేళ చలిమంటల వెచ్చదనాన్ని ఆస్వాదిస్తూనే అద్భుతమైన గోదా–రంగనాథుల కల్యాణ వైభవాన్ని ఏ మాత్రం అవకాశం ఉన్నా కండ్లారా చూసి, చెవులారా వినే ప్రయత్నం చేద్దాం. మనలాంటి సామాన్యులకు ఇంతకంటే మించిన జన్మసార్థకత మరొకటి ఉండదేమో!

దోర్బల బాలశేఖరశర్మ


ఇలా చేద్దాం



ప్రతీ ఏకాదశి, ప్రత్యేక రోజులు, పండుగలు వంటి సందర్భాలలో చాలామంది 'ఉపవాస వ్రతం' చేస్తుంటారు. ఇది పురాణాల ప్రకారం అత్యంత పుణ్యప్రదమే. ముఖ్యంగా, ఏకాదశి ఉపవాసం వల్ల సూర్యచంద్ర గ్రహణాల వేళల్లో చేసే దానాదులు, అశ్వమేథ యాగం చేసిన ఫలితాలకన్నా అధిక ఫలం లభిస్తుందని వేద పండితులు అంటారు. ఎంత సాధ్యమైతే అంత నిష్ఠగా ఉపవాసం చేయవచ్చు. అయితే, ఇదే సమయంలో ప్రతీ ఒక్కరూ తమ ఆరోగ్యరక్షణ మరిచిపోరాదు. దేహాన్ని హింసిస్తూ భక్తిని ప్రదర్శించమని ఏ శాస్త్రాలైనా చెప్పాయా? దానిని మూర్ఖభక్తిగా పిలిచే వారూ ఉంటారు. కాబట్టి, ఉపవాస వ్రతం ఆరోగ్యరీత్యా చేయలేని వారు పాలు, పెరుగు, చల్ల, పండ్లు, నీరు వంటి ద్రవాలను ఆహారంగా తీసుకోవచ్చు. ఇది కూడా సాధ్యపడని వారు ఉడకని పదార్థాలను, అదీ కుదరనపుడు ఒక పూట సాత్వికాహారం తీసుకోవడం వంటివి చేయవచ్చని పెద్దలే చెప్పారు. కనుక, అన్నింటికంటే ముఖ్యం ఆరోగ్యం అని గుర్తుంచుకుందాం. అది బాగుంటేనే కదా మనం భక్తితో ఉండగలిగేది.

హస్తభూషణం

ధనుర్మాసం ముగిసి, తిరుప్పావై వ్రతదీక్ష పూర్తయి, ఆండాళ్ గోదాదేవి-రంగనాథుల కల్యాణం జరుగుతున్న ఈ శుభవేళ ఒక మంచి పుస్తకం గురించి తెలుసుకుందాం. తెలుగువారి ఆరాధ్యులు, జంటసాహితీ కళామూర్తులు బాపు-రమణల సంయుక్త కృషితో గోదాదేవి 30 రోజులపాటు పాడిన అద్భుత దివ్య పాశురాలను ప్రసిద్ధ ప్రచురణ సంస్థ ఎమెస్కో 2007లోనే 'మేలుకొలుపులు' పేర పుస్తకంగా ప్రచురించింది. తిరుప్పావై దివ్యప్రబంధానికి ముళ్లపూడి వారి సరళ పలుకులు, బాపు రంగుల చిత్రాలు, విజయ్‌కుమార్ (ప్రచురణకర్త) ఉత్తమాభిరుచి తోడైన ఫలితంగా సామాన్య అచ్చ తెలుగు పాఠకులకు ఒక నిజమైన 'హస్తభూషణం' ఇది. మీకు ఏ మాత్రం వీలున్నా ఆ పుస్తకాన్ని సేకరించి చదివి తరించండి!



జీవన వేదం

మానవులంతా మంచి విద్యాబుద్ధులు అలవరచుకోవాలి. ఉత్తమమైన ఔషధాలను సేవిస్తూ ఆరోగ్యవంతులుగా ఉండాలి. బలాన్ని, బుద్ధిని పెంచుకోవాలి. విస్తృమైన పురుషార్థాలతో శరీర, ఆత్మల సుఖాలను పొందాలి. ఇక, రాజుకు శౌర్యగుణం శోభాయమానం. ఆయన యోగ్యులైన వారిని రక్షిస్తూ, అయోగ్యులను శిక్షిస్తూ ప్రజారంజక పాలన చేయాలి. ఎవరైతే వ్యాపారాది కార్యకలాపాల కోసం దూరదేశాలకు వెళతారో వారి రక్షణ బాధ్యతను కూడా రాజులే నిర్వర్తించాలి.

-ఋగ్వేదం



ఎందుకంటే?



'ఉత్తరాయణం' పుణ్యకాలమని హైందవ గ్రంథాలు చెబుతున్నాయి. ఎందుకంటే, దేవతలకు ఇది పగటి సమయం కనుక. వారు ఈ కాలంలో మేల్కొని ఉంటారు. వారికి దక్షిణాయణం రాత్రి వేళ. కర్కాటక సంక్రమణం నుండి మకర సంక్రమణం వరకు 6 నెలలు దక్షిణాయణం. కాగా, మకర సంక్రాంతి నుంచి మళ్లీ కర్కాటక సంక్రమణం దాకా 6 నెలలు 'ఉత్తరాయణం' అంటారు. 'సంక్రాంతి' అంటే మారడం అని అర్థం. మకరరాశిలోకి సూర్యుడు మారతాడు కాబట్టి, ఈ పర్వదినాన్ని 'మకర సంక్రాంతి'గా పిలుస్తారు. సూర్యుడు ప్రతి సంవత్సరం జనవరి 15న ఉత్తరాయణ పథంలోకి అడుగుపెడతాడు. ఈ రోజు నుంచి స్వర్గలోక ద్వారాలు తెరచుకొని ఉంటాయని, అందుకే ఈ కాలమంతా పుణ్యప్రదమనీ వేద పండితులు అంటారు. మహాభారత కాలంలో భీష్ముడు ఉత్తరాయణ పుణ్యకాలంలోనే ప్రాణాలు వదలగా, ఆది శంకరాచార్య సన్యాసాశ్రమాన్ని ఇదే రోజు స్వీకరించారనీ చెప్తారు. ఇక, ఇదే సమయంలో వచ్చే 'పుష్యశుక్ల ఏకాదశి'ని 'పుత్రదా ఏకాదశి'గా పిలుస్తారు.

అర్థం- పరమార్థం



ధర్మేచ, అర్థేచ,
కామేచ.. త్వయి
ఏషానాది నాతి చరి
తవ్యా.. నాతి చరామి

'ధర్మాలలోను, ధనార్జనలలోను, కామంలోను, సంతాన భాగ్యంలోను ఈ కన్యను ఎప్పటికీ నేను అతిక్రమించను' అన్న అర్థం వచ్చేలా పురోహితుడు వరునితో చేయించే పెండ్లి ప్రమాణమిది. 'నాతి చరామి, నాతి చరితవ్య' అంటూ వధూవరులు ఇద్దరితోనూ ప్రమాణం చేయిస్తారు. అంటే, పై అన్ని సందర్భాలలోనూ పరస్పరం అన్యోన్యంగా, దాంపత్య జీవనం సాగిస్తామని ఇద్దరూ అంగీకారం తెలపడమే ఈ మంత్రసారం.

రచనలకు ఆహ్వానం!

వివిధ ఆధ్యాత్మిక విశేషాలు, సముచిత శాస్త్రోక్త విశ్లేషణలను మీరూ ఈ పేజీకి రాసి పంపవచ్చు. ప్రామాణికమైన, ప్రజోపయోగమైన అంశాలకే ప్రాధాన్యం.
మా చిరునామా: ఎడిటర్, చింతన, నమస్తే తెలంగాణ, తెలుగు దినపత్రిక, బంజారాహిల్స్, రోడ్ నంబర్: 10, హైదరాబాద్–34.

సుడోకు

డైలీ సుడోకు 33 సమాధానం

7	4	9	1	5	8	3	6	2
8	1	2	6	9	3	7	4	5
5	3	6	2	4	7	8	9	1
9	5	7	3	6	4	2	1	8
1	8	4	5	2	9	6	3	7
6	2	3	7	8	1	9	5	4
2	7	1	4	3	6	5	8	9
3	9	5	8	1	2	4	7	6
4	6	8	9	7	5	1	2	3

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు -34

5				4	6			7
	4			3				
6				2	5			
	2		1		9	4		5
9	5						8	1
		9	2				4	
3					7			2
				6			7	9

ట్వీట్

చార్మీ కౌర్
@Charmmeofficial





మనం చేస్తున్న పని మనకు తగిన గుర్తింపునిస్తుంది. మనం చేస్తున్న పని వల్ల మనం సంతృప్తి పొందగలుగుతున్నామా అనేది మన చేతిలోనే ఉంటుంది. మనం చేసే పని అది ఏదైనా కావొచ్చు. ప్రేమించి చేస్తే విజయవంతం అవుతుంది.

చార్మీని ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య
4,33,826

కామన్‌మ్యాన్ వాయిస్

ఎన్టీఆర్, అక్కినేని తర్వాత అదే తరంలో కథానాయకుడిగా రాణించిన హీరో కాంతారావు. చిక్కడు దొరకడు, లవకుశ ఇలా అనేక సినిమాల్లో ఎన్టీఆర్‌తో కలిసి నటించారు. ఇక ఏకవీర సినిమాలో ఎన్టీఆర్, కాంతారావుల కాంబినేషన్ అజరామరం. ఎన్టీఆర్ కథానాయకుడు సినిమాలో కాంతారావు పాత్ర లేకపోవడం ఆశ్చర్యమే కాదు, బాధాకరం కూడా.

–Chandu Thulasi

కొంతమంది వాళ్లు అనుసరిస్తున్న క్రమశిక్షణను, మనల్ని ఇబ్బంది పెట్టి మరీ నేర్పించాలని, మన జీవితాల మీద వాళ్ల పెత్తనాన్ని నిరూపించుకోవాలనీ అనుకుంటారు. నిస్సహాయ సమయాలేమో మనల్ని వాళ్ల దగ్గర తలొంచేలా చేసి మనకీ పరిస్థితుల్ని తెచ్చి ఆడుకుంటాయ్.

–Mercy Margaret

వైరల్ వీడియో



గల్లీల్లో ఉండే యువకులు ఎలాంటి గొడవలు పడతారు. చిల్లర గొడవలుగా మొదలై అవి వారి జీవితంలో స్థిరపడేలా ఎలా చేశాయన్న అంశాన్ని ఇతివృత్తంగా తీసుకొని రూపొందిస్తున్న చిత్రం గల్లీ బాయ్. ఈ సినిమా ట్రైలర్ యూట్యూబ్‌లో విడుదలై హల్‌చల్ చేస్తున్నది.

Gully Boy | Official Trailer | Ranveer Singh | Alia Bhatt | Zoya Akhtar |14th February
Total views : 16,048,422+
Published on Jan 9, 2019

నమస్తే తెలంగాణ
విహారం
[హైదరాబాద్]
శుక్రవారం 11 జనవరి 2019

జోగ్ అందాలు చూడతరమా

భారతదేశంలోని ఎత్తైన జలపాతాలలో ప్రథమ స్థానాన్ని ఆక్రమిస్తున్న జోగ్ జలపాతం కర్ణాటక రాష్ట్రం షిమోగ జిల్లా సాగర తాలూకాలో ఉంది. ఈ జలపాతం శరావతి నది, 253 మీటర్ల (829 అడుగులు) ఎత్తు నుండి పడడం వల్ల ఏర్పడున్నది. ఈ జలపాతం పర్యాటకులను ఆకర్షిస్తున్నది. ఈ జలపాతానికి గేరుసొప్ప లేదా జోగోడా గుండి అనే పేర్లు కూడా ఉన్నాయి. షిమోగ నుంచి జోగ్ జలపాతానికి బస్సు, ఇతర రవాణా సౌకర్యాలు ఉన్నాయి. శరావతి నది 829 అడుగుల నుండి పడుతూ నాలుగు పాయలుగా విడిపోయి, వేర్వేరు ధారలుగా పడుతాయి.

రాజ: జలపాతం చాలా నిర్మలంగా సౌమ్యంగా ఉన్న రాజు మాదిరిగా ఉండడం వల్ల దీనికి రాజు అని పేరు పెట్టారు.

రోరర్: ఈ జలపాతం పెద్ద పెద్ద రాళ్ల మధ్య నుండి పెద్ద పెద్ద శబ్దాలు చేస్తూ కింద పడుతుండడం వల్ల రోరర్ అని పేరు పెట్టారు.

రాకెట్: అత్యంత వేగంతో సన్నటి ధారగా రాకెట్టు మాదిరిగా ఉండడం వల్ల దీనికి రాకెట్టు అని పేరు.

రాణి: వయ్యారాలు, వంపులు పోతూ పడే రాణి అని పిలుస్తారు.



వన్యప్రాణులకు అధిక భద్రత!

భద్ర...ఒక వన్యప్రాణుల సంరక్షణాలయం. దీనినే భద్ర వైల్డ్‌లైఫ్ శాంక్చువరీ అని కూడా అంటారు. ఇది చిక్కమగళూరు జిల్లాలో ఉంది. పడమటి కనుమలలో ఉన్న ఈ అటవీ ప్రదేశాన్ని పులుల సంరక్షణాలయంగా కూడా నిర్వహిస్తున్నారు. ఈ శాంక్చువరీని 1958లో స్థాపించారు. అప్పటినుండి ఎంతో అభివృద్ధి సాధించి నేటికి అది అధిక విస్తీర్ణంతో భద్ర వైల్డ్ లైఫ్ శాంక్చువరీగా పేరొందింది. దీని విస్తీర్ణం సుమారు 492 చ.కి.మీ.లు. చిక్కమగళూరు పట్టణానికి ఇది 38 కి.మీ. బెంగళూరు నగరానికి 282 కి. మీ. దూరంలో ఉంది. ఈ అటవీ ప్రాంతంలో వివిధ జాతుల మొక్కలు, జంతువులు కూడా ఉన్నాయి. మొక్కల జాతులు సుమారు 120 రకాల వరకు ఉంటాయి.




వాటిలో టేకు, రోజ్‌వుడ్, బ్యాంబూ, జాక్ ఫ్రూట్ అంటే పనస వంటివి ప్రధానంగా కనపడతాయి. జింకలు, సాంబర్, మచ్చల జింకలు, చిరుతలు, లేళ్ళు, దుప్పులు, మలబార్ ఉడుతలు, ఏనుగులు కూడా ఈ అటవీ ప్రాంతంలో సంచరిస్తూ ఉంటాయి. మొక్కలను తిని జీవించే జంతువులే కాక, మాంసాహారం తినే పులులు, అడవి కుక్కలు వంటివి కూడా ఈ ప్రాంతంలో ఉన్నాయి. నక్కలు, ఎలుగుబంట్లు, ముంగీసలు, చిరుత పిల్లులు కూడా ఉన్నాయి. భద్ర ప్రాంతం టైగర్ ప్రాజెక్ట్ ఒక భాగంగా 1998 లో ప్రకటించారు. 250 పక్షి జాతులతో పక్షుల ప్రియులకు స్వర్గంగా ఉంటుంది. ఎన్నో చిలుకలు, పావురాలు, వడ్రంగి పిట్టలు, మైనాలు, వివిధ రకాల అటవీ పక్షులు కనపడతాయి. ఎన్నో రకాల పాములు, మొసళ్ళు, నాగుపాములు, వైపర్లు, సాధారణ పాములు, ర్యాట్ స్నేక్స్, పిట్ వైపర్లు, వంటివి కూడా చూడవచ్చు. రంగు రంగుల సీతాకోక చిలుకలు కూడా ఆహ్లాదాన్నిస్తాయి. అటవీ శాఖ పర్యాటకులకు ట్రెక్కింగ్, క్యాంపింగ్, రాక్ క్లైంబింగ్, బర్డ్ వాచింగ్, బోటింగ్ సౌకర్యాలు ఏర్పరిచింది.

ప్రయాణాల్లో ఆహార చిట్కాలు

వెకేషన్‌కో, హాలీడేస్‌లోనో టూర్ ప్లాన్ చేసుకుంటారు. అయితే ప్రయాణంలో డైట్ విషయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోకపోతే టూర్ మొత్తం అప్సెట్ అయ్యే అవకాశం ఉంటుంది. ఎక్కడ పడితే అక్కడ, ఏ ఫుడ్ పడితే ఆ ఫుడ్ తింటే కొత్త సమస్యలు వచ్చి పడతాయి. అందుకే టూర్ ప్లాన్ చేస్తున్నట్లయితే ఈ కింది చిట్కాలు దృష్టిలో పెట్టుకోవాలి.



- డ్రైఫ్రూట్స్, నట్స్, పండ్లను తీసుకెళ్లాలి. ట్రావెలింగ్ హెల్దీ స్నాక్స్ అంటే ఇవే. ఎనర్జీ లెవెల్స్‌ను పెంచడానికి ఇవి బాగా ఉపయోగపడతాయి. వాల్నట్స్, పిస్తా, బాదం, క్రాన్‌బెరీ వంటి వాటిని ఎంచుకోవచ్చు. దొరికిన ఆహారాన్ని అతిగా కాకుండా మితంగా తింటే సరిపోతుంది. ఈ జాగ్రత్తలు తీసుకున్నట్లయితే టూర్లో అనారోగ్య సమస్యలు దరిచేరకుండా ఉంటాయి.
- ప్రతి రెండు గంటలకొకసారి కొద్దిగా ఆహారం తీసుకోవాలి. దీనివల్ల జీర్ణక్రియ బాగా అవుతుంది. ఉప్పు తీసుకోవడం తగ్గించాలి. తాజా పండ్లు తీసుకోవాలి.
- సోడా, కూల్‌డ్రింక్స్‌కు సాధ్యమైనంత వరకు దూరంగా ఉండాలి. దీనివల్ల పొట్ట ఆరోగ్యంగా ఉండటమే కాకుండా హార్మోన్ల స్థాయి పెరుగుతుంది. చీజ్, బీన్స్, చేపలు వంటి వాటిలో ప్రొటీన్స్, అమైనో యాసిడ్స్, ఫ్యాటీయాసిడ్స్ పుష్కలంగా లభిస్తాయి. ఇవి హార్మోన్ల నియంత్రణలో బాగా ఉపయోగ పడతాయి. తరచుగా నీళ్లు తాగుతుండాలి. దీనివల్ల శరీరం డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉంటుంది.
- టూర్‌కు వెళ్లినపుడు రెస్టారెంట్లలో, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో తినవలసివస్తే సాస్, ఫ్రైడ్ ఫుడ్, చీజ్ వంటి వాటికి దూరంగా ఉండాలి.



ప్రకృతి పరంగా ఎత్తైన కొండలు, లోతైన లోయలు, అభయారణ్యాలు, పముఖ ఆధ్యాత్మిక కేంద్రాలతో ఎంతో ప్రశాంతంగా కనబడుతుంది నేపాల్. నేపాల్... మనకు బాగా తెలిసిన మన పొరుగు దేశం. భారత దేశంతో పాటు ఇది చైనా సరిహద్దుల్ని పంచుకుంటుంది. హిమాలయ పర్వతాల్ని పంచుకునే అయిదు దేశాలైన భూటాన్, భారత్, చైనా, పాకిస్థాన్లతో పాటు ఇదొకటి. ప్రపంచంలోనే ఎత్తయిన పది పర్వతాల్లో ఎనిమిది నేపాల్లోనే ఉన్నాయి. అత్యంత ఎత్తయిన ఎవరెస్టు పర్వతం ఉన్నది ఇక్కడే. మౌంట్‌ఎవరెస్టును ఇక్కడ సాగరమాత అని పిలుస్తారు. పర్యాటకులకు భూతలస్వర్గమనే చెప్పాలి. ఒకసారి చూస్తే మళ్లీ మళ్లీ చూడాలనిపించే ప్రకృతి అందాల నేపాల్‌ను మనమూ దర్శిద్దాం రండి.

భూతల స్వర్గం

నేపాల్

ప్రపంచంలో అత్యధికంగా పర్యాటకులను ఆకర్షించే దేశాలలో నేపాల్ ఒకటి. అక్కడి ప్రకృతి రమణీయత, హిందు, బౌద్ధ మతాలకు చెందిన సంప్రదాయాలు, ట్రెక్కింగు, రాఫ్టింగు వంటి సాహస క్రీడలు పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తాయి. ఆకాశానికి తాకుతున్నాయా అన్నట్టున్న హిమాలయాలు, పాతాళ లోకంలో వున్నాయా అన్నట్టుండే లోయలు, నదులు, సెలయేళ్లు, జలపాతాలు, హిందువులకు అత్యంత పవిత్రమైన ఆధ్యాత్మిక కేంద్రాలు, ఆలయాలు, బౌద్ధులకు అతి పవిత్రమైన ప్రార్థనా మందిరాలు ఉన్న నేపాల్ పర్యాటకులకు నయనానందకరం చేసే దేశం. నేపాల్ దేశానికి ముఖ్యమైన ఆదాయ వనరు కూడా పర్యాటకమే.



ఆకట్టుకునే పోక్రా

నేపాల్‌లోని ముఖ్యమైన పట్టణాలలో పోక్రా ఒకటి. ఇది అతిచిన్న పట్టణం. కొండకోనల్లో కట్టిన ఇళ్లతో సుందరంగా ఉంటుంది. పట్టణానికి కొంచెం దూరంలో మంచు తో కప్పబడిన హిమాలయ పర్వతాలు కనువిందు చేస్తా యి. వెండి కొండల్లా ప్రకాశిస్తున్న ఆ హిమాలయాలను దగ్గర నుండి చూడడానికి విమాన సౌకర్యం ఉంది. సూర్యోదయానికి కొంత ముందు దాని తర్వాత హిమాలయాల అందాలను చూడడానికి రెండు కళ్లు సరిపోవంటే అతిశయోక్తి కాదు. సూర్యోదయానికి ఇంకా కొన్ని నిముషాలుండగా ఆకాశం ఎర్ర బడుతుంది. అప్పుడు ఆ మంచు కొండలు బంగారు కాంతితో మెరిసిపోతాయి.

దేవి జలపాతం

ఆకట్టుకునే దేవి జలపాతం పోక్రాలోనే ఉంది. సాధారణంగా జలపాతాలను కింద నుండి పైకి చూస్తారు. కాని ఈ జలపాతాన్ని పైనుండి కిందికి చూడాలి. అంటే కొండ పైకెక్కి చూడాలని కాదు. భూమి పైనుండే విశాలమైన బావిలోకి చూడాలి. ఆ బావి చుట్టూ ప్రమాద నివారణకు ఇనుప పట్టీలతో కంచె ఏర్పా టు చేశారు. దాని అంచున నిలబడి బావిలోకి చూడాలి. లోపల బావి దరిలోనుండి అతి పెద్ద జల ప్రవాహం వచ్చి చాలా లోతున్న బావిలోకి పడుతుంది. ఆ ప్రవాహం ఎక్కడి నుండి వస్తుందో తెలియదు.

రాజధాని నగరం ఖాట్మండ్

కొండల మధ్యన మైదాన ప్రాంతం లో ఖాట్మండ్ ఉంది. ఇది నేపాల్‌లో అతి పెద్ద పట్టణం, దేశ రాజధాని. ఈ దేశంలోని వాహనాలు చాల పాతవి. పాత జీపుల్లాంటి వాహనాలే ఇక్కడి ప్రయాణ సాధనాలు. ఖాట్మండులో ఒక ఆకర్షణ అక్కడి జూద గృహాలు. వీటిని కాసినోలు అంటారు. మద్యం సేవిస్తూ, అర్ధనగ్న నృత్యాలను వీక్షిస్తూ జూదం ఆడుతారు. ఈ జూదం ఆడడానికే ఇతర దేశాలనుండి పర్యాటకులు వస్తుంటారు. ప్రభుత్వానికి ఇదొక ఆదాయ వనరు.

రుద్రాక్షలకు నెలవు

ఇక్కడ రుద్రాక్ష చెట్లెక్కువ. అందువల్ల రుద్రాక్షలు ఎక్కువగా, చాలా చవకగా దొరుకుతాయి. కొందరు పర్యాటకులు రుద్రాక్ష కాయలను కిలోల లెక్కన కొంటారు. వాటిని పగుల గొట్టి చూస్తే వారి అదృష్టం పండి అందులో ఒకటి రెండు ఏకముఖి రుద్రాక్షలు దొరికాయంటే వారి పంట పండినట్లే. వాటి ధర ఒక్కోటి కొన్ని వేల రూపాయలుంటుంది.

మనోకామని దేవాలయం

పోక్రా నుండి ఖాట్మండుకు వెళ్లే దారిలో ఈ మనో కామని ఆలయం ఒక పెద్ద కొండపై ఉంది. రోడ్డు కానుకొని త్రిశూల్ నది ప్రవహిస్తుంటుంది. నదిఆవల రెండు మూడు కొండలకవతల ఒక కొండపై ఈ ఆలయం ఉంది. అక్కడికి వెళ్లడానికి రోప్‌వే ఉంది. అందు లో వెళుతుంటే కింద నది, లోయలు, కొండవాలులో పంటలు చాలా మనోహరంగా ఉంటుంది. ఇక్కడి అమ్మవారు కోరికలు నెరవేరుస్తుందని భక్తుల నమ్మకం. ఇది చాలా పురాతన ఆలయం. ఈ ఆలయం వెనుక ఒక జంతువధశాల ఉంది. ఇక్కడ తరచూ దేవి జంతుబలులు ఇస్తుంటారు.

పశుపతి నాథ్ ఆలయం

పశుపతినాథ్ శివాలయం చాల విశాలమైంది. గుడి గర్భాలయం చతురస్రాకారంలో వుండి నాలుగు వైపుల ద్వారాలు కలిగి వుంటాయి. మధ్యలో వున్న శివ లింగానికి నాలుగు వైపుల నాలుగు ముఖాలుంటాయి. అవి ధర్మార్థకామ మోక్షాలకు ప్రతీకలని నమ్మకం. నాలుగు ద్వారాల వద్ద నలుగురు పండితులు వుండి పూజలు చేయిస్తుంటారు. ఈ ఆలయంలోకి హిందువులకు మాత్రమే ప్రవేశం వుంటుంది. ఈ ఆలయం వెనుక వైపున భాగమతి నది ఉంది. అక్కడే అతి పెద్ద శ్మశానం ఉంది. అక్కడ ఎప్పుడూ శవాలు కాలుతూనే వుంటాయి.

మహావిష్ణు ఆలయం

శేషశయనునిపై పవళించినట్లున్న మహావిష్ణువు నల్లరాతి భారీ విగ్రహం తక్కువ లోతు నీళ్లున్న కోనేరులో తేలియాడుతున్నట్లుంటుంది. భక్తులు నీళ్లలోకి దిగి పూజలు చేస్తుంటారు. పురాతనమైన ఈ విగ్రహం చేతులలో శంఖం, చక్రం, గద ఆయుధాలున్నాయి. ఇది స్వయంభువని, బుద్ధుని అవతారమని ఇక్కడి వారి నమ్మిక.

ముక్తినాథ ఆలయము

హిందువులు పవిత్రంగా బావించే నూట ఎనిమిది వైష్ణవ దివ్యధామాలలో ముక్తినాథ ఆలయం 106 వది. పోక్రా నుండి ముక్తినాథ్ ఆలయానికి వెళ్లడానికి చిన్న చిన్న విమానాలు నడుపుతుంటారు. అవికూడ వాతావరణం సరిగా లేకుంటే నడపరు. ముక్తి నారాయణుడు స్వయంభువు. పద్మాసనంలో కూర్చున్న మూర్తి. నూట ఎనిమిది ధారలలో నీళ్లు పడుతుంటాయి. ఆ నీళ్లను నెత్తిన చల్లుకుంటే నూట ఎనిమిది దివ్యధామాలు దర్శించుకున్నంత ఫలితం వస్తుందని భక్తుల నమ్మకం.

భక్తాపూర్

నేపాల్ దేశంలో భక్తాపూర్ ఒక చిన్న పట్టణం. గతంలో ఇది ఇక్కడి ఒక రాజ్యానికి రాజధాని. ఈ నగరంలో చూడవలసిన అనేక దేవాలయాలు, రాజరికపు కట్టడాలు ఉన్నాయి. పశుపతినాథ్ ఆలయాన్ని పోలిన దేవాలయాలు అనేకం వున్నాయి. కాని అన్నీ శివాలయాలే. రాజ దర్బారు హాలు చాలా గంభీరంగా వుంటుంది. ఇక్కడే దుర్గమ్మ వారి ఆలయం ఒకటి ఉంది. ఇది ఆలయం లాగ కాకుండ ఇల్లు లాగ వుంటుంది. ఈ ఆలయాన్ని కేవలం దసరా సందర్భంలో మాత్రమే తెరుస్తారు. లోపల ఎంతో సంపద వున్నట్లు స్థానికులు చెపుతారు.



సూర్యోదయ వీక్షణ

ఖాట్మండుకు సుమారు వంద కిలో మీటర్ల దూరంలో ఒక కొండ మీద ఉదయిస్తున్న సూర్యుని చూడడానికి ఒక కేంద్రం ఉంది. సూర్యోదయానికి ముందే అక్కడికి చేరుకోవాలి. అక్కడికి వెళ్లే దారి సన్నగాను మలుపులు తిరిగి వుంటుంది. కనుక పెద్ద వాహనాలు వెళ్లలేవు. చిన్న వాహనాలలో వెళ్లాలి. కొండ ఎత్తుగా వున్నందున సుదూర ప్రాంతం చక్కగా కనబడుతుంది.ఆ సూర్యోదయ దృశ్యం చాలా అద్భుతంగా వుంటుంది.

ఎవరెస్టు శిఖరం

ఈ శిఖరం ప్రపంచంలోనే ఎత్తైంది. దీనిని నేపాలీలో సాగరమాత అనీ, టిబెట్ భాషలో ఖోమోలోంగ్మ అనీ పిలుస్తారు. ఇది నేపాల్–చైనా సరిహద్దులో ఉంది. సమున్నతమైన ఎవరెస్టు శిఖరం, హిమాలయ పర్వత సానువులతో బాటు, ప్రపంచంలో 8000 మీ. దాటిన పది ఎత్తైన శిఖరాలలో ఎనిమిది నేపాలులోనే ఉన్నాయి. ఇవి పర్యాటకులకు ముఖ్య ఆకర్షణ.

... మధుకర్ వైద్యుల



నిపుణ — విద్య ఉద్యోగ సమాచారం —

నాన్ ఎగ్జిక్యూటివ్‌లు

ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్‌జీసీ) లిమిటెడ్ వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ టెక్నీషియన్ తదితర పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

- మొత్తం ఖాళీల సంఖ్య–309
- **విభాగాలవారీగా:** జూనియర్ అసిస్టెంట్ –35, జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్–131, జూనియర్ మోటార్ వెహికిల్ డ్రైవర్–13, జూనియర్ స్లింగర్ కమ్ రిగ్గర్–2, జూనియర్ సెక్యూరిటీ సూపర్‌వైజర్–2, జూనియర్ ఫైర్ సూపర్‌వైజర్–4, మెడికల్ అసిస్టెంట్–14, ఫార్మసిస్ట్–9, జూనియర్ హెల్త్ అటెండెంట్–6, అసిస్టెంట్ టెక్నీషియన్–79, టెక్నికల్ అసిస్టెంట్–10 తదితర ఖాళీలు ఉన్నాయి.
- **అర్హత:** సంస్థ నిబంధనల ప్రకారం
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **ఎంపిక:** కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్/ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆన్‌లైన్ ద్వారా
- **చివరితేదీ:** జనవరి 27
- **కంప్యూటర్ బేస్డ్ టెస్ట్:** 2019 మార్చిలో
- **వెబ్‌సైట్:** www.ongcindia.com

ఎన్‌డీఏ & ఎన్‌ఏ ఎగ్జామినేషన్ 2019

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్‌డీఏ) & నేవల్ అకాడమీ (ఎన్‌ఏ) ఎగ్జామినేషన్ (I)-2019కు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేసింది.



- **మొత్తం పోస్టులు:** 392
- నేషనల్ డిఫెన్స్ అకాడమీ: 342 ఖాళీలు (ఇండియన్ ఆర్మీ–208, ఇండియన్ నేవీ–42, ఇండియన్ ఎయిర్‌ఫోర్స్–92)
- ఇండియన్ నేవల్ అకాడమీ–50 ఖాళీలు (10+2 క్యాడెట్ ఎంట్రీ స్కీమ్)
- **అర్హతలు:** ఆర్మీ వింగ్ (ఎన్‌డీఏ) విభాగానికి.. ఇంటర్/10+2 లేదా తత్సమాన పరీక్ష. ఎయిర్ ఫోర్స్/నేవల్ (ఎన్‌డీఏ)/ఇండియన్ నేవల్ అకాడమీ విభాగానికి.. ఫిజిక్స్, మ్యాథమెటిక్స్ సబ్జెక్టులతో ఇంటర్ లేదా 10+2లో ఉత్తీర్ణత. ఇంటర్ చివరి ఏడాది చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

శారీరక ప్రమాణాలు:

- **ఎత్తు:** 157.5 సెంటీమీటర్లు, (ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ 162.5 సెంటీమీటర్లు). ఎత్తుకు తగ్గ బరువును కలిగి ఉండాలి.
- **ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్‌లో..** 15 నిమిషాల్లో 2.4 కి.మీ. దూరాన్ని పూర్తిచేయాలి..స్కిప్పింగ్,3–4 మీటర్ల రోప్ క్లైంబింగ్, 20 పుష్ అప్‌లు, 8 చిన్‌అప్‌లు చేయాలి.
- ఎన్‌డీఏ & ఎన్‌ఏ ఎగ్జామినేషన్‌ను ప్రతిఏటా రెండుసార్లు యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహిస్తుంది. ఈ ఎగ్జామ్ ద్వారా ఇండియన్ ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లో ఎగ్జిక్యూటివ్, టెక్నికల్ విభాగాల్లోని ఖాళీలను భర్తీచేస్తారు.
- **వయస్సు:** 2 జూలై 2000 నుంచి 1 జూలై 2003 మధ్య జన్మించిన అవివాహిత పురుష అభ్యర్థులు మాత్రమే అర్హులు
- **అప్లికేషన్ ఫీజు:** రూ. 100/– జనరల్/ఓబీసీ (ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఫీజు లేదు)
- **జీతభత్యాలు:** రూ. 56,100/– శిక్షణ సమయంలో స్టయిఫండ్ చెల్లిస్తారు.
- **ఎంపిక:** రాతపరీక్ష, ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూ ద్వారా
- రాతపరీక్ష మొత్తం 900 మార్కులకు ఉంటుంది. దీనిలో పేపర్–1 (మ్యాథమెటిక్స్)–300 మార్కు లు, పేపర్–2 (జనరల్ ఎబిలిటీ టెస్ట్)–600 మార్కులు, ప్రతి పేపర్‌కు 150 నిమిషాలు కేటాయించారు.
- ఎస్ఎస్‌బీ టెస్ట్/ఇంటర్వ్యూకు 900 మార్కులు.
- మొత్తం (రాతపరీక్ష+ఎస్ఎస్‌బీ టెస్ట్/ఇంటర్వ్యూ) –1800 మార్కులకుగాను అత్యధిక ప్రతిభ చూపిన అభ్యర్థులను ఎంపిక చేసి ట్రెయినింగ్ ఇస్తారు.
- ఎంపికైన అభ్యర్థులలో విజయవంతంగా శిక్షణ పూర్తిచేసిన వారికి జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంచే ఆర్మీ క్యాడెట్స్–బీఎస్సీ/బీఎస్సీ (కంప్యూటర్)/ బీఏ, నేవల్ క్యాడెట్స్ – బీటెక్, ఎయిర్ పోర్స్ క్యాడెట్స్ – బీటెక్ డిగ్రీ సర్టిఫికెట్లను ప్రదానం చేస్తారు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరితేదీ:** ఫిబ్రవరి 4 (సాయంత్రం 6 గంటల వరకు)
- **రాతపరీక్ష:** ఏప్రిల్ 21
- **వెబ్‌సైట్:** www.upsc.gov.in

ఐఐటీల్లో ఎంబీఏ ప్రవేశాలు

దేశంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)లలో రెండేండ్ల పోస్టు గ్రాడ్యుయేట్ మేనేజ్‌మెంట్ ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదలైంది.

- **కోర్సుపేరు:** ఏంబీఏ
- **పాల్గొనే ఐఐటీలు:** బాంబే, ఢిల్లీ, ధన్‌బాద్, కాన్పూర్, ఖరగ్‌పూర్, మద్రాస్, రూర్కీ
- **అర్హత:** ఏదైనా బ్యాచిలర్ డిగ్రీతోపాటు క్యాట్ –2018లో మంచి స్కోర్ సాధించాలి.
- **అప్లికేషన్ ఫీజు:** రూ. 1600/– (ఎస్సీ/ఎస్టీలకు రూ. 800/–)
- **ఎంపిక:** క్యాట్–2018 ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** జనవరి 27
- **వెబ్‌సైట్:** www.doms.iitm.ac.in

డీటీయూలో టెక్నికల్ అసిస్టెంట్లు

న్యూఢిల్లీలోని ఢిల్లీ టెక్నలాజికల్ యూనివర్సిటీ (డీటీయూ)లో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న టెక్నికల్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

- **మొత్తం పోస్టులు:** 33
- **విభాగాలవారీగా:** జూనియర్ మెకానిక్–19, జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్–1, టెక్నికల్ అసిస్టెంట్–10, అసిస్టెంట్ ప్రోగ్రామర్–2, జూనియర్ ఇంజినీర్ (ఎలక్ట్రికల్)–16
- **అర్హత:** యూనివర్సిటీ నిబంధనల ప్రకారం
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఫిబ్రవరి 20
- **వెబ్‌సైట్:** www.dtu.ac.in

ఏఐఏటీఎస్ఎల్‌లో

కోల్‌కతాలోని ఎయిర్ ఇండియా ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ సర్వీసెస్ లిమిటెడ్ (ఏఐఏటీఎస్ఎల్) కాంట్రాక్ట్ ప్రాతిపదికన (మూడేండ్లు) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

- **మొత్తం పోస్టులు:** 89
- **విభాగాలవారీగా ఖాళీలు:** సీనియర్ ర్యాంప్ సర్వీస్ ఏజెంట్–4, ర్యాంప్ సర్వీస్ ఏజెంట్–25, యుటిలిటీ ఏజెంట్ కమ్ ర్యాంప్ డ్రైవర్–58, ర్యాంప్ సర్వీస్ ఏజెంట్/యుటిలిటీ ఏజెంట్ కమ్ ర్యాంప్ డ్రైవర్–2
- **అర్హత:** గుర్తింపు పొందిన బోర్డు/సంస్థ నుంచి మూడేండ్ల డిప్లొమా లేదా పదోతరగతితోపాటు సంబంధిత ట్రేడుల్లో ఐటీఐ ఉత్తీర్ణత. డ్రైవర్ పోస్టులకు హెచ్‌ఎంవీ డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి.
- **ఎంపిక:** స్క్రీనింగ్ టెస్ట్, ట్రేడ్ టెస్ట్, ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **ఇంటర్వ్యూ తేదీ:** జనవరి 12
- **వెబ్‌సైట్:** www.airindia.in

కీర్తిసురేష్ ప్రధాన పాత్రలో..



కల్యాణిమాలిక్, నరేంద్ర, కీర్తి సురేష్, కల్యాణ్‌రామ్, మహేష్ కోనేరు

మహానటి సావిత్రి పాత్రలో అసమాన నటనను ప్రదర్శించి విమర్శకుల ప్రశంసలందుకున్నారు కీర్తిసురేష్. ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం గురువారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. నరేంద్ర దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. ఈస్ట్ కోస్ట్ ప్రొడక్షన్స్ పతాకంపై మహేష్ కోనేరు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. పూజా కార్యక్రమాల అనంతరం కీర్తిసురేష్‌పై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి నందమూరి కల్యాణ్‌రామ్ క్లాప్‌నివ్వగా, వెంకీ అట్లూరి, నిర్మాత బి.వి.ఎస్.ఎన్. ప్రసాద్ కెమెరా స్విఛాన్ చేశారు. హరీష్‌శంకర్ గౌరవ దర్శకత్వం వహించారు. కీర్తిసురేష్ మాట్లాడుతూ 'తెలుగులో 'మహానటి' తరువాత వస్తున్న సినిమా ఇది. మహిళా ప్రధానమైన చిత్రంలో నటించడం ఆనందంగా వుంది. ప్రతి అమ్మాయికి కనెక్ట్ అవుతుంది. అత్యధిక భాగం యుఎస్‌లో చిత్రీకరణ జరుపుకోనుంది. డైరెక్టర్ నరేంద్ర మంచి కథ సిద్ధం చేశారు. తప్పకుండా ఈ సినిమాతో తెలుగు ప్రేక్షకులకు మరింత దగ్గరవుతాననే నమ్మకముంది' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ '2016 నుంచి ఈ కథపై పనిచేస్తున్నాను. తరుణ్ నాకు సహకారం అందించారు. అన్ని కలగలిపిన కథ ఇది. ఈ కథకు కీర్తిసురేష్ మినహా ఎవరూ న్యాయం చేయలేరు. ఇరవై ఐదు శాతం ఇండియాలో...75 శాతం యుఎస్‌లో చిత్రీకరణ చేస్తాం. ఫిబ్రవరిలో చిత్రీకరణ మొదలవుతుంది. ఏప్రిల్ నుంచి యుఎస్ షెడ్యూల్ వుంటుంది' అన్నారు. మహేష్ కోనేరు మాట్లాడుతూ ''మహానటి' చిత్రంతో కీర్తిసురేష్ తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో మంచి స్థానాన్ని సొంతం చేసుకున్నారు. ప్రతి మహిళా తన జీవితంలో ఏదో ఒక సందర్భంలో ఎదుర్కొనే అంశం నేపథ్యంలో సాగే చిత్రమిది. మహిళా ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకుంటుంది. చిత్రానికి సంబంధించిన నటీనటులు, సాంకేతిక నిపుణుల పూర్తి వివరాలు త్వరలో తెలియజేస్తాం' అన్నారు.



బోయపాటి శ్రీను సినిమాలంటేనే భారీతనానికి పెట్టింది పేరు. రొమాంచితమైన పోరాట ఘట్టాలు, తెర నిండుగా పరచుకునే కుటుంబ అనుబంధాలు, కథానాయకుడి ధీరత్వ ప్రదర్శన వెరసి జనరంజకమైన వాణిజ్య సినిమాకు చిరునామాగా అనిపిస్తాయి. 'నా దృష్టిలో సినిమా సంక్రాంతిలాంటిది. భోగీలోని తియ్యదనం, సంక్రాంతిలోని ఆప్యాయతానురాగాలు, కనుమనాటి కోడిపుంజుల కొట్లాట..ఇలా భిన్న భావోద్వేగాలకు దృశ్యరూపంగా సినిమాను భావిస్తాను' అన్నారు బోయపాటి శ్రీను. ఆయన దర్శకత్వంలో రామ్‌చరణ్ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం 'వినయ విధేయ రామ' నేడు విడుదలవుతున్నది. ఈ సందర్భంగా గురువారం బోయపాటి శ్రీను పాత్రికేయులతో ముచ్చటించారు.



బోయపాటి శ్రీను

ఆ అర్హత వందశాతం నాకే ఉంది!

ఈ సినిమాలో రాముడు ఎవరికి విధేయుడిగా కనిపిస్తారు?

తనను నమ్మిన వారికి, ఉపకారం చేసిన వారికి కృతజ్ఞులై ఉండేవారిని విధేయులు అంటాం. ఈ సినిమాలో కథానాయకుడైన రాముడు తన కుటుంబానికి, సాయం కోరి వచ్చిన ఆశ్రితులకు విధేయుడై ఉంటాడు. వారిని కంటికిరెప్పలా కాపాడుకుంటూ కష్టాల నుంచి గట్టెక్కిస్తాడు. ఈ అభినవ రాముడి విధేయత ఎలా వుంటుందో తెరపై చూస్తేనే అర్థమవుతుంది.

ట్రైలర్ చూస్తే సినిమాలో యాక్షన్ దండిగా ఉన్నట్లు కనిపిస్తున్నది. సాఫ్ట్ టైటిల్‌తో సినిమా తీస్తూ పోరాట ఘట్టాల్ని ఎక్కువగా చూపించారెందుకని?

ట్రైలర్ చూస్తే అభిమానులు సంతృప్తిగా ఫీలవ్వాలి. వాళ్లు సినిమాపై ఎన్నో ఆశలు పెట్టుకుంటారు. రొమాంచితమైన యాక్షన్ ఘట్టాలు అభిమానుల్ని బాగా ఆకట్టుకుంటాయి. వారికోసమే ట్రైలర్‌లో యాక్షన్ ఘట్టాల్ని ఎక్కువగా చూపించాం. అయితే ఈ సినిమాలో పోరాట దృశ్యాలు కేవలం ఓ పార్శ్వం మాత్రమే. మిగతా కథంతా చక్కటి కుటుంబ అనుబంధాలు, మనవైన అప్యాయతల కలబోతగా ప్రతి ఒక్కరి హృదయాన్ని కదిలిస్తుంది.

ఈ సినిమా షూటింగ్‌కు కొంచెం ఎక్కువ సమయం తీసుకున్నారని తెలిసింది?

నాలుగేళ్ల ముందే రామ్‌చరణ్‌కు ఈ కథ చెప్పాను. ఇందులో కథానుగుణంగా హీరో ఐరన్‌మేన్‌లా అత్యంత శక్తివంతమైన లుక్‌తో కనిపించాలి. చక్కటి పరిణితి కలిగిన యువకుడిలా అనిపించాలి. మరికొంత సమయం తీసుకుంటే రామ్‌చరణ్‌లో ఆ లక్షణాలన్నింటిని రాబట్టుకోవచ్చని అనుకున్నాను. అందుకే ఈ సినిమా కార్యరూపం దాల్చడం కొంచెం ఆలస్యమైంది.

మీ సినిమాల్లో యాక్షన్, హింస పాలు ఎక్కువనే విమర్శలున్నాయి?

'భద్ర' నుంచి నా సినీ ప్రయాణాన్ని పరిశీలిస్తే ప్రతి చిత్రంలో కుటుంబ అనుబంధాల ఆవిష్కరణ, సమాజం పట్ల బాధ్యత కనిపిస్తుంది. ఈ రెండు అంశాలకు దూరంగా నేనెప్పుడు సినిమాలు తీయలేదు. యాక్షన్, హింస అనేవి కథ డిమాండ్ మేరకు అవసరమైన చోటే ఉంటాయి. అంతేకాని అవే ప్రధానంగా కనిపించవు. సినిమాలో నేను ఓ దెబ్బ కొట్టినట్లు చూపించినా అందులో కూడా భావోద్వేగం ఉంటుంది. అర్థంలేకుండా యాక్షన్ ఘట్టాల్ని కథలో చూపెట్టను. కుటుంబ కథా చిత్రాల దర్శకుడినని ప్రకటించుకునే అర్హత వందకు వందశాతం నాకే ఉందనుకుంటున్నాను.

ఈ సినిమాలో రామ్‌చరణ్ పాత్రను ఎలా తీర్చిదిద్దారు. ఆయనతో తొలిసారి సినిమా చేయడం ఎలాంటి అనుభూతినిచ్చింది?

ఈ సినిమా విషయంలో రామ్‌చరణ్ నేను కోరుకున్నవన్నీ ఇచ్చాడు. ఓ ఫైట్ సీక్వెన్స్ కోసం రెండున్నర నెలలు పూర్తిగా దృష్టిపెట్టమని చెప్పాను. అదే విధంగా కష్టపడి బాడీ బిల్డింగ్ చేశాడు. దర్శకుడిగా నా విజన్‌కు, తెరపై కనిపించిన విజువల్‌కు రామ్‌చరణ్ ఓ వారధిలా నిలిచాడు. అందుకే సినిమా అద్భుతంగా తయారైంది.

నేను సెట్‌లో కొంచెం కఠినంగానే ఉంటాను. ఎందుకంటే నా సినిమాలన్ని భారీ తారాగణంతో ఉంటాయి. ఒక్క రోజు షూటింగ్‌కు కొన్ని లక్షల వ్యయం అవుతుంది. అందరిని సమన్వయం చేసుకొని అనుకున్న విధంగా చిత్రీకరణ పూర్తి చేయాలంటే కఠినంగానే వ్యవహరించాలి. నిర్మాతకు నష్టం చేయకూడదనే ఉద్దేశ్యంతో నేను అలా ప్రవర్తిస్తాను. అదే సమయంలో నటీనటులు, సాంకేతిక నిపుణులకు ఎలాంటి కష్టం రాకుండా చూసుకుంటాను. వ్యక్తిగతంగా ప్రతి ఒక్కరికి గౌరవమిస్తాను.

నటీనటులకు కథను చెప్పే సమయంలో మీరు తీవ్రమైన భావోద్వేగాల్ని ప్రదర్శిస్తారని, సన్నివేశాల తాలూకు బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌తో సహా కథను వినిపిస్తారని చెబుతుంటారు?

అవును. నా స్టైల్ అలాగే ఉంటుంది. నా దృష్టిలో సినిమా ఓ పండగ. ఒక మరచిపోలేని అనుభవం. ఓ దర్శకుడిగా నేను ఆవిష్కరించేబోయే పాత్రల్ని బాగా ప్రేమిస్తాను. వాటిలో పరకాయప్రవేశం చేసి నటీనటులను ఇంప్రెస్ చేయాలనుకుంటాను. నటించబోయే తారల కంటే పదిరేట్లు గొప్పగా పాత్రల స్వభావాన్ని తెలియజెప్పాలన్నది నా సిద్ధాంతం. అందుకే నా కథా వర్ణన మిగతా దర్శకులకంటే భిన్నంగా ఉంటుంది.

రామ్‌చరణ్ ఏదో సాధించానని తృప్తిచెందే మనిషి కాదు. ఇంకా పైకి ఎదగాలి, మరిన్ని గొప్ప విజయాల్ని సాధించాలని తపిస్తుంటాడు. అతనిలో ఆ లక్షణం నాకు బాగా నచ్చింది. చిరంజీవి అందించిన యుద్ధట్యాంక్ లాంటివాడు రామ్‌చరణ్. పోరులో ముందుకు సాగిపోతూ, శత్రువుల్ని సంహరిస్తూ విజయం వైపు పయనిస్తూనే ఉంటాడు.

ఈ సినిమాలో వివేక్ ఒబెరాయ్ ప్రతి నాయకుడిగా నటించారు. ఆయన్ని ఎంచుకోవడానికి కారణమేమిటి?

నేను అనుకున్న పాత్రకు ఆయనే పక్కాగా సరిపోతాడనిపించింది. ముంబైకి వెళ్లి ఆయనకు కథ చెబుదామనుకున్నప్పుడు 'నేను తెలుగులో 'రక్తచరిత్ర' సినిమా చేశాను. అంతకుమించిన పాత్ర అనిపిస్తేనే నటిస్తాను' అని అన్నారాయన. అరగంట పాటు ఆయనకు కథ నరేట్ చేశాను. కథ విని వెంటనే డేట్స్ చూసుకోండని చెప్పారు. అంతలా ఆయన్ని ఆకట్టుకుందీ కథ.

మొదటి నుంచి వాణిజ్య విలువలున్న చిత్రాల్నే చేస్తున్నారు. మీ పంథాకు భిన్నంగా నవ్యమైన కథాంశాలతో సినిమాలు చేసే ఆలోచన ఉందా?

నేను చిన్న సినిమాలు చేయలేను. నా కథలు లార్జర్ దేన్ లైఫ్ ఇమేజ్‌ను కలిగి ఉంటాయి. సినిమా అంటే కలర్‌ఫుల్‌గా, ఉన్నతమైన భావోద్వేగాల కలబోతగా ఉండాలని నేను అభిలషిస్తాను. అయితే నేను ఎప్పుడూ ఒకే రకమైన కథల్ని ఎంచుకోను. నా సినీ ప్రయాణాన్ని గమనిస్తే కమర్షియల్ ఇతివృత్తాల్నే ఎంచుకున్నప్పటికి కథాపరంగా వైవిధ్యం కనిపిస్తుంది. పదిమంది చూసే సినిమాలు చేయాలన్నదే దర్శకుడిగా నా లక్ష్యం. ఎవరో ఒక్కరి కోసం సినిమాలు తీయడం నాకు ఇష్టం ఉండదు.

